




# గౌతమ్ న్యూస్

తెలుగు దిన పత్రిక






హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 218, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, సోమవారం - 16 - సెప్టెంబర్ - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

### ప్రధాని మోదీ కుటుంబంలోకి

## కొత్త సభ్యుడు 'దీప్ జ్యోతి'..

న్యూఢిల్లీ : ఢిల్లీలోని లోక్ కల్యాణ్ మార్గ్ లోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసానికి శనివారం కొత్త సభ్యుడు వచ్చాడు. ఆ సభ్యుడి వివరాలను ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లో పంచుకున్నారు. ఒక వీడియోను కూడా షేర్ చేశారు.'గావ్: సర్వసుఖా ప్రద:' అనే లేఖనాన్ని ప్రస్తావిస్తూ తన కుటుంబంలోకి కొత్త వ్యక్తి రాకను ప్రధాని మోదీ ప్రస్తావించారు. "'గావ్ సర్వసుఖ్ ప్రదాహ్' అని

మిగతా..2లో



## పదేళ్లు అధికారంలో ఉంటాం: సీఎం రేవంత్‌రెడ్డి

### 'ప్రాఫెట్ ఫర్ ద వరల్డ్' పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజలు వరుసగా రెండుసార్లు అవకాశం కల్పిస్తూ వస్తున్నారని, తాము కూడా పదేళ్ల పాటు అధికారంలో ఉండి మంచి పాలనతో పేదల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైపుల్లా రహ్మానీ రచించిన

మిగతా..2లో




## అందమైన జమ్మూకశ్మీర్‌ను దారుణంగా దెబ్బతీశాయి

### ఇక్కడి ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయి

మేము కేంద్రంలో అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది

వారసత్వ రాజకీయాలే పెనుశాపం



## ఈ రకమైన గుండాగిరి పదేళ్లలో ఎప్పుడూ లేదు

### - నగర ప్రజల మీద సీఎం రేవంత్ కక్ష గట్టారు




హైదరాబాద్ : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసి పోలీసులే దాడి చేయించారని కేటీఆర్ ఆరోపించారు. శనివారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన..తొమ్మిదిన్నర నెలలుగా అసమర్థుడి జీవనయాత్రలా

# "సీఎంగా కాదు.. ఒక అక్కగా వచ్చాను"

### దోషులపై చర్యలు

### ఇదే చివరి ప్రయత్నం

### మీ డిమాండ్లు పరిశీలిస్తాం..

### నిరసన విరమించబోమన్న వైద్యులు

### - వైద్యుల శిబిరం వద్ద మమత బెనర్జీ



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్ కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్లో జరిగిన అత్యాచారం, హత్య కేసుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వైద్యులను కలవడానికి శనివారం కోల్ కతాలోని స్వాస్థ్య భవన్ కు చేరుకున్నారు. సమస్య పరిష్కారానికి వైద్యులను సంప్రదించడానికి ఇదే చివరి ప్రయత్నం అని ఆమె నిరసనకారులతో చెప్పారు.తమ డిమాండ్లను పరిశీలించి ఎవరైనా దోషులుగా తేలితే చర్యలు తీసుకుంటామని ఆమె వైద్యులకు హామీ ఇచ్చారు. సాల్ట్ లేక్ లోని స్వాస్థ్య భవన్ వెలుపల 'మాకు న్యాయం కావాలి' అనే నినాదాల మధ్య నిరసన తెలుపుతున్న వైద్యులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. తాను ముఖ్యమంత్రిగా కాకుండా మీ 'దీదీ' (సోదరి)గా మిమ్మల్ని

మిగతా..2లో

## 'హైడ్రా'కు చట్టబద్ధత..

## వచ్చే నెలలోనే ఆర్డినెన్స్



హైదరాబాద్ : హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. త్వరలోనే తమ హైడ్రా విభాగానికి చట్టబద్ధత కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను విడుదల చేస్తుందని ఆయన వెల్లడించారు. హైడ్రా చట్టబద్ధతపై ప్రశ్నలు సంధిస్తున్న వారికి అతిత్వరలోనే సమాధానం లభిస్తుందని రంగనాథ్ చెప్పారు. అక్టోబరులోగా ఆర్డినెన్స్ విడుదలయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈవివరాలను వెల్లడించారు. తాజ్‌మహల్ ప్రధాన గుమ్మటం నుంచి నీటి లీకేజీ..ఆర్డినెన్స్ వచ్చాక హైడ్రాకు కొన్ని విశేష అధికారాలు కూడా లభిస్తాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. అక్టోబరులో ఆర్డినెన్స్ విడుదలవుతుందని..అది జరిగిన ఆరు వారాల తర్వాత అసెంబ్లీలో హైడ్రా బిల్లును ప్రవేశపెడతారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీలు, నీటిపారుదల విభాగాలు, రెవెన్యూ శాఖకు హైడ్రా సహాయ సహకారాలను అందిస్తుందని ఆయన తెలిపారు.

మిగతా..2లో



## వైసీపీకి రాజినామా టీడీపీ పార్టీ కండువాలు కప్పుకోలేదా..!!

విజయవాడ :ప్రభుత్వం మారిపోవడంతో వైసీపీలో పదవులు అనుభవించిన వారందరూ టీడీపీ వైపు చూస్తున్నారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్సీలు,రాజ్యసభ సభ్యులు పదవులకు రాజీనామా చేసి టీడీపీలో చేరుతామని ప్రకటించారు.ఇదే సమయంలో

## ఒకేసారి ఆరు వందేభారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని మోదీ



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఒకేసారి 6 వందేభారత్ రైళ్లను ప్రారంభించారు. మోదీ ఝూర్ఖండ్ లోని టాటా నగర్ జంక్షన్ రైల్వే స్టేషన్ టాటానగర్-పాట్నా వందేభారత్ రైలును ప్రారంభించారు. అదే సమయంలో మరో ఐదు రైళ్లను కూడా వర్చువల్ విధానంలో ప్రారంభించారు. మిగతా ఐదు రైళ్లు... భాగల్ పూర్-దుమ్కా-హౌరా... బ్రహ్మపూర్-టాటానగర్... గయ-హౌరా... దేవగఢ్-వారణాసి... రూర్కేలా-హౌరా మార్గాల్లో నడుస్తాయి. తన పర్యటన సందర్భంగా మోదీ టాటా నగర్ రైల్వే స్టేషన్ వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.660 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. మోదీ టాటా నగర్ లో భారీ రోడ్ షోలో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ, భారీ వర్షం కారణంగా ఆ రోడ్ షో రద్దయింది.

## తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ కు

# పదేళ్లు అధికారం దక్కలేదు

- పీసీసీ చీఫ్ గా బాధ్యతలు చేపట్టిన మహేశ్ కుమార్ గౌడ్
- కార్యక్రమంలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియా తెలంగాణ ఇచ్చారని వెల్లడి
- గత పదేళ్లు తెలంగాణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వ్యాఖ్యలు



హైదరాబాద్: తెలంగాణ పీసీసీ చీఫ్ గా బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ... ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని వెల్లడించారు. కానీ, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ కు పదేళ్ల పాటు అధికారం దక్కలేదని అన్నారు. గత పదేళ్లు తెలంగాణ ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఎన్నో పోరాటాలు చేసిన అనంతరం, తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తీసుకువచ్చామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ విజయంలో కార్యకర్తలదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, పేదలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే రుణమాఫీ చేశామని... రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పామని, చేసి చూపించామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన రెండో రోజు నుంచే హామీల అమలు మొదలైందని, తమది పేదల ప్రభుత్వం అని నిరూపించామని అన్నారు.




## ఆంధ్రప్రదేశ్‌లో నిద్రమోహం అధికారులు!

### ప్రభుత్వ రికార్డుల మీద కూడా ఇంకా జగన్ ఫోటోలే

# ఆ లేఖను వెనక్కి తీసుకోవాలి

- రాష్ట్రానికి వచ్చిన సీట్లను తిప్పిపంపడం దేనికి నిదర్శనం చంద్రబాబు గారూ?: జగన్
- చంద్రబాబుపై జగన్ ఫైర్
- కొత్త ఎంబీబీఎస్ సీట్లను వద్దంటూ చంద్రబాబు లేఖ రాశారన్న జగన్
- మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారంటూ ఆరోపణలు




అమరావతి: రాష్ట్రానికి ఎంబీబీఎస్ సీట్లు వస్తుంటే సంతోషించాల్సింది పోయి, వద్దంటూ చంద్రబాబు ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం దారుణమని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. పొరుగు రాష్ట్రాలు కొత్త మెడికల్ కాలేజీలు, ఎంబీబీఎస్ సీట్ల కోసం ప్రదక్షిణలు చేస్తుంటే... మన రాష్ట్రానికి వచ్చిన సీట్లను తిప్పి పంపడం ఏ తరహా పరిపాలనకు నిదర్శనం చంద్రబాబు గారూ? అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం వెళితే ఈ సంవత్సరంలోనే పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, పాడేరు, ఆదోని మెడికల్ కాలేజీల్లో మరో 750 సీట్లు అందుబాటులోకి వచ్చేవని జగన్ వెల్లడించారు. కానీ, ఇప్పుడు పాడేరు కాలేజీని 50 సీట్లకే పరిమితం చేయడం ఏంటి? పులివెందుల కాలేజీకి ఎన్ఎంసీ 50 సీట్లు కేటాయిస్తే, వద్దంటూ ప్రభుత్వం లేఖ రాయడం ఏంటి? వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేసే కుంభకోణాలకు ఆలోచన చేయడం ఏంటి? అని నిలదీశారు. అధికారంలోకి వస్తే మొత్తం సీట్లన్నీ ఫ్రీ అన్నారని, సీట్ల సంగతి దేవుడెరుగు... ఇప్పుడు ఏకంగా కాలేజీలనే అమ్మేస్తున్నారని జగన్ ఆరోపించారు. పార్లమెంటు నియోజకవర్గానికో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉంటే, అది ఆ నియోజకవర్గంలో ఉన్న ఏరియా ఆసుపత్రులకు, సీహెచ్‌సీలకు, పీహెచ్‌సీలకు, విలేజ్ క్లినిక్స్‌కు మార్గదర్శిగా ఉంటుందని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా




## కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌పై సీఎం ఎంకే స్టాలిన్ సీరియస్..

### వందేభారత్ రైలుపై రాళ్ల దాడి

## కిటికీ అద్దాలు ధ్వంసం

### విశాఖపట్నం వందే భారత్ ఎక్స్ ప్రెస్ ట్రయల్ రన్ జరుగుతుండగా కొందరు దుండగులు దానిపై రాళ్ల దాడి



విశాఖపట్నం: ఛత్తీస్ గఢ్ లోని మహాసముంద్ జిల్లాలో దుర్గ్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్ ప్రెస్ ట్రయల్ రన్ జరుగుతుండగా కొందరు దుండగులు దానిపై రాళ్ల దాడి చేశారు. ఈ వందే భారత్ ట్రైన్ మరో రెండు రోజుల్లో అధికారికంగా ప్రారంభం కానుంది. శుక్రవారం రాత్రి ఈ వందే భారత్ ఎక్స్ ప్రెస్ ట్రయల్ రన్ జరుగుతుండగా ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో మూడు బోగీల కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి.ట్రయల్ రన్ జరుగుతుండగా దుర్గ్ -విశాఖపట్నం వందే భారత్ ఎక్స్ ప్రెస్ పై రాళ్లు రువ్విన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను దేవేంద్ర చంద్రకర్, శివ కుమార్ బఘేల్, అర్జున్ యాదవ్,

మిగతా..2లో

## ప్రధాని మోదీ కుటుంబంలోకి
# కొత్త సభ్యుడు 'దీప్ జ్యోతి'..

మన గ్రంధాలలో చెప్పారు.. లోక్ కల్యాణ్ మార్గ్ లోని ప్రధాన మంత్రి నివాస ప్రాంగణానికి కొత్త సభ్యుడు శుభప్రదంగా చేరుకున్నారు" అని ప్రధాని మోదీ ఎక్స్ లో రాసిన ఒక హిందీ పోస్ట్ లో తెలిపారు. ప్రధాని నివాస ప్రాంగణంలోని ఒక ఆవుకు పుట్టిన దూడ తమ ఇంటి కొత్త మెంబర్ అని ప్రధాని తెలిపారు. ఆ దూడ నుదుటిపై ప్రత్యేకమైన దీపం ఆకారపు గుర్తు ఉండడం విశేషం. అందువల్ల ఆ దూడకు ప్రధాని మోదీ 'దీప్ జ్యోతి' (%ణవవజూయిఎశీఱ%) అని నామకరణం చేశారు.'ప్రధాని నివాసంలో ప్రియమైన గోమాత కొత్త దూడకు జన్మనిచ్చింది. దాని నుదుటిపై దీపం చిహ్నం ఉంది. అందుకే దీనికి "దీప్ జ్యోతి' అని పేరు పెట్టాను' అని మోదీ తెలిపారు. ఈ వీడియోలో ప్రధాని మోదీ అప్పుడే పుట్టిన దూడపై ఆప్యాయత చూపడం, దానిని ముద్దు చేయడం, ఆడుకోవడం, దూడను పట్టుకుని తన తోటలో తిరగడం కనిపిస్తుంది. పూజ గదిలో కూడా ఆ దూడ సందడి చేయడం కనిపిస్తుంది. ప్రధాని మోదీ తన నివాసంలో దూడతో సమయం గడుపుతున్న ఫోటోలను కూడా పంచుకున్నారు.శనివారం హిందీ దివస్ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'హిందీ దివస్ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు' అని ఆయన ఎక్స్ పై హిందీ పోస్ట్ లో పేర్కొన్నారు. 1949లో రాజ్యాంగ సభ హిందీని అధికార భాషగా స్వీకరించినందుకు గుర్తుగా ఏటా సెప్టెంబర్ 14న హిందీ దివస్ జరుపుకుంటారు. జమ్మూకశ్మీర్ లోని దోడా ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ జమ్ముకశ్మీర్ లో ఉగ్రవాదం చివరి దశకు చేరుకుందని అన్నారు.

## ఈ రకమైన గుండాగిరి పదేళ్లలో ఎప్పుడూ లేదు

రేవంత్ ప్రభుత్వం కొనసాగుతుందని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి, రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పి అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఎమ్మెల్యేల ఇంటికి చేరి కాళ్లు పట్టుకొని మరి కండువాలు కప్పాడని అన్నారు. హైకోర్టు తీర్పు తర్వాత కాంగ్రెస్‌లో భయం మొదలైందన్నారు. ఫిరాయింపులపై స్పీకర్‌ను కలిసి సుప్రీంకోర్టు తీర్పులను సైతం ఉటంకిస్తూ ఫిర్యాదు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి మీద డిస్ క్వాలిఫై పిటిషన్ వేసింది కౌశిక్ రెడ్డినే చెప్పారు."పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపండి, చావు డప్పులు కొట్టండి అని మాట్లాడింది రేవంత్ రెడ్డి. హైకోర్టు తీర్పు వచ్చిన రోజు అరికెపూడి గాంధీని పిఎసీ చైర్మన్‌గా నియమిస్తూ ప్రకటన చేశారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ ఎలా చేస్తారు అని ప్రశ్నిస్తే.. పోలీసుల అండతో ఎమ్మెల్యే ఇంటిపై దాడికి దిగారు. ఈ రకమైన గుండాగిరి పదేళ్లలో ఎప్పుడూ లేదు. ఫ్యాక్షన్ సినిమాలు తలపించేలా వచ్చారు. రేపు జరగబోయేది జరిగితే, ఎవరు బాధ్యత వహిస్తారు..?" అని కేటీఆర్ ప్రశ్నించారు.పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇప్పటికైనా ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గ్యారెంటీలు అమలు చేయాలని అడిగితే ఇలాంటి హైడ్రామాలు చేస్తున్నారని గతంలో చాలా ముఖ్యమంత్రులను చూశామన్నారు. పైశాచిక ఆనందం కోసం ఇదంతా రేవంత్ చేస్తున్నారని ఇవన్నీ తిరిగి రేవంత్‌కు తిరిగి చుట్టుకుంటాయని వ్యాఖ్యానించారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి హితవు పలికారు."దాడి జరిగినప్పుడు ఇక్కడ విధుల్లో విఫలం అయిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిజిపిని డిమాండ్ చేస్తున్నాము. మా ఎమ్మెల్యేలను అరెస్ట్ చేసి, అర్థరాత్రి వరకు తిప్పితే, తెలంగాణ ప్రజలు మొత్తం మా వెంట నిలిచారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే తెలంగాణ ప్రజల పౌరుషం చాటారు. నిన్న మమ్మల్ని హౌస్ అరెస్ట్ చేసి గాంధీకి రక్షణ కల్పించారు. గాంధీని హౌస్ అరెస్ట్ చేస్తే ఇలాంటి సంఘటనలు జరిగేవి కావు" అని చెప్పుకొచ్చారు.హైదరాబాద్‌లో పదేళ్లలో శాంతి భద్రతలు అద్భుతంగా నిర్వహించామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. "హైదరాబాద్‌లో ఉన్న ప్రజలు అందరూ మా వారే. ప్రాంతీయతత్వం మీద దాడులు గతంలో లేవు, ఇప్పుడు ఉండవు. బీఆర్ఎస్ పార్టీకి హైదరాబాద్ ప్రజలు అండగా నిలిచారని, రేవంత్ కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారు'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే గాంధీ భాషపై కేటీఆర్ సీరియస్ అయ్యారు. బజారు భాషలో అసభ్యకరమైన రీతిలో మాట్లాడటమేంటని ప్రశ్నించారు. "కాంగ్రెస్‌లో ఎందుకు చేరావు? దిక్కుమాలిన పిఎసీ పదవి కోసం ఇలాంటి మాటలు మాట్లాడిన గాంధీకి సిగ్గు ఉండాలి. ఒక్కసారి నియోజకవర్గ ప్రజలను అడిగితే గాంధీ ఏ పార్టీలో ఉన్నాడో చెబుతారు" అంటూ కేటీఆర్ కామెంట్స్ చేశారు.

## వైసీపీకి రాజినామా
## టీడీపీ పార్టీ కండువాలు కప్పుకోలేదా..!!

మొదటి పేజి తరువాయి

వైసీపీ మీద పలు విమర్శలు సంధించారు.త్వరలోనే పార్టీలో చేరుతారని అందరూ భావించినా వారు ఇంత వరకూ టీడీపీ కండువా కప్పుకోలేదు.ఈ వ్యవహారంపై టీడీపీలో ఆసక్తికరమైన చర్చలు నడుస్తున్నాయి.రాజ్యసభ సభ్యులుగా ఉంటున్న బీదా మస్తాన్ రావు,మోపిదేవీ వెంకటరమణలు,ఎమ్మెల్సీగా ఉన్న పోతుల సునీత,బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కర్రిపద్మశ్రీలు వైసీపీ ప్రాధమిక సభ్యత్వానికి,ఎమ్మెల్సీ పదవులకు రాజీనామాలు చేశారు. త్వరలోనే టీడీపీలో చేరతారని ప్రచారం కూడా సాగింది.రాజీనామా చేసి రెండువారాలు గడుస్తున్నా తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకోలేదు.దీనికి అనేక కారణాలున్నాయని టీడీపీలో చర్చ నడుస్తోంది.గతంలో టీడీపీలో ఉన్న బీదామస్తాన్ రావు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలో చేరి రాజ్యసభ దక్కించుకున్నారు. ఆయన తిరిగి స్వంత గూటికి వెళ్లేందుకు క్యాడర్ కు ఎలాంటి ఇబ్బందులు లేవ్ కానీ పోతుల సునీత విషయంలో మాత్రం స్థానిక నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారట.పోతుల సునీతను పార్టీలో చేర్చుకోవద్దంటూ క్యాడర్ పెద్దయెత్తున అధిష్టానానికి పిర్యాదులు చేస్తున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. పోతుల సునీత, భర్త పోతుల సురేష్ పరిటాల రవి అనుచరులు కావడంతో గతంలో వారికి టీడీపీ అధిక ప్రాధాన్యత ఇచ్చింది. కానీ వైసీపీలోకి వెళ్లి చంద్రబాబునేటార్గెట్ గా ఆమె పలు విమర్శలు చేసింది.దీంతో ఆమె చేరికకు ముఖ్యనేతలే బ్రేక్ వేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.మోపిదేవీ వెంకటరమణ విషయంలో కూడా స్థానిక నేతలతో పాటు.. క్యాడర్ వ్యతిరేకిస్తోందని తెలుస్తోంది..రేపల్లెలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ వర్గం ఆయన చేరికను అడ్డుకుంటోందంట. మోపిదేవి పార్టీలో చేరి.. ఎమ్మెల్సీ దక్కించుకుంటే.. టీడీపీలో గ్రూప్ రాజకీయాలు పెరిగే అవకాశముందని అధిష్టానం దృష్టికి కొందరు నేతలు తీసుకెళ్లారట..దీంతో వారి చేరికపై పార్టీ పునరాలోచనలో పడిందని తెలుస్తోంది.

## ఆంధ్రప్రదేశ్‌లో నిద్రమొహం అధికారులు!

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో నిద్రమొహం అధికారులు ఎక్కువైపోయారు. జగన్ ఐదేళ్ల పాలనలో నిద్రపోతూ టైమ్‌పాస్ చేసిన చాలామంది అధికారగణం చంద్రబాబు ప్రభుత్వంలో కూడా అదే నిద్రని కంటిన్యూ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి తమ నిద్రని డిస్టబ్ చేసిందని హర్టవుతున్న అధికారులు కూడా ఆంధ్రప్రదేశ్‌లో దండిగా వున్నారు. అందుకే ఏపీలో అనేక ప్రభుత్వ శాఖల అధికారులు ఇంకా జగనే సీఎంగా వున్నారన్న కలలు కంటూ హాయిగా నిద్రపోతున్నారు.అందువల్లనేనేమో ప్రభుత్వ శాఖలకు చెందిన చాలా వెబ్‌సైట్స్.లో హోమ్ పేజీలో ముఖ్యమంత్రి ఫొటో అయితే మారింది. అయితే లోపలి పేజీల్లో మాత్రం ఇప్పటికీ జగన్ ప్రభుత్వానికి సంబంధించిన అంశాలు, జగన్ ప్రభుత్వం పథకాలకు సంబంధించిన వివరాలే వుంటున్నాయి. అంటే, మొక్కుబడిగా హోమ్ పేజీలో వివరాలు మార్చారు. లోపల ఎవరు చూస్తార్లే అనుకున్నారే ఏంటోగానీ, జగన్ ప్రభుత్వం తాలూకు పీడకలలే ఆయా పేజీల్లో కనిపిస్తున్నాయి. అలాగే ప్రజలకు జారీ చేసే కీలకమైన ప్రభుత్వ రికార్డుల మీద కూడా ఇంకా జగన్ ఫొటోనే దర్శనమిస్తోంది. ప్రభుత్వ రికార్డులతోపాటు ధ్రువీకరణ పత్రాలు, భూమి డాక్యుమెంట్లు, సర్టిఫికెట్ల మీద జగన్ ఫొటో ఇప్పటికీ దర్శనమిస్తోంది. మరి ప్రభుత్వ అధికారులు ఎప్పుడు నిద్ర లేస్తారో... చంద్రబాబుని ముఖ్యమంత్రిగా ఎప్పుడు గుర్తిస్తారో!.

## వందేభారత్ రైలుపై రాళ్ల దాడి
# కిటికీ అద్దాలు ధ్వంసం

మొదటి పేజి తరువాయి

జితు తాండి, లేఖ్రాజ్ సోన్వానీగా గుర్తించారు. వీరంతా బాగ్ బహ్రా నివాసితులు. ఈ రైలును సెప్టెంబర్ 16న దుర్గ్ నుంచి రెగ్యులర్ రన్ కు జెండా ఊపి ప్రారంభించనున్నారు.రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (మహాసముంద్) ఇన్స్పెక్టర్ ప్రవీణ్ సింగ్ ధాకడ్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ వందేభారత్ రైలు విశాఖపట్నం నుంచి దుర్గ్ కు తిరుగు ప్రయాణంలో బాగ్బహ్రా రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తుండగా ఈ దాడి జరిగింది. నలుగురు ఆర్పీఎఫ్ సిబ్బందికి చెందిన ట్రైన్ ఎస్కార్టింగ్ బృందం ఈ ఘటనపై హెచ్చరికలు పంపింది. రాళ్లదాడి ఘటన నేపథ్యంలో భద్రతా సిబ్బంది బృందాన్ని ఘటనా స్థలానికి పంపించారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.నిందితులపై రైల్వే చట్టం 1989లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, సెక్షన్ 153 (ఉద్దేశపూర్వక చర్య లేదా తప్పిదం ద్వారా రైల్వేలో ప్రయాణించే వ్యక్తి భద్రతకు భంగం కలిగిస్తే ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది) అధికారులు తెలిపారు. అరెస్టయిన నిందితుడి దగ్గరి బంధువు బఘేల్ బాగ్ బహ్రాలో కాంగ్రెస్ కార్పొరేటర్ గా పనిచేస్తున్నారు. గతంలో కూడా వందేభారత్ రైళ్లపై రాళ్ల దాడులు జరిగాయి. ఆగస్టులో అహ్మదాబాద్-జోధ్ పూర్ వందే భారత్ ఎక్స్ ప్రెస్ రాజస్థాన్ లోని పాలి జిల్లాలో రైల్వే ట్రాక్ పై ఉంచిన సిమెంట్ స్లాబ్ ను ఢీకొట్టింది. జూన్ లో ఫగ్వారా- గోరయా రైలు మధ్య న్యూఢిల్లీ వెళ్తున్న వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలుపై రాళ్లు రువ్వారు. కాగా, ఈ నెల ప్రారంభంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వందే భారత్ స్లీపర్ కోచ్ ప్రోటోటైప్ వెర్షన్ ను బీఈఎంఎల్ ఫెసిలిటీలో ఆవిష్కరించారు. తదుపరి పరీక్షల కోసం ట్రాక్ పైకి తీసుకురావడానికి ముందు కోచ్ కు మరో పది రోజుల పాటు కఠినమైన ట్రయల్స్, పరీక్షలు నిర్వహించనున్నారు.

## 'హైడ్రా'కు చట్టబద్ధత.. వచ్చే నెలలోనే ఆర్డినెన్స్

మొదటి పేజి తరువాయి

గ్రేహౌండ్స్,టాస్క్‌ఫోర్స్ విభాగాలలో స్వతంత్రంగా హైడ్రా కూడా కార్యకలాపాలను కొనసాగిస్తుందన్నారు.జీవో 99 ద్వారా జులై 19న హైడ్రా ఏర్పాటైన విషయాన్ని కమిషనర్ రంగనాథ్ గుర్తు చేశారు. హైడ్రా చట్టబద్ధమైన సంస్థే అని ఆయన స్పష్టం చేశారు. హైడ్రాకు ఉన్న అధికారాలను సవాలు చేస్తూ లక్ష్మి అనే మహిళ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సారథ్యంలోని తెలంగాణ హైకోర్టు బెంచ్ శుక్రవారం విచారణ చేపట్టింది. హైడ్రా తీరుపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను ఎలా కూల్చేస్తారని ప్రశ్నించింది.జీవో 99పై వివరణ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. నోటీసు ఇవ్వకుండానే అమీన్‌పూర్‌లో ఈ నెల 3న షెడ్లు కూల్చిన విషయాన్ని కోర్టు గుర్తుచేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్నా ఎలా కూలుస్తారని హైడ్రాను హైకోర్టు నిలదీసింది. ఈనేపథ్యంలో ఇవాళ మీడియా సమావేశంలో హైడ్రా చట్టబద్ధతపై కమిషనర్ రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

# "సీఎంగా కాదు.. ఒక అక్కగా వచ్చాను"

మొదటి పేజి తరువాయి



మీ 'దీదీ' (సోదరి)గా మిమ్మల్ని కలిసేందుకు వచ్చానని చెప్పారు. మీ డిమాండ్లను అధ్యయనం చేసి ఎవరైనా దోషులుగా తేలితే చర్యలు తీసుకుంటానని హామీ ఇస్తున్నానని, నిరసన తెలుపుతున్న డాక్టర్లు తిరిగి విధుల్లో చేరాలని ఆమె కోరారు.సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఇదే తన చివరి ప్రయత్నం అని మమతా బెనర్జీ అన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల పేషెంట్ వెల్ఫేర్ కమిటీలను తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వైద్యుల కష్టాన్ని తాను అర్థం చేసుకున్నానని బెనర్జీ అన్నారు. తాను విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించి ముందుకు వచ్చానని, తన జీవితంలో తాను కూడా చాలా ఇబ్బందులు పడ్డానని, మీ పోరాటాన్ని అర్థం చేసుకున్నానని ఆమె అన్నారు.వైద్యుల డిమాండ్లను వింటానని హామీ ఇచ్చారు. తాను ఒంటరిగా ప్రభుత్వాన్ని నడపడం లేదని, ఉన్నతాధికారులతో మీ డిమాండ్లను అధ్యయనం చేసి తప్పకుండా పరిష్కారం కనుగొంటానని చెప్పారు. ఎవరు దోషులుగా తేలినా కచ్చితంగా శిక్ష పడుతుందన్నారు. నేను మీ నుండి కొంత సమయం అడుగుతున్నాను. మీపై (నిరసన తెలుపుతున్న వైద్యులపై) రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోదని మమతా బెనర్జీ అన్నారు.ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రసంగాన్ని ముగించి అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత ఆందోళన చేస్తున్న వైద్యులు చర్చలు జరిగే వరకు తమ డిమాండ్లపై రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కోల్ కతాలోని సాల్ట్ లేక్ ప్రాంతంలోని స్వాస్థ్య భవన్ ఎదుట జూనియర్ డాక్టర్లు వరుసగా నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఆర్జీ కర్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్యకు గురైన 31 ఏళ్ల ట్రైనీ డాక్టర్ కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆగస్టు 9న సెమినార్ గదిలో ఆమె మృతదేహం లభ్యమైంది. ఈ నిరసనలు రాష్ట్రంలోని ప్రజారోగ్య మౌలిక సదుపాయాలను ప్రభావితం చేశాయి. చికిత్స అందక 29 మంది చనిపోయారని ప్రభుత్వం పేర్కొంది. వీలైనంత త్వరగా విధుల్లో చేరాలని జూనియర్ డాక్టర్లను బెంగాల్ సీఎం పదేపదే అభ్యర్థించారు మరియు ఈ అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాలను నోట్ చేసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి ఎన్ఎస్ నిగమ్ ను ఆదేశించారు.

# ఆ లేఖను వెనక్కి తీసుకోవాలి

మొదటి పేజి తరువాయి




పేదలకు ఉచితంగా ఆ జిల్లాస్థాయిలో, అక్కడే లభిస్తాయని... అలాంటి కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే ముందుగా నష్టపోయేది పేద విద్యార్థులే కాదు, అక్కడి ప్రజలకు కూడా అని జగన్ స్పష్టం చేశారు. చంద్రబాబు ఇకనైనా కళ్లు తెరవాలని, తక్షణమే ఎన్ఎంసీకి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. "మెడికల్ కాలేజీల్లో మిగిలిన పనులను పూర్తి చేసి... పేద పిల్లలకు వైద్య విద్యను, పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురండి... మీకు చేతనైనంత ఖర్చు చేస్తూ వెళ్లండి... మీకు చేతకాకపోతే మేం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాతైనా పూర్తి చేస్తాం. అంతేకానీ, ఇలా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మాటున కుంభకోణాలు చేయడం మానుకో చంద్రబాబూ! లేకపోతే ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుంది" అని జగన్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# అందమైన జమ్మూకశ్మీర్‌ను దారుణంగా దెబ్బతీశాయి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం చివరి శ్వాస పీల్చుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రకృతి సౌందర్యానికి మారుపేరైన జమ్మూకశ్మీర్‌ను ఇక్కడి వారసత్వ రాజకీయాలు దారుణంగా దెబ్బతీశాయని, పెనుశాపంగా మారి ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయని మండిపడ్డారు. వారసత్వ రాజకీయ పార్టీలు సొంత బిడ్డల సంక్షేమమే తప్ప ప్రజల బాగోగులు ఏనాడూ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. నూతన నాయకత్వాన్ని పైకి ఎదగనివ్వలేదని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలకు పోటీగా నూతన నాయకత్వాన్ని ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. 2014లో తాము కేంద్రంలో అధికారంలోకి రాగానే ఇక్కడ నాయకత్వ నిర్మాణంపై దృష్టి పెట్టామన్నారు. శనివారం జమ్మూ ప్రాంతంలోని దోడా జిల్లాలో భారీ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. రాబోయయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అద్భుతమైన మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, కాంగ్రెస్ లాంటి పార్టీలు మళ్లీ అధికారంలోకి వస్తే అధోగతేనని తేల్చిచెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జమ్మూకశ్మీర్ విదేశీ శక్తులకు టార్గెట్‌గా మారిందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ఈ ప్రాంత భవిష్యత్తును నిర్దేశించబోతున్నాయని స్పష్టంచేశారు. గత నాలుగు దశాబ్దాల్లో దోడా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మొట్టమొదటి ప్రధాని నరేంద్ర మోదీ కావడం విశేషం. సభలో ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

యువ నాయకత్వానికి పెద్దపీట వేశాం

"ఉగ్రవాద భూతం వల్ల జమ్మూకశ్మీర్ యు వత తీవ్రంగా నష్టపోయారు. ఇక్క డ అధికారం వెలగబెట్టిన పార్టీలు ప్రజలను తప్పు దోవ పట్టిస్తూ కుటుంబ స్వామ్యాన్ని పెంచి పోషించాయి. యు వతను రాజకీయాల్లో ప్రోత్సహించలే దు. 2000 సంవత్సరం నుంచి పంచా యతీ ఎన్నికలు నిర్వహించలేదు. 2014 తర్వాత బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, జిల్లా డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఎన్నికలు జరగలేదు. మేము అధికారంలోకి వ చ్చాక ఆయా ఎన్నికలు నిర్వహించాం. యువ నాయకత్వానికి పెద్దపీట వేశాం.

వెండితెరపై మళ్లీ జమ్మూకశ్మీర్ అందాలు

ఉగ్రవాద బాధితురాలు షగున్ పరిహార్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్ కేటాయించాం. ఉగ్రవాదాన్ని పూర్తిగా పెకిలించాలన్న మా అంకితభావానికి ఇదొక ఉదాహరణ. 2018 నవంబర్‌లో షగున్ తండ్రిని, బంధువును ఉగ్రవాదులు కాల్చిచంపారు. జమ్మూకశ్మీర్‌ను ఉగ్రవాద రహితంగా, పర్యాటకుల స్వర్గధామంగా మార్చాలన్నదే మా లక్ష్యం. అంతర్జాతీయ సినిమా షూటింగ్‌లు ఇక్కడ జరిగే పరిస్థితి రావాలి. వెండితెరపై జమ్మూకశ్మీర్ అందాలు మళ్లీ కనిపించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆర్టికల్ 370ను మళ్లీ తీసుకొస్తారట!

కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ ఎన్నికల మేనిఫెస్టో, బీజేపీ హామీల మధ్య తేడాలను ప్రజలు గమనించాలి. ఆర్టికల్ 370ను మళ్లీ తీసుకొస్తామని ఆ మూడు పార్టీలు చెబుతున్నాయి. అంటే ప్రజల హక్కులను మళ్లీ దోచుకుంటారట! రిజర్వేషన్లు, ఓటు హక్కును రద్దు చేస్తారట! ఆర్టికల్ 370తోపాటు ఆర్టికల్ 35ఏ పునరుద్ధరిస్తే ఆడబిడ్డలను తీరని అన్యాయం జరుగుతుంది. మూడు పార్టీల మేనిఫెస్టో అమల్లోకి వస్తే పాఠశాలలు మళ్లీ అగ్నికి ఆహూతవుతాయి.

### బీజేపీ నేతలను అరెస్టు చేయడమే కాంగ్రెస్ ఎజెండానా?

కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం నిజాయతీ లేదు. అధికారంలోకి రావడానికి అవినీతి, వారసత్వ రాజకీయాలు, ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడడం ఆ పార్టీకి అలవాటే. అమెరికాలో భారతీయ జర్నలిస్టుపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల గురించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నోరువిప్పుతారా? అని శామ్ పిట్రోడాను ప్రశ్నించినందుకు గదిలో బంధించి దారుణంగా కొట్టారు. ఇలా చేయడం మన దేశ గౌరవాన్ని పెంచుతుందా? కాంగ్రెస్ రాజకుటుంబం అత్యంత అవినీతిమయమైన కుటుంబం. వారసత్వ రాజకీయాలు చేస్తున్న ఆ కుటుంబం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి మరో 20 సీట్లు వచ్చి ఉంటే బీజేపీ నేతలను జైలుకు పంపించేవాళ్లమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. అంటే వారి ఎజెండా అదేనా? మమ్మల్ని జైల్లో పెట్టడానికే కాంగ్రెస్‌కు అధికారం కావాలా? ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అక్కర్లేదా?" అని ప్రశ్నించారు.

## పదేళ్లు అధికారంలో ఉంటాం: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజి తరువాయి

'ప్రాఫెట్ ఫర్ ద వరల్డ్ (ప్రపంచానికి ప్రవక్త)'పుస్తకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం నిరంతరం విషం చిమ్ముతుంటారని.. ప్రజల పక్షాన మాట్లాడేవారి కంటే విషం చిమ్మేవారు ఎక్కువైపోయారని వ్యాఖ్యానించారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మజ్లిస్ కలసి రావడం ఆనందంగా ఉంది

ప్రభుత్వాన్ని నడిపించడంలో కొన్ని తప్పిదాలు జరగవచ్చని, వాటిని ఎత్తి చూపేందుకు బలమైన ప్రతిపక్షం అవసరమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, తర్వాత అభివృద్ధి, సంక్షేమంలో అంతా కలిసి రావాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ రాజకీయంగా విభేదించినా.. తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కలసి రావడం అనందంగా ఉందని చెప్పారు. మూసీ నది అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో కొందరు పేదలు నివాసాలు కోల్పోయే అవకాశం ఉందని, వారికి ప్రభుత్వపరంగా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని రేవంత్ ప్రకటించారు. అన్ని మతాలు చెప్పింది ఒక్కటేనని, అందరం కలసిమెలసి శాంతియుతంగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని రేవంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టెమ్రిస్ వైస్‌చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, ఇస్లామిక్ స్కాలర్స్ పాల్గొన్నారు.

## నేను మాట్లాడే వరకు సైలెంట్ గా ఉండండి



: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ బ్రిటీష్ రిపోర్టర్‌పై విరుచుకుపడ్డారు. వైట్‌హౌస్‌లో బైడెన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్‌మర్ కీలక సమావేశం నిర్వహించారు. ఈనేపథ్యంలో రష్యా- ఉక్రెయిన్‌కు యుద్ధంలో కీవ్ సుదూర క్షిపణలు వాడటంతో పాశ్చాత్య దేశాలకు మాస్కో నుంచి ఏర్పడే ముప్పు గురించి రిపోర్టర్ బైడెన్ ను ప్రశ్నించారు. " నేను మాట్లాడే వరకు మీరు సైలంట్ గా ఉండండి. నేను మీకు చెప్పేది అదే.?" అని ఫైర్ అయ్యారు. కాగా.. జర్నలిస్ట్ వినకుండా మళ్లీ అదే ప్రశ్న అడిగేసరికి.. బైడెన్ అసహనం వ్యక్తం చేశారు. "మీరు నిశ్శబ్దంగా ఉండాలి. నేను ఇక్కడ ఒక ప్రకటన చేయబోతున్నాను. మీరు మధ్యలో కలగజేసుకోకండి?" అని రిపోర్టర్ ని మందలించారు.

సుదూర క్షిపణులపై బైడెన్ ఏమన్నారంటే?

దీంతో సమావేశం ముగిసిన తర్వాత రిపోర్టర్ బైడెన్‌ను రష్యా యుద్ధం గురించి అడగగా ఆయన స్పందించారు. "వ్లాదిమిర్ పుతిన్ గురించి నేను పెద్దగా ఆలోచించను" అని చెప్పారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో పుతిన్ గెలిచే అవకాశం లేదని అన్నారు. రష్యాకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉక్రెయిన్‌కు సహాయం చేసేందుకు అమెరికా కట్టుబడి ఉందన్నారు. అయితే ఉక్రెయిన్ సుదూర క్షిపణుల విషయంలో కొత్త విధానాన్ని ప్రకటించే ఆలోచన లేదని స్పష్టం చేశారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దాడిని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు అమెరికా ఉక్రెయిన్‌కు 55.7 బిలియన్ డాలర్ల సహాయాన్ని అందించింది. ఈ వారం ప్రారంభంలో రష్యాపై దాడి చేసేందుకు సుదూర క్షిపణులను ఉపయోగించడంపై ఆంక్షలు ఎత్తివేస్తే.. నాటో సభ్యదేశాలతో యుద్ధం ఉంటుందని పుతిని హెచ్చరించారు. ఇటీవల ఉక్రెయిన్‌లోని కీవ్‌ను సందర్శించిన అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్.. వైట్ హౌజ్ వాటిపై ఆంక్షలు ఎత్తివేసే ఆలోచనలో ఉన్నట్లు హింట్ ఇచ్చారు. అయితే, ఉక్రెయిన్ సుదూర క్షిపణుల వినియోగంపై కొత్త విధానాన్ని ప్రకటించే ఆలోచన లేదని వైట్ హౌస్ ఈ ఊహాగానాలను కొట్టివేసింది.

## హోంమంత్రి, ఎమ్మెల్యేపై అభ్యంతరకర పోస్టులు..
## మాజీ మంత్రి సోదరుడికి నోటీసులు

: మాజీ మంత్రి అంజాద్ బాషా సోదరుడు అహ్మద్ బాషాకు పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత , కడప ఎమ్మెల్యే మాధ వీలతపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన కేసులో విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు, ఆ తర్వాత అనిత, మాధవీలతపై వైసీపీ శ్రేణులు అభ్యంతరకర పోస్టులు పెట్టారు. దీని వెనుక మాజీ మంత్రి అంజాద్ బాషా సోదరుడు అహ్మద్ బాషా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఆయనకు నోటీసులు జారీ చేసి విచారణకు రావాలని సూచించారు. అహ్మద్ బాషా ఈ రోజు విచారణకు హాజరయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## యాంకర్ శ్యామలకు మాజీ సీఎం జగన్
## బంపర్ ఆఫర్.. రాష్ట్రస్థాయిలో పదవి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల తర్వాత వైఎస్ జగన్ పార్టీ ఢీలా పడింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా పొందలేని వైసీపీ ఎటూ పాలుపోని స్థితికి పడిపోయింది. అధికార పక్షాన్ని ఎదుర్కోవడం పక్కనపెడితే.. పార్టీని బలంగా నిలుపుకోవడం కష్టంగా మారింది. నాయకుల మధ్య పొరపొచ్చాలు వస్తున్నాయి. కొందరు నాయకులు పక్కచూపులు చూస్తున్నారు. దీంతో పార్టీ అధిష్టానం ముందుగా పార్టీలో లుకలుకలను సెట్ చేసే పనిలో ఉన్నట్టు అర్థం అవుతున్నది. అలాగే.. పార్టీ కోసం పని చేసిన వారికీ గుర్తింపు ఉంటుందనే సంకేతాలను ఇవ్వదలిచినట్టు స్పష్టం అవుతున్నది. ఇందులో భాగంగానే యాంకర్ శ్యామలకు వైఎస్ జగన్ కీలక పదవి కట్టబెట్టారు. వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆమెను నియమిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఆమెతోపాటు భూమన కరుణాకర్ రెడ్డి, జూపూడి ప్రభాకర రావు, ఆర్ కే రోజాలను కూడా రాష్ట్ర అధికార ప్రతినిధులుగా నియమించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పార్టీ పీఏసీ(వైసీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా) సభ్యుడిగా నియమించారు. అలాగే.. చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లా(తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు)కు అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రులు ఆర్ కే రోజా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్ వీరిని ట్రాక్‌లో పెట్టే నిర్ణయం తీసుకున్నారు. ఇద్దరికీ కీలక పదవులు అప్పజెప్పారు. విభేదాలు పక్కనపెట్టి పార్టీ కోసం పని చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇక యాంకర్ శ్యామల వైసీపీ కోసం ఎన్నికల ముందు కష్టపడ్డారు. ప్రత్యర్థి పార్టీలపై నిప్పులు చెరిగారు. ఆమె వ్యాఖ్యలు టీడీపీ, జనసేన నాయకులను ఇబ్బందులు పెట్టాయి. దీంతో ఆమెను చంపేస్తామనే బెదిరింపులు కూడా వచ్చాయి. అయినా.. యాంకర్ శ్యామల వెనక్కి తగ్గలేదు. పార్టీ కోసం బలంగా గొంతు వినిపించింది. కానీ, ఎన్నికల్లో వైసీపీ దారుణంగా మట్టికరిచింది. అయినా.. యాంకర్ శ్యామలపై సోషల్ మీడియాలో ట్రోల్స్ ఆగలేవు. తాజాగా, యాంకర్ శ్యామల పడిన కష్టానికి తగిన ఫలితం దక్కింది. ఆమెకు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలు వచ్చాయి. ఈ నిర్ణయాలు చూస్తే.. వైఎస్ జగన్ తన పార్టీని చక్కబెట్టే పనిలో నిమగ్నమైనట్టు, పార్టీలో నాయకుల మధ్య సఖ్యతను పెంచి పార్టీని పటిష్టం చేయాలనే ఆలోచనలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా, పార్టీ మారుతున్నారనే అనుమానాలు కలిగిన పార్టీ ఎమ్మెల్యేలను పిలిచి మాజీ సీఎం జగన్ మాట్లాడారు. పార్టీలోనే కొనసాగాలని, పార్టీ కోసం పని చేస్తే తప్పకుండా మంచి ప్రతిఫలం దక్కుతుంది జగన్ పేర్కొన్నారు.

## కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌పై
# సీఎం ఎంకే స్టాలిన్ సీరియస్..



కేంద్ర ఆర్థిక మంత్రికి క్షమాపణలు చెప్పిన జీఎస్టీ గురించి ప్రశ్రలు అడిగిన రెస్టారెంట్ యజమాని చెప్పిన వీడియో వైరల్ కావడంతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈరోజు (శనివారం) స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీపై న్యాయమైన డిమాండ్లు చేసినందుకు కేంద్ర మంత్రి వ్యవహరించిన తీరు సిగ్గుచేటు అని పేర్కొన్నారు. అలాగే, జీఎస్‌టీపై మాట్లాడిన వ్యక్తికి ఏమి జరిగిందో చూస్తే చాలా నిరుత్సాహంగా ఉందన్నారు. ఇక, కేంద్ర ప్రభుత్వ సహకారం ఇంకా అందలేదు.. నిన్న ( శుక్రవారం) కూడా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాకు రుణ సాయం అందిందని చెప్పారని.. కానీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా కేంద్ర సర్కార్ ఇవ్వలేదని ముఖ్యమంత్రి స్టాలిన్ తేల్చి చెప్పారు. కాగా, కోయంబత్తూరులో గల శ్రీ అన్నపూర్ణ హోటల్ యజమాని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు క్షమాపణలు చెబుతున్నట్లు ఉన్న వీడియోను తమిళనాడు రాష్ట్ర బీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వివాదం తలెత్తింది. రెస్టారెంట్ యజమాని, ఆర్థిక మంత్రి మధ్య జరిగిన సంభాషణను బహిరంగపరచినందుకు రాష్ట్ర బీజేపీ చీఫ్ అన్నామలై పార్టీ తరపున క్షమాపణలు చెప్పారు. అనుకోకుండా గోప్యతను ఉల్లంఘించినందుకు విచారం వ్యక్తం చేస్తున్నాం.. అన్నపూర్ణ చైన్ ఆఫ్ రెస్టారెంట్స్ యజమాని శ్రీనివాసన్‌కు క్షమాపణలు చెప్పారు. ఇక, తమిళనాడు హోటల్ యజమానుల సంఘం అధ్యక్షుడు కూడా అయిన శ్రీనివాసన్ సెప్టెంబరు 11న కోయంబత్తూరులో ఆర్థిక మంత్రి హాజరైన సమావేశంలో జీఎస్‌టిపై సమస్యలను లేవనెత్తారు. స్వీట్, మసాలా ఆహారంపై పన్ను విధించడంలో ఉన్న వ్యత్యాసాలను చూపించారు. తీపిపై ఐదు శాతం జీఎస్‌టి విధించగా.. సావరీస్‌పై 12 శాతం, క్రీమ్‌తో కూడిన బన్స్‌పై (బన్స్‌పై జీఎస్‌టి లేదు)18శాతం విధించడంతో కస్టమర్లు తరచూ ఫిర్యాదు చేస్తున్నారని హోటల్ యజమాని శ్రీనివాసన్ పేర్కొన్నారు.

## లచ్చిరాం తండా ని ఆదుకుంటాం

### ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సక్రమంగా వచ్చేలా చేస్తాం



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): మొన్న కురిసిన భారీ వర్షానికి ఆకేరు వాగు వరద ఉధృతికి భారీగా నష్ట పోయినా మానుకోట జిల్లా మరిపెడ పురుషోత్తమ గూడెం సీతారాం తండకి ఆదివారం స్థానికులు



తండా ధర్మారం బిడ్డ కలెక్టర్ గుగులోత్ రవి, సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ సేవాలాల్ వెంకన్న నాయక్ బృందం, హైకోర్టు అడ్వకేట్ తేజావత్ జాగురాం నాయక్, మాజీ ఎంపీపీ రాంబాబు, బంజారా సేవా సమితి నాయకులు బక్షి నాయక్ తండాను సందర్శించి, తండా వసులను పరామర్శించి వారికి భోజనాలు ఏర్పాటు చేసి వారితో కలిసి భోజనం చేసి అనంతరం జోగురం నాయక్ సహకారంతో తండాలోని 180 మందికి బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా లాల్ సేన జిల్లా అధ్యక్షులు గూగులోత్ నందు లాల్ నాయక్, జిల్లా ప్రధనకార్యదర్శి బాధవత్ రాంబాబు నాయక్, ధరవత్ భాస్కర్ నాయక్, మానుకోట పట్టణ అధ్యక్షులు ధారవత్ శ్రీను నాయక్ తండా వాసులు, యువకులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం క్లబ్ లో సెప్టెంబర్ 22, 23 న జరిగే ఆటో యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : తెలంగాణ రాష్ట్ర ఆటో , క్యాబ్ , వర్కర్స్ మహాసభ లు సెప్టెంబర్ 22-23 తేదీ లో కొత్తగూడెం లో జరుగుతున్నది అని ఈ మహాసభ లను ఆటో - క్యాబ్ డ్రైవర్స్ అధిక సంఖ్య లో పాల్గిని జయప్రదం చెయ్యాలి అని ఆటో క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య విజ్ఞప్తి చేశారు.కొత్తగూడెం ఏఐటీయూసీ కార్యాలయం లో మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ తో కలిసి జమలయ్య మాట్లాడుతూ ఆటో తెలంగాణ రాష్టం లో మోటార్ కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉన్నది అని అన్నారు ఉచిత బస్సు తో ఆటో డ్రైవర్స్ ఓనర్స్ పరిస్థితి పెనం మీద నుండి పోయి లో పడినట్లు ఉన్నది అని ఆవేదన వక్తం చేశారు ,ఆటో డ్రైవర్ లు ఓనర్స్ కిస్తీలు కట్టలేక ఆత్మ హత్యలు చేసుకునే పరిస్థితి రాష్ట్రము లో నెల కొన్నది అని అన్నారు.ఈ రాష్ట్ర మహా సభలు లోఆటో కార్మికుల సమస్యలు పై చర్చ జరుగుతుంది అని అన్నారు ,ఈ మహాసభ లో ఆటో కార్మికులకు భద్రత - భరోసా కోసం ప్రభుత్వం కుటుంబానికి 1 లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించాలనీ , పెన్షన్ 50 ఏళ్లకు ఇవ్వాలనీ , అన్ని రకాల టాక్స్ లు రద్దు చెయ్యాలనీ, హెల్త్ కార్డు లు ఇవ్వాలనీ, బీమా సౌకర్యం 10 లక్షలు ఇవ్వాలనీ ప్రభుత్వం పై ఏఐటీయూసీ పోరాటం చేస్తుంది అని అన్నారు.ఈ మహాసభ కు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ముఖ్యఅతిథి గా హాజరు కానున్నారు అని అన్నారు.ఈ సమావేశం లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గెద్దాడి నగేష్ , బత్తుల సత్యనారాయణ ,పాషా , అబ్బులు , దేశి ,లక్ష్మణ్ , కోటి పాల్గొన్నారు

## వినాయక చవితికి మట్టి మొక్క గణపతిని పూజిస్తున్న గోల్ల బోయిన లక్ష్మీ ని అభినందించిన

### ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపక అధ్యక్షుడు మొక్కల రాజశేఖర్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : ప్రతి వినాయక చవితికి మట్టి మొక్క గణపతులను పూజించాలని , వినాయక చవితి నాడు గణపతి పూజలో మీకు అవసరమైన మొక్కలు కూడా పూజలో పెట్టాలని, పూజల అనంతరం ఆ మొక్కలను చెట్లు లేని ప్రదేశాల్లో లేదా మీకు కావాల్సిన చోట నాటి పర్యావరణాన్ని రక్షించాలని క్రృతం లో 2019 వ సంవత్సరం నుంచి ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినానని ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు కొట్టూరు.నుర్వి రాజశేఖర్ అన్నారు.క్రితం లో మట్టి గణపతి లను తయారు చేయనప్పుడు గింజలను మరియు మొక్కలను కూడా పెట్టి నానని, ఆ గణపతిల ను వ పూజించాలని ప్రచారం చేస్తున్నానని, వాతావరణ సమతుల్యత లేకపోవటం వల్ల అతివృష్టి, అనావృష్టి ఏర్పడుతుందని, అధిక వర్షాలు పట్టడం వల్ల కుంభవృష్టి తో భారీ వర్షాలు పడి లోతట్టు ప్రదేశాలు మునిగి పోవటము ఆస్తి నష్టము ప్రాణ నష్టము పశు,పక్ష్యాదుల ప్రాణ నష్టం జరిగి పర్యావరణానికి మరియు మనుషులకు ఎంతో హానీ జరుగుతుందని అందరికీ అవగాహన కల్పించడానికి 2017 వ సంవత్సరం నుంచి ప్రత్యేక దినోత్సవాల కి అన్ని మతాల పండగలకి, బంధుమిత్రుల, ప్రముఖుల పుట్టిన రోజుల కి మొక్కల నాటి శుభాకాంక్షలు తెలిపే వినూత్న కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో ప్రకృతిపై అవగాహన తీసు కొస్తు న్నానని అన్నారు, ఈ సంవత్సరం కూడా గణపతి పూజలో మొక్కలు కూడా పెట్టాలని రామవరం లో 15 గణేష్ మండపాల గౌరవ కమిటీ సభ్యులకు మరియు బంధుమిత్రులకు మొక్కలను అందించి నానని అన్నారు.గొల్ల బోయిన లక్ష్మి కి 2023 వ సంవత్సరం వినాయక చవితికి పూజలో మొక్కను పెట్టాలని మారేడు మొక్కను అందించి నాను ఆ మొక్కని గణపతి పూజలో పెట్టి పూజలు అయిన తర్వాత నాటినది ఇప్పుడు ఆ మొక్క ఇప్పుడు మూడు అడుగుల వరకు పెరిగినది, బొల్ల బోయిన లక్ష్మి, ఇంగ్లీష్ మీడియా బాలు, వనమా శివ, మరియు రామవరం లో ఉన్నటువంటి గణేష్ గౌరవ ఉత్సవ కమిటీ సభ్యులు గణపతి వారి పూజలో మొక్కలు పెట్టినందుకు వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## గణేష్ మండపాలలోహెూమం నిర్వహిస్తున్న భక్తులు



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): వినాయక చవితి రోజున మండపాలలో కొలువైన గణనాథుడు ప్రతి మండపంలో నిత్యం భక్తులతో పూజలు అందుకుంటున్నాడు. టేకులపల్లి ఎక్స్ రోడ్ గణేష్ మండపంలో శ్రీరంగం అజయ్ సాయి చక్రి పూజారి మంత్రోత్సవం తో హెూమం కార్యక్రమం



నిర్వహించడం జరిగింది, గ్రామంలో ఎంతో భక్తి శ్రద్ధలతో మహిళలు, యువతులు, సిద్ధి విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకొనుటకు పూజా కార్యక్రమంలో పాల్గొనుటకు కమిటీ నిర్వాహకులు ప్రతిరోజు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.టేకులపల్లి, సులానగర్,బోడు, కొప్పురాయి, కుంటల, కోయగూడెం, ముత్యాలంపాడు, బేతంపూడి, గోలియాతండ, ముత్యాలంపాడు, క్రాస్ రోడ్డు, బొమ్మనపల్లి, మద్రాస్ తండా తదితర గ్రామపంచాయతీ లలోని గ్రామాలలో గణనాథుని పూజా కార్యక్రమాలతో ప్రతి గ్రామంలో సందడిగా మారింది ఆదివారం కుంటల్ల మరియు టేకులపల్లి రోడ్ సెంటర్ లో తొమ్మిదో రోజు గణపతి హెూమం నిర్వహించారు, కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటు అన్నదానం కార్యక్రమాలు చేయడం జరిగింది

# బాబునాయక్ తండాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన

## శ్రీసత్య లయన్స్ ఐ హాస్పిటల్ చారిట్రబుల్ ట్రస్ట్

మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్, ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో శ్రీ విజయ హాస్పిటల్, శ్రీ సీతారామ మెమోరియల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మానుకోట జిల్లా మున్సిపాలిటీ బాబునాయక్





తండా ప్రాథమిక పాఠశాల నందు ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో బాబునాయక్ తండా, పత్తిపాక, మంగళ కాలనీ, సాంక్రియ తండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు. శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రొయ్యూరు సురేష్, డాక్టర్ దారావత్ రెడ్డి నాయక్ కంటి వైద్య నిపుణులు, డాక్టర్ కవిత కంటి వైద్య నిపుణులు, శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ నందు జనరల్ ఐ చకప్, గ్లూకోమా, మెల్లకన్ను, కాంటాక్ట్ లెన్సెస్, హైమోఫియా కొరకు ఐసిఎల్, స్పెషాలిటీ సర్వీసెస్, కార్నియా, ట్రోపోగ్రఫీ కెరటోకోనస్, రెటీనా, లేజర్ కంటి ఆపరేషన్, రెటినాల్ వాస్కులర్ డిజార్డర్స్, ఊవీయా, ప్లాస్టిక్ సర్జరీ, అదేవిధంగా మానుకోట జిల్లా పట్టణ గ్రామీణ ప్రాంతాల వారికోసం ప్రారంభించిన శ్రీ సత్య లయన్స్ కంటి హాస్పిటల్ లో అత్యాధునికమైనా పరికరాలతో కంటి పరీక్షలు, ఫెకో సర్జరీ, లాసిక్ సర్జరీ, కంటి ఆపరేషన్లు చేసి, కంటిలో శుక్లాలను పోరలను ఇంజక్షన్ ఇవ్వకుండా, పట్టి కట్టకుండా, కట్టు వేయకుండా, నొప్పి లేకుండా, సూపర్ లేజర్ ఆపరేషన్లు చేస్తారు. అదేవిధంగా షుగర్ వ్యాధిగ్రస్తులకు, అధిక పోటుతో వచ్చే బిపి ఉన్న వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకమైన చికిత్స అందుబాటులో కలదు, కంటిలో పెరిగే మాంసముకు కుట్టు లేకుండా గ్లూ తో ఆపరేషన్ చేస్తారు. గ్లోకోమాకు, ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో చికిత్స, దగ్గర చూపుకు, దూరం చూపుకు, మెడ నొప్పులకు, తలనొప్పికి సరసమైన ధరలకే అద్దాలు, పోగ్రెసివ్, క్రిజల్, ఫినోలెన్స్ అతి తక్కువ ధరలకే ఇస్తారు. డాక్టర్ జాటోత్ వేణు ఫిజియోథెరపిస్ట్, శ్రీ సీతారామ్ మెమోరియల్ దవాఖాన, కన్సల్టెంట్ డాక్టర్ బి.జగదీశ్వర్ ఎంఐడి. పెడియట్రిక్స్ పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు, స్టార్ పర్సనల్ - కేరింగ్ ఇన్సూరెన్సు, ది హెల్త్ ఇన్సూరెన్సు స్పెషలిస్ట్, స్టార్ హెల్త్ కార్డు ఉన్నవారికి (క్యాష్ లెస్) ఉచితముగా వైద్యం చేయబడును. వారి హాస్పిటల్ నందు ఈహెచ్ఎస్ సౌకర్యం కలదు.

### డాక్టర్ డి. విజయశ్రీ, ఎంబిబిఎస్, ఎండీ (గాంధీ ) జనరల్ మెడిసిన్.

మా ప్రత్యేకతలు: షుగర్, బి.పి, దమ్ము, దగ్గు, ఉబ్బసం, అస్తమా, నిమ్ము, టి.బి, తలనొప్పి, పక్షవాతం, ఫిట్స్, ఛాతి నొప్పి,



గుండె జబ్బులు, అల్సర్, కామెర్లు, లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎనిమియా, థైరాయిడ్, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా మొదలైన అన్ని రకాల విష జ్వరాల, కీళ్ళవాతం, తిమ్మిర్లు, మంట, నరాల వ్యాధులు, కాళ్ళు, ముఖం మరియు శరీర వాపులు, తేలుకాటు, పాయిజన్ కేసులు మొదలగు వాటికి ప్రత్యేక వైద్యం చేయబడును. డాక్టర్ బి. రాము నాయక్ ఎంబిబిఎస్, ఎండీ. (ఉస్మానియా) (అనేస్తేసినా- క్రిటికల్ కేర్ ), ఎమర్జెన్సీ ఐసీయూ - క్రిటికల్ కేర్, పాయిజన్ కేసులు, తేలు కాటు వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డి నాయక్ మాట్లాడుతూ మన బాబునాయక్ తండాలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంను ప్రజలు



సద్వినియోగం చేసుకోవాలి. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఎక్కువ మంది ఉన్నందున, ప్రతి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కావున సీజనల్ కాకుండా వేరే వ్యాధులకు కూడా డాక్టర్లు ఉన్నందున, ఈ మెడికల్ క్యాంప్ నందు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ మెడికల్ క్యాంపు నందు పలు రకాల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు, పిల్లలకు న్యూట్రిషన్ కిడ్స్ పంపిణీ చేసి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న ఫిజియోథెరపి డాక్టర్ జాటోత్ వేణు నాయక్, బానోత్ రమేష్, బానోత్ భాస్కర్, సర్వన్, శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ మేనేజర్ ధారావత్ బాలునాయక్, పిఆర్ఓ మోహన్ నాయక్, శ్రీ విజయ హాస్పిటల్ సూపర్వైజర్ వసంత్ కుమార్, ప్రమీల, రాజశేఖర్, అంగోత్ అఖిల్ నాయక్, రూప్ సింగ్, సక్రం, భూక్యా నాచ, ఆంగోత్ శీను, బానోత్ సోములు, రాంచందర్, కృష్ణ, తండా యూత్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# కల్వల శ్రీ వరసిద్ధి వినాయక మండలి ఆహ్వానం మేరకు ఏకదంతుని పూజల్లో పాల్గొన్న చిలువేరు సమ్మి గౌడ్

### గణనాధుని ఆశీస్సులతో పాటు భక్తమండలి తల్లుల ఆశీర్వాదం అందుకున్న చిలువేరు సమ్మయ్య గౌడ్



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా కేసముద్రం మండలం, కల్వల గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక భక్తమండలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కల్వల పాత గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గరలో గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న భక్త మండలి తల్లుల ఆహ్వానం మేరకు విచ్చేసి ఏకదంతుని నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భక్తి శ్రద్ధలతో మహిళా మణులందరితో గణపతి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు చిలువేరు సమ్మయ్య గౌడ్. ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్



మాట్లాడుతూ మండలంలో, జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇంతమంది మహిళా తల్లులు గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం దానిలో భాగంగా నాకు మీ అందరితోపాటు పూజా కార్యక్రమంలో పాల్గొని ఆ దేవుడి ఆశీస్సులను అందించడంతో పాటు, వందల మంది మాతృ సమానులైన తల్లుల అందరి ఆశీర్వాదం నాకు దక్కినందుకు సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తపరిచారు. నాకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన శ్రీ వరసిద్ధి వినాయక భక్తమండలి ఉత్సవ కమిటీ తల్లులందరూ వారు వారి కుటుంబసభ్యులతో సహా, కల్వల గ్రామ ప్రజలందరు పాడి, పంటలతో, సుఖసంతోషాలతో అయురారొగ్యాలతో, సిరి సంపదలతో నిండు నూరేళ్లు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ అదేవిధంగా మహిళా మణులందరూ మేము ఏది అడిగిన లేదు అనకుండా, మమ్మల్ని తన తల్లుల్లా భావించి మాకు అండగా నిలుస్తున్న మా కొడుకు సమ్మిగౌడ్ ఆనందంగా ఉండాలని, వారి సేవా గునానికి సంతోషం వ్యక్తపరుస్తూ ఆ గణనాధుని యొక్క కృపా కటాక్షాలు సమ్మి గౌడ్ కి వారి కుటుంబానికి నిండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎర్రంశెట్టి అశోక్, గాజుల రవి కళ్యాణ్, కొమ్మాల రమ, కొమ్మాల దేవమ్మ, కొమ్మాల పద్మ, గంట పద్మ, కోణ పద్మ, శీలం సుజాత, అల్వాల శైలజ, చెల్ల ధనమ్మ, దొంతు వీరమ్మ, అల్వాల పద్మ, చిట్టమల్లు ఉపేంద్ర, చింతకాని హేమలత, లక్కాకుల రజిత, ముప్ప కలమ్మ, మార్గం జయమ్మ, చీకటి స్వాతి, కొలిపాక కొమరమ్మ, కందునూరి హైమ, మార్గం, మౌనిక, చీకటి సరోజన, గంట విజయ, పెరటి శ్రీలత, కూన ఉమ, పెద్దార సుజాత, కొడకండ్ల హైమ, ఆరెందుల పద్మ,ఆరెంధుల శ్రీదేవి, చీకటి సరిత, గంట మంజుల,గిరగాని జయమ్మ, పెద్దారపు విజయ, చింతనూరి హేమలత,రామడుగు సుజాత, కొండేటి కళాధర్, పబ్బతి ప్రశాంత్ గౌడ్ తో పాటు గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు సకుటుంబ సపరివార సమేతంగా పాల్గొని గణనాధుని ఆశీస్సులు తీసుకున్నారు.

# కాసులకు కక్కుర్తి పడి అమ్ముడుపోయిన జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిడి



### గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పేద పిల్లల భవిష్యత్తు ఏంటి ?
### తూతూ మంత్రంగా కలెక్టర్ కార్యాలయం, పట్టించుకోని జిల్లా కలెక్టర్
### వారం రోజులలో బదిలీ అయినా ఉపాధ్యాయులు, జూనియర్ అసిస్టెంట్లు వారి స్థానాలకు వెళ్లకుంటే డిడి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక
### బోడ రమేష్ నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా కమిటీ సమావేశం అనంతరం మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల గురించి ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ లో సాధారణ కౌన్సిలింగ్ ద్వారా బదిలీ అయి దాదాపుగా నెల రోజులుగా వస్తున్న కూడా కొంతమంది ఉపాధ్యాయులు మరియు జూనియర్ అసిస్టెంట్లు గతంలో అవినీతి అక్రమాలకు పాల్పడి అలవాటు పడ్డవారు. డబ్బు బలంతో తాము దోచుకున్న దాంట్లో కొంత మొత్తంలో డిడికు మూట చెప్పడం వల్ల తమకు బదిలీలైన స్థానం కు వెళ్లడం లేదన్నారు. వారు మరల 10 సంవత్సరాలు ఆశ్రమ పాఠశాలలో చదువుకునే పేద పిల్లల నోరు కొట్టి అక్రమంగా సంపాదించుకోవచ్చని ఆలోచనతో తమకు బదిలీ అయిన స్థానానికి వెళ్లడం లేదు. ఈ ప్రక్రియలో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ డిడి కి తన వాటా తనకు వచ్చినందున ఆయన కూడా బదలీలపై వెళ్ళని ఉద్యోగులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. స్థానచలనం అయిన కొంతమంది ఉపాధ్యాయులు, జూనియర్ అసిస్టెంట్లు బదిలీలపై వెళ్లకపోవడం వల్ల గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు సకాలంలో చదువులు అందక వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళుతుందని అన్నారు. నిఈ విషయంలో గతంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన కూడా ఫలితం లేకపోయింది. స్థానచలనం అయిన ఉపాధ్యాయులు మరియు జూనియర్ అసిస్టెంట్లు బదలీలపై వెళ్లకపోవడంలో అసలు ఆంతర్యం ఏముంది అని ప్రశ్నించారు. వారం రోజుల లోపల స్థానచలనం అయిన ఉపాధ్యాయులు మరియు జూనియర్ అసిస్టెంట్లు వారికి బదిలీ అయిన ప్రదేశాలకు వెళ్లకపోతే జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాన్ని వందల మందితోని ముట్టడి చేస్తామని మహబూబాబాద్ జిల్లా కమిటీ తరపున హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య బాలాజీ నాయక్, జిల్లా కార్యదర్శి జాటోతు వెంకన్న నాయక్, టౌన్ అధ్యక్షులు హాతిరామ్ నాయక్, జిల్లా యువజన అధ్యక్షుడు ధరావత్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక

సోమవారం - 16 - సెప్టెంబర్- 2024

# నిమజ్జనం ఉన్నందున సీసీ కెమెరాలు లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన

### మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి రణవేణి సుజాత సత్యనారాయణ





మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): పట్టణంలో ఆదివారం రోజున మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి రణవేణి సుజాత సత్యనారాయణ మున్సిపల్ కమిషనర్ టి మోహన్ మెట్ పల్లి పట్టణంలోని వట్టి వాగువద్ద సోమవారం రోజు నిమజ్జనం ఉన్నందున సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించినారు చైర్ పర్సన్ మాట్లాడుతూ సోమవారం నిమజ్జనం సందర్భంగా వట్టి వాగు దగ్గర సిసి కెమెరాలు, మరియు లైటింగ్, జనరేటర్, వాగులో నీటి స్టోరేజ్ కొరకు కట్ట వేయడం జరుగుతుందని రెండు క్రేన్లు ఒక చైన్ మిషిన్ వట్టి వాగు చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపినారు గణేష్ నిమజ్జనంకు వచ్చే భక్తులు సకాలంలో వచ్చి నిమజ్జనం చేసి వెళ్ళాలని తెలిపినారు గణేష్ నిమజ్జనం సందర్భముగా మెట్పల్లి పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో డి ఈ నాగేశ్వరరావు, ఏఈ తిరుపతి టిపిఓ రాజేంద్రప్రసాద్ ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నిజాం,మహేష్, శేఖర్ లింబయ్య పాల్గొన్నారు

# ఇంజనీర్ జాకీర్ కి సన్మానం..



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): ఆదివారం రోజున ఇంజనీర్స్ డే సందర్భంగా మెట్ పల్లి మదర్స అధ్యక్షుడు అబ్దుల్ జావిద్ ఆధ్వర్యంలో ఇంజనీర్ జాకీర్ పాషా ను ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో అబ్దుల్ జావిద్ మహమ్మద్ రియాజ్ పాల్గొనడం జరిగింది

# "పద్మజ"ఎంతోమంది విద్యార్థులకు విద్యాబోధన నేర్పి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా నిలిచారు

### పదవి విరమణ అభినందన సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీ హనుమాన్ ఫంక్షన్ హాల్ లో పద్మజ రాజా శ్రీనివాస్ పదవి విరమణ మరియు 61వ పుట్టినరోజు వేడుకలకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పద్మజ 40 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా అనేకమంది విద్యార్థులకు మంచి విద్యను అందించి ఎంతో గొప్ప పేరు తెచ్చుకున్నారని మొదట రామవరం లోని భారత్ పబ్లిక్ స్కూల్ సి బి ఎస్ ఈ సిలబస్ లో సైన్స్ టీచర్ గా పనిచేసి ఆ తరువాత ప్రభుత్వ టీచర్ గా ఉద్యోగం పొంది అనేక ప్రాంతాలలో ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని, ప్రస్తుతం పాల్వంచలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదవి విరమణ పొందడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ బాధ్యులు డి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు వాస్, ప్రమీల, రాజకుమారి, సతీష్, వీరస్వామి, రాజు, పి శ్రీనివాస్, ప్రమీల, రాజకుమారి, సతీష్, రాజేశ్వరి, పాపయ్య, పద్మజా టీచర్ కుమారుడు భరద్వాజ్ , కోడలు లావణ్య, కుమార్తె హిమ బాల, అల్లుడు రాఘవ్ , సిపిఐ మహిళా సమైక్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు బరిగెల సంపూర్ణ, భారత్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు బరిగెల పద్మలత, బరిగెల భూపేష్, కంపెల్లీ నిర్మల,తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ప్రదర్శన!!

టేకులపల్లి (గౌతమ్ న్యూస్): తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా తేదీ 16 సెప్టెంబర్ 2024 మరియు 17 సెప్టెంబర్ 2024 ఉదయం 9 గంటలకు కొత్తగూడెం పట్టణంలో ప్రకాశం స్టేడియం లో ప్రత్యేకంగా రైతు సోదరులకు వ్యవసాయ మరియు అనుబంధ శాఖల వారిచే నిర్వహించబోయే వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలు రైతులకు అవసరమగు ఆధునిక వ్యవసాయ పరికరాలు యంత్రాలు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన ప్రదర్శన ఉద్యాన పంటల ప్రదర్శన సేంద్రియ వ్యవసాయం పాడి పశువుల ప్రదర్శన కలదు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ సహకార మార్కెటింగ్ టెక్స్టైల్స్ మరియు హ్యాండ్లూమ్స్ శాఖ మంత్రివర్యులు గౌరవనీయులైన శ్రీ తుమ్మల నాగేశ్వరావు గారు మరియు గౌరవ అతిథులు పాల్గొనదరు కావున రైతు సోదరులు విరివి గా ఈ కార్యక్రమం లో పాల్గొనవలసిందిగా జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ భద్రాద్రి కొత్తగూడెం వారు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# సిపిఐ సీనియర్ నేత మోదుంపల్లి దుర్గ రాజ్యం పెద్దకర్మ లో పాల్గొన్న

### సిపిఐ,ఏఐటీయూసీ, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని



సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం లోని పంజాబీ గడ్డ 8వ మున్సిపల్ వార్డులో సిపిఐ సీనియర్ నాయకుడు మోదుంపల్లి దుర్గరాజ్యం పెద్దకర్మ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డి.ఎస్.పి విలియం, సింగరేణి యూనియన్ నాయకులు టి.శరభ లింగం, ఏఐటీయూసీ నాయకులు మాతంగి లింగయ్య, అన్నెం లక్ష్మీనారాయణ, దొమ్మేటి నాగేశ్వరావు,ఎస్.ప్రసాద్ రావు తోట సమ్మయ్య, రామకృష్ణ పరమహంస , షబ్బీర్ అహ్మద్, చంద్రరెడ్డి మాజీ సింగరేణి మైనింగ్ సూపర్వైజర్స్,8వ వార్డు కౌన్సిలర్ కంచర్ల జములయ్య, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు బరిగెల సంపూర్ణ, పేయ్యాల రంగారావు, బరిగెల భూపేష్, పాటి మోహన్, వాకపల్లి హరినాథ్, ఆర్.దేవదాస్, ఎనగందుల నర్సింగరావు సూధనాల రమేష్,మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ వెంకన్న, జిల్లా కార్యదర్శి సామర్ల సమ్మయ్య, నాయకులు కొత్తూరు మదనయ్య, కూరగాయల శ్రీనివాస్, ఇల్లందుల పోచయ్య, ఆవునూరి చంద్రయ్య కుటుంబ సభ్యులు అమృత, శ్యామల, రాజు, సరిత, సురేష్, భాగ్య, రాజయ్య, మురళి, శ్రీ హర్ష, ఉట్ల కోటి, గుడిసెల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు లక్షల రుణమాఫీ కాకపోవటంతో పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు!!

### అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి తుపాకుల నాగేశ్వరావు



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండలంలో అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి తుపాకుల నాగేశ్వరావు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతంగానికి నష్టపరిహారం ఇవ్వాలని గృహాలు కోల్పోయిన వారికి తక్షణమే గృహాలు కల్పించాలని వారు కోరారు టేకులపల్లి మండల సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు అధ్యక్షన జరిగిన ముఖ్యల సమావేశంలో ఆకల వర్షానికి నష్టపోయిన రైతంగానికి ఎకరానికి 30000 పంట నష్ట పరిహారం చెల్లించాలని గృహాలు కోల్పోయిన వారికి నూతన గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు వరదలలో మరణించిన వారికి 25 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని , రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తుఫాన్ వలన దెబ్బతిన్న రోడ్లను కలవట్లను తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని తుఫానులు బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అట్లాగే ముందు చూపు లేకపోవడంతోనే ఇలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయని తుఫాన్ హెచ్చరిక వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీని సంబంధిత అధికారులు పెడచెవిన పెట్టడం మూలాన అపార నష్టం జరిగిందని వారు కొనియాడారు పంట రుణమాఫీలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనత వైఖరితో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఈ ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని అన్నారు రాష్ట్రంలో రైతాంగం ఆత్మహత్యలకు పూనుకుంటా ఉంటే రుణమాఫీలను మాఫీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని తక్షణమే రెండు లక్షల రూపాయలు మంజూరు కానీ రైతంగానికి రుణమాఫీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎట్టి నరసింహారావు గుగులోత్ రామచందర్ బానోత్ వెంకట్ రామ్ ధారావత్ వెంకన్న సూరయ్య వినోద్ డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# ప్రతిపల్లెలో ఎర్రజెండా రెపరెపలాడాలి

### గ్రామీణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు నిరంతర కృషి.

### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సమక్షంలో 60 కుటుంబాలు సిపిఐలో చేరిక.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : పల్లెప్రజలకు కావాల్సిన కనీస మౌలిక వసతుల కల్పనకు నిరంతర కృషి జరుగుతోందని, కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంపై ప్రత్యేక ద్రుష్టి సారించి సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిరంతర కృషి జరుగుతోందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పునరుద్ఘాటించారు. సుజాతనగర్ మండలంలోని పాత అంజనాపురం గ్రామపంచాయతి చిమ్నాతండాలో కూనంనేని సమక్షంలో 60 కుటుంబాలకు చెందినవారు సిపిఐలో చేరారు. వీరికి కూనంనేనితోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ఎర్ర కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటుచేసిన గ్రామస్థాయి సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి గ్రామాన్ని అభిరుద్దివైపు ఉరకలు వేయిస్తానని, రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి జాగురుతోందన్నారు. ప్రతి పల్లెలో ఎర్ర జెండా రెపలాడటం ఖాయమని, నియోజకవర్గంలో సిపిఐకి ఎదురులేదన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు ప్రజలకు సేవలందించడం ద్వారా పార్టీని మరింత విస్తరించాలని సూచించారు. కాగా గ్రామానికి చెందిన బోడ రమేష్, అజ్మీర కళ్యాణ్, సీతారాం, అమ్ము, భూక్యా రమేష్, తేజావత్ రాజేష్, వెంకటేష్, బానోత్ కుమార్, హజ్జి తదితరు 60 కుటుంబాలు సీపీఐలో చేరినవారిలో వున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూక్య దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, మండల నాయకులు తాళ్లూరి పాపారావు, పొదిల శ్రీనివాస్, ధర్మారావు, కొమారి కృష్ణ, మల్లేష్, గోపి, భాగం రామ్మోహనరావు, బండి రమేష్, చిన్న కృష్ణ, ఊకే నాగేశ్వర్ రావు, బాలు, సురేష్, పోటు వెంకటేశ్వర్ రావు, జాన్ విక్టర్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల కష్టాన్ని సొమ్మును వృధా చేయకండి

### సింగరేణి చైర్మన్ బలరాంకు మెమోరండం ఇచ్చిన యువజన సంఘం రాష్ట్ర నేత కోట శివశంకర్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సింగరేణి సొమ్మును 119 నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఒక్కొక్క నియోజకవర్గానికి రెండు కోట్ల రూపాయలు ఇచ్చే ఆలోచనను విరమించు కోవాలి. తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్ చేస్తుంది. సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కార్మికులు బొగ్గు బావుల్లో కొన్ని వందల కిలోమీటర్ల లోతులో గాలి నీరు అందక విష వాయువులతో చెలగాటం ఆడుతూ. ఒక్కసారి బొగ్గు బాయిలో దిగిన తర్వాత ప్రాణాలతో బయటికి వస్తామో లేదో తెలియక సింగరేణి కార్మికులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భారతదేశానికి వెలుగులు నింపుతుంటే సింగరేణి కార్మికుల కష్టాన్ని సింగరేణి కార్మికుల కష్టం ద్వారా వచ్చిన సొమ్మును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 119 నియోజకవర్గాలకు హైదరాబాద్ మినహాయించి మిగతా 118 నియోజకవర్గాలకు ఒక్కొక్క ఎమ్మెల్యేకు రెండు కోట్ల రూపాయలు సింగరేణి సొమ్మును అప్పనంగా కట్టబెట్టే ఆలోచనను విరమించుకోవాలి. సింగరేణి ప్రాంత బిడ్డగా సింగరేణి కార్మికుని బిడ్డగా తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ ఈ ప్రతిపాదనను వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని మిగతా రాజకీయ పార్టీలు అన్ని యూనియన్లు ఈ అంశాన్ని వ్యతిరేకించాలని, తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం యావత్ కోల్బెల్ట్ కార్మికులకు కార్మిక ప్రాంత ప్రజలకు విద్యార్థులకు యువతకు పిలుపునివ్వడం జరుగుతుంది. 20 సంవత్సరాలుగా తెలంగాణ యువత ఉద్యోగాలు లేక నీళ్ల నియామకాలు నిధులు అనే నినాదంతో తెలంగాణ సాధించుకున్న మిగులు బడ్జెట్ తెలంగాణ 10 సంవత్సరాలు తెలంగాణ గత రాష్ట్ర ప్రభుత్వ పాలకులు ముఖ్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ నీ అప్పుల తెలంగాణ గా తయారు చేసి వెళ్ళాడని ఇప్పుడు అందరికీ సింగరేణి సంస్థ బంగారు బాతు లాగా కనబడుతుందని సింగరేణి సమస్త సొమ్మును కార్మికుల కష్టాని కార్మికుల ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయాలి తప్ప కార్మికులకు కార్మికుల కష్టానికి కార్మికుల ప్రాంతాల అభివృద్ధికి సంబంధంలేని వేరే నియోజకవర్గాలలో అప్పనంగా ఖర్చు చేయడం చాలా అన్యాయం అని చాలా దారుణమని ఇప్పటికే సి ఎస్ ఆర్ డి ఎం ఎఫ్ నిధులు అని తదితర కార్యక్రమాల ద్వారా సింగరేణి నిధులు సింగరేణి ఖర్చు చేస్తుందని దయచేసి సింగరేణి సొమ్మును తమ స్వార్ధ ప్రయోజనాలకి తమ నియోజకవర్గాల అభివృద్ధికి వేరే ప్రాంతాల ఎమ్మెల్యేలు వాడుకోవద్దని ఆర్లెడీ కోల్బెల్టు ఎమ్మెల్యేలు కోల్బెల్ ఎంపీలు ఈ అంశాన్ని పూర్తిగా వ్యతిరేకించాలని అవసరమైతే సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలకు కోల్బెల్ట్ ఎంపీలకు సింగరేణి నిధులు వాడుకునే అధికారం ఉంది తప్ప వేరే నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఎట్టి పరిస్థితుల్లో సింగరేణి నిధులు వాడుకునే అర్హత హక్కు లేదని గతంలో ఇలా వేరే ప్రాంతా నియోజకవర్గ ఎమ్మెల్యేలు సింగరేణి నిధులు మంజూరు చేయించుకొని చాలా అవకతవకలు పాల్పడ్డారని అనేక అక్రమాలు జరిగాయని ఈ విషయంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ దయచేసి సింగరేణి సొమ్మును కాపాడాలి.

# సిఈఐఆర్ ద్వారా మొబైల్ రికవరీ!!



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండలం కొత్త తండా గ్రామానికి చెందిన ధారావత్ వెంకన్న తాను మోటార్ సైకిల్ పై వ్యవసాయ నిమిత్తం పనులకు వెళ్తుండగా మార్గ మధ్యలో తన సెల్ ఫోన్ మార్గ మధ్యలో పడిపోవడంతో దాని గమనించిన వెంకన్న వెంటనే దగ్గరలోని టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా 10 నెలక్రితం పోగొట్టుకున్న మొబైల్ ను సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి పోగొట్టుకున్న మొబైల్ ఫోను వెంకన్నకు టేకులపల్లి ఎస్సై పి. సురేష్ ఈరోజు ఇవ్వడం జరిగింది ఎస్ఐ కి వారి సిబ్బందికి తన తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

# కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రేపు నిర్వహించే వ్యవసాయ ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన

### జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రకాశం స్టేడియంలో సోమవారం నాడు ఏర్పాటు చేయబోయే వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖల ప్రదర్శనకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ తరపున నిర్వహించే స్టాళ్ళలో రైతులకు కావలిసిన విత్తనాలు, ఎరువులు, కంపెనీల వివరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతులందరూ మెరుగైన వ్యవసాయం చేయడానికి నూతన పద్ధతులను నేర్చుకోవడానికి ఇది అవకాశమని, వ్యవసాయంపై ఆసక్తిగల రైతులు,యువత ఈ ప్రదేశానికి వచ్చి నూతన వ్యవసాయ విధానంపై శిక్షణ తీసుకోవాల్సిందిగా కోరారు. గతంలో ఇలాంటి ప్రదర్శనలు హైదరాబాద్ మరియు ఢిల్లీ వంటి మహానగరంలో మాత్రమే జరిగేవని చెప్పారు.

# ఇంజనీర్ మాసూద్ అలీ కి ఘనంగా సన్మానం



మెట్ పల్లి(గౌతమ్ న్యూస్): ఆదివారం రోజు న ఇంజనీర్స్ డే సందర్భంగా మెట్పల్లి మదర్స అధ్యక్షుడు అబ్దుల్ జావిద్ ఆధ్వర్యంలో ఇంజనీర్ మాసూద్ అలీ కి ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో అబ్దుల్ జావిద్ మహమ్మద్ యూనుస్ ఎండీ దియాబ్ ఎండీ అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రామవరం 10వ వార్డు గణేష్ మండపంలో ఘనంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న

### సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన



సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం పట్టణం లోని 10వ మున్సిపల్ వార్డు బర్మా క్యాంప్ లో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని శు భాకాంక్షలు తెలియజేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, 1వ వార్డు కౌన్సిలర్ బోయిన విజయ్ కుమార్ కుమార్, సిపిఐ నాయకులు నేరెళ్ల రమేష్ ,సీనియర్ నాయకులు కట్ట సత్యనారాయణ, దొంగ అప్పారావు ,గుత్తుల శ్రీనివాస్, బొక్క ప్రకాష్ ,కేత శివ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ఎలక్ట్రీషన్ ట్రైనింగ్ క్యాటగిరి 1 పోస్టులకు అంతర్గత అభ్యర్థులకు వ్రాత పరీక్ష

### పరిశీలించిన సింగరేణి కార్పొరేట్ జీఎం పర్సనల్, వెల్ఫేర్, ఆర్ సి సామ్యూల్ సుధాకర్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఎలెక్ట్రీషియన్ (ట్రైనీ) - కేటగిరి-1 పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయుటకు ఈ రోజు తేదీ : 15.09.2024, ఆదివారము రోజున సింగరేణి మహిళా డిగ్రీ మరియు పీజి కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. '133' ఖాళీలకు గాను అర్హులయిన '178' అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, '150' మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ వ్రాత పరీక్ష సెక్యూరిటీ, విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో, సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించటం జరిగింది. సింగరేణి మహిళా డిగ్రీ మరియు పీజి కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జిఎం(పర్సనల్) వెల్ఫేర్-ఆర్‌సి పి.సామ్యూల్ సుధాకర్ మరియు జిఎం (ఈ-ఎం) విజిలెన్స్ కే.ప్రసాద రావు పర్యవేక్షించి, పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని, దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని, వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్ సైట్ మరియు సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్-ఆర్‌సి పి.సామ్యూల్ సుధాకర్, జిఎం విజిలెన్స్ (ఈ-ఎం) కే.ప్రసాద రావు, డిజిఎం(పర్సనల్) పి.వేణు గోపాల రావు, విజిలెన్స్ ఆఫీసర్ డి.వీరయ్య, పర్సనల్ మేనేజర్ కే..ప్రకాశ రావు, బి.సమ్మయ్య, డివై.పిఎం లు డి.నాగేశ్వర రావు, కే.సంతోష్ కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద మరియు ఇతర అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## బీసీ కమీషన్ సభ్యురాలు బాల లక్ష్మి కి ఆత్మీయ సన్మానం చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం



హైదరాబాద్(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమీషన్ సభ్యురాలు గా ఓయూ జేఏసీ నేత తెలంగాణ ఉద్యమకారిని రంగు బాల లక్ష్మి గౌడ్ ని నియమించినందున వారిని ఈ రోజు హైదరాబాద్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువాలు పూష్ప గుచ్చం లతో ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు అనుముల భాస్కర్ ప్రముఖ న్యాయవాది బీసీ నాయకులు దరూరి యోగానంద చారి రంగు శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొన్నారు. అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ మలి దశ తెలంగాణ ఉద్యమంలో రంగు బాల లక్ష్మి గౌడ్ ఓయూ జేఏసీ నేత గా ఉంటునే ఉన్నస్థాయి చదువులను వదులుకొని ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేసి వాటికి నాయకత్వం వహించి ఎన్నో కేసులను లాటి తుటాలకు ఎదురు నిలిచి పోరాడిన వీర వనిత రంగు బాల లక్ష్మి గౌడ్ గారు అన్నారు వారి పోరాట స్ఫూర్తిని దృష్టిలో పెట్టుకొని బీసీ కమీషన్ సభ్యురాలుగా గౌరవ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిగారు నియమించినందుకు వారికి మోకుదెబ్బ జాతీయ కమిటీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ద్వారా ఉద్యమ అభినందనాలు తెలియజేస్తున్నాము అన్నారు బాల లక్ష్మి గౌడ్ గారు మునుముందు మరిన్ని ఉన్నత స్థాయి పదవులు పొంది రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే గా మంత్రిగా కావాలని కోరుతున్నామన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైతన్య యాత్రను విజయవంతం చేయాలి



ఖానాపురం(గౌతమ్ న్యూస్): ఖానాపురం మండలంలోసోమవారం ఉదయం 10గంటలకు జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఖానాపురం మండల ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ,మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి మాట్లాడూతూ ఖానాపురం మండలంలోని అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం. నెలకు 25 వేల రూపాయల పెన్షన్ ,డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోడి మల్లేష్ సలీం ,జాఫర్, నల్లతీగల లక్ష్మయ్య ,అనంతుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాజస్థాన్ కు చెందిన సైబర్ నేరస్థుడు అరెస్టు



వరంగల్ (గౌతమ్ న్యూస్): దేశ వ్యాప్తంగా పెట్టుబడుల ముసుగుల్లో ప్రజలను నమ్మించి కోట్లల్లో సొమ్మును కాజేస్తున్న రాజస్థాన్ కు చెందిన సైబర్ నేరగాన్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో వరంగల్ కమిషనరేట్ విభాగానికి చెందిన వరంగల్ సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేసారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ సైబర్ క్రైమ్స్ ఏసిపి విజయ్‌కుమార్ వివరాలను వెల్లడిస్తూ రాజస్థాన్ రాష్ట్రం దేగానా పట్టణానికి చెందిన కాలు రామ్ (33) గత కొద్ది రోజులగా ఆన్ లైన్ లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ రూపంలో ఎక్కువ మొత్తంలో డబ్బును తిరిగి పొందవచ్చని దేశ వ్యాప్తంగా ప్రజలను నమ్మించి మోసం చేసి కోట్లల్లో డబ్బు కొల్లకొడుతున్న ఈ సైబర్ నేరగాడు దేశ వ్యాప్తంగా పన్నెండుకు పైగా నేరాలకు పాల్పడ్డాడు. ఇందులో తెలంగాణ రాష్ట్రంలో రెండు నేరాలకు పాల్పడ్డాడు. నిందితుడు. ఈ సైబర్ నేరస్తుడు ఇటీవల హనుమకొండ ప్రాంతానికి ఓ ప్రముఖ వైద్యుడుని నమ్మించి అతని ద్వారా ఆన్ లైన్ లో 21 లక్షల రూపాయలను పెట్టుబడి పెట్టించి మోసం చేశాడు. సైబర్ నేరగాడి చేతిలో మోసపోయినట్లుగా గుర్తించిన సదరు బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారుల ఉత్తర్వుల మేరకు సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో పోలీసులకు అందుబాటులో వున్న పరిజ్ఞానాన్ని వినియోగించుకోని నిందితుడి అచూకీ కనుగోని ప్రత్యేక సైబర్ బృందం పోలీసులు నిన్నటి రోజున నిందితుడిని రాజస్థాన్ లో అరెస్టు చేసి వరంగల్ కమిషనరేట్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకొవడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ ఏసిపి విజయ్‌కుమార్, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్.ఐలు చరణ్, శివకుమార్, ఏ.ఏ.ఓ సల్మాన్ పాషా,, కానిస్టేబుళ్ళు కిషోర్ కుమార్, అంజనేయులు, రాజుతో పాటు ఇతర సైబర్ విభాగం సిబ్బందిని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## ఏలేరు వరదలు జగన్ మేడ్ మిస్టేక్ - సోమిరెడ్డి



**అమరావతి,:** ఏలేరు వరదలు ప్రకృతి వైపరీత్యం కాదని, మ్యాన్ మేడ్ మిస్టేక్ అని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే జగన్ చేసిన ఈ వ్యాఖ్యలపై టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పందిస్తూ.. జగన్ చెప్పింది కరెక్టేనని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ ఏమీ చేయలేదని.. కాబట్టి ఇది పూర్తిగా జగన్ మేడ్ మిస్టేక్ అని అన్నారు. భారీ వర్షాలతో ఏలేరు పొంగి ప్రవహించిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న జాగ్రత్తలతో ప్రాణ నష్టం సంభవించలేదని అన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 17000 క్యూసెక్కుల ప్రవాహం వస్తేనే కాకినాడ వరకు నీళ్లు వెళ్ళాయని.. ఇప్పుడు 42 వేల క్యూసెక్కుల నీరు వచ్చిన ముందు చూపుతో నష్టాన్ని నివారించగలిగామని చెప్పుకొచ్చారు సోమిరెడ్డి. జగన్ కి క్యూసెక్కులు, టిఎంసీలు, ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో అంటే తెలియదని ఎద్దేవా చేశారు. ఆయన ప్యాలెస్ లో కూర్చుని పాలించారని.. జగన్ హయాంలో ఇరిగేషన్, వ్యవసాయ శాఖలు నిర్వీర్యం అయిపోయాయని విమర్శించారు. ఇక అప్పటి జలవనరుల శాఖ మంత్రి డాన్సులకే పరిమితం అయ్యారని దుయ్యబట్టారు.

# ఉపాధ్యాయ సంఘాలూ.. ఈ బాధ్యత తీసుకోండి!



బహుళ, భిన్న సంస్కృతులు పరిఢవిల్లిన ఈ దేశంలో శాంతి, సౌభాగ్యం, సహనశీలత, సామాజిక, శాస్త్రీయ దృక్పథాలు, మానవీయత వంటి ఉత్తమ విలువలను విద్యార్థులలో పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు. వారి ధ్యేయం సమాజ అభివృద్ధి. అందుకే ఉపాధ్యాయులలో ఆదర్శవంతమైన నైతిక ప్రవర్తనను పెంపొందించడానికి ఉపాధ్యాయ సంఘాలు బాధ్యత వహించాలి. తద్వారా విద్యార్థుల్లో విలువలు పెంపొందించి భావి సమాజ నిర్మాణానికి దోహదపడాలి. అధ్యాపకుల సమర్థతను కాపాడడంలో, వారి వృత్తిపరమైన గౌరవాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయ సంఘాలు ప్రముఖ పాత్ర నిర్వహించాలని నూతన జాతీయ విద్యా విధానం -1986 పేర్కొనడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం యూటీఎఫ్, టీఏఫ్, డీటిఎఫ్, పీఆర్‌టీయూ, ఎస్‌డబ్ల్యూఆర్‌టీయూ, యస్‌టీయూ, ఆపస్, తపస్, వెనుకబడిన తరగతుల ఉపాధ్యాయ సంఘాలని, షెడ్యూల్ కులాలకు సంబంధించినటువంటి ఉపాధ్యాయ సంఘాలు, జూనియర్ కళాశాలలో గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్ల సంఘం, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ జూనియర్ లెక్చరర్ల విభాగం, తెలంగాణ లెక్చరర్ల సంఘం, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం, డిగ్రీ స్థాయిలో జీసీజీటీఏ, టీసీజీటీఏ వంటి ఉపాధ్యాయ సంఘాలున్నాయి. ప్రతి విశ్వవిద్యాలయంలోనూ ఆయా వర్సిటీలకు సంబంధించిన అధ్యాపక సంఘాలు ఉన్నాయి. ఇలా దాదాపు 100 దాకా గుర్తింపు పొందిన, గుర్తింపు పొందని అధ్యాపక సంఘాలు(ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య) (లెఫ్ట్, రైట్, తటస్థం సంఘాలు) ఉన్నాయి. ఉన్నత విద్యలో బాగా బలంగా వినపడేటువంటి ఉపాధ్యాయ సంఘాలు ఐఫ్యాక్టో , అఖిల భారతీయ రాష్ట్రీయ సంశిక్ మహాసంఘ్ అధ్యాపకులకు సేవలు అందిస్తున్నాయి. ఇవన్నీ ప్రాథమిక సభ్యుల అవసరాలు తీర్చేందుకు వాటి పరిధిలో అవి పనిచేస్తున్నాయి.

### బతకలేక బడిపంతులు కాలమే నయమా!

అయితే, జీతభత్యాలు, సౌకర్యాలు నామమాత్రంగా ఉండి బతకలేక బడిపంతులు అనే రోజులలోనే విద్యాలయాల మీద మమకారం, విద్యార్థుల మీద ప్రేమాభిమానాలు, వృత్తిపై అంకితభావం, సామాజిక బాధ్యత ఉపాధ్యాయుల్లో ఉండేది. రానూ రానూ అధ్యాపకులు వారి సమస్యల పరిష్కారం కోసం సంఘాలు ఏర్పరచుకొని తమ సమస్యలతో పాటు, విద్యా సంబంధ నిర్ణయాల్లోనూ పాలుపంచుకునేవారు. అయితే ప్రస్తుతం ఆ సంఘాలు వారి హక్కులకు సంబంధించిన విషయాలైనా (జీపీఎఫ్, డీఏలు, పీఆర్సీలు, ఎర్నింగ్ లీవ్స్ ఎన్‌క్యాష్మెంట్, ట్రాన్స్ఫర్లు, ప్రమోషన్లు) కోసం మాత్రమే కాకుండా నైతిక విలువలు గల, సృజనాత్మకమైన విలువలు గల, గుణాత్మకమైన విద్యను, మార్గదర్శకమైన విద్యను అందించడంలో సఫలమవుతున్నాయా, విఫలమవుతున్నాయా? అని ఆలోచించాలి. ఒకవేళ విఫలం అయితే ఎలాంటి కార్యాచరణ రూపొందించాలి. ప్రభుత్వాలు తీసుకునేటువంటి విద్యా సంబంధ నిర్ణయాలను, నిజంగా క్షేత్రస్థాయి విద్యకు ఉపయోగపడే విధంగా ఉన్నాయా? ఒకవేళ లేకపోతే ప్రభుత్వ పెద్దలను ఒప్పించి, అవసరమైతే చట్టబద్ధమైన, న్యాయస్థానాల ద్వారా సాధించుకోవాలి.

### ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఉన్నాయా?

టీచర్ ట్రైనింగ్ కోర్సులు ( టీటీసీ, బీఎడ్ - ఎంఈడీ) కోర్సుల ద్వారా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు... టీచింగ్ విధానంలో వస్తున్న నూతన పోకడలను, సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకొని పాఠాలు చెప్పడంలో ఏ విధంగా విద్యార్థులకు చేరువ కావాలి అనే ప్రశ్న బహు అరుదు. జూనియర్, డిగ్రీ, కళాశాలలో విశ్వవిద్యాలయాల స్థాయిలో లెక్చలర్లకు, ఆచార్యులకు టీచింగ్‌లో టీచర్ ట్రైనింగ్ కోర్సులు చేయ కుండా వారు పాఠాలు బోధించడం శాస్త్ర సహితంగా లేదు. ఒకవేళ టీచర్లు గానీ, లెక్చరర్లు గానీ ఎంతమంది ఎడ్యుకేషన్ ప్రోగ్రాంల కు క్రమం తప్పకుండా అటెండ్ అవుతున్నారు, దీనికి ఉపాధ్యాయ సంఘాలు ఎలాంటి ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేస్తున్నారనేది మనం ఒకసారి ఆలోచించాలి. విద్యా విషయాలపై, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, విద్యా వ్యవస్థలో నూతన పోకడలపైన, శాస్త్ర సాంకేతిక పద్ధతులను ఉపయోగించి పాటలు చెప్పడంలోనైనా, సెమినార్లను, కార్య గోష్టులను (వర్క్ షాప్స్), ఎగ్జిబిషన్లను, చర్చలను నిర్వహించాలి.

### విద్యాలయాలు సక్రమంగా పనిచేసేలా..

విద్యాలయాలు సక్రమంగా పనిచేసేలా సమయపాలన పాటించేలా ఉపాధ్యాయ/అధ్యాపక సంఘాలు కృషి చేయాలి. అధ్యాపకుడు తరగతి గది నుండి సమాజానికి విస్తరించాలి. సత్ ప్రవర్తన గల సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయ సంఘం బాధ్యత తీసుకోవాలి అప్పుడే విద్యాలయాలకు సమాజ సహకారం ఉంటుంది. ఉపాధ్యాయ సంఘాలు వృత్యంతర శిక్షణా తరగతులు నిర్వహించడంలో సమాజంలో వివిధ వర్గాల నిపుణుల సేవలను వినియోగించుకుని నూతన పోకోడలను ఉపాధ్యాయులకు అందజేయాలి. కొత్త సిలబస్ అమల్లోకి వచ్చినప్పుడు ఉపాధ్యాయులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించాలి.

# అక్రమ నిర్బంధానికి పరిహారం లేదా



చెయ్యని నేరానికి 10 ఏళ్ల జైలు శిక్ష అనుభవించిన వ్యక్తికి అమెరికాలోని చికాగో కోర్టు, 50 మిలియన్ డాలర్ల (రూ.419.96 కోట్ల) నష్టపరిహారం చెల్లించాలని సంచలన తీర్పు ఇచ్చింది. అమెరికా ఫెడరల్ కోర్టుతో సమానమైన న్యాయ సమీక్షాధికారం కలిగిన మన సుప్రీంకోర్టు కూడా గతంలో కొంతకాలం శిక్ష అనుభవించిన తరువాత కోర్టు విచారణలో నిర్దోషులుగా పేర్కొంటూ కొందరిని విడుదల చేసిన ఉదంతాలు చాలానే ఉన్నాయి. అయితే అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పును మన సుప్రీంకోర్టు, హైకోర్టులు కూడా ఆదర్శంగా తీసుకొని నిందితుల పట్ల మానవతా దృష్టితో కేసులు సత్వరంగా విచారించాలి. సుదీర్ఘ కాలం జైల్లో మగ్గుతున్న వారికి స్వేచ్ఛ కల్పించాలి. 19 ఏళ్ల వ్యక్తిని హత్యచేశాడన్న అభియోగంపై 'మార్సల్ బ్రౌన్'ను 2008లో పోలీసుల అరెస్టు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు... అతడిని దోషిగా నిర్ధారిస్తూ 35ఏళ్ల పాటు జైలుశిక్ష విధించింది. అయితే బ్రౌన్‌తో పోలీసులు బలవంతంగా నేరం ఒప్పించారని... అలాగే కల్పిత సాక్షాలు సృష్టించారని 2018లో అతడి న్యాయవాదులు కోర్టుకు సాక్షాలు సమర్పించారు. దీంతో బ్రౌన్‌పై నమోదైన కేసును కొట్టి వేసిన కోర్టు... అతడిని విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే తనకు జరిగిన అన్యాయంపై బ్రౌన్ షికాగో ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 'తప్పు డు కేసులో బ్రౌన్‌ను అరెస్టు చేసినందుకు 10 మిలియన్ డాలర్లు, 10 ఏళ్ల పాటు జైలు శిక్షతో మగ్గేలా చేసినందుకు 40 మిలియన్ డాలర్లు నష్టపరిహారం అతనికి చెల్లించాలని ఆదేశించింది. ఇలాంటి సంచలనాత్మక తీర్పు ఇచ్చినందుకు షికాగో ఫెడరల్ కోర్టు న్యాయమూర్తులను, అక్కడి న్యాయవాదులను అందరూ అభినందించాలి. తప్పుడు కేసులో ఇరికించినందుకు అక్కడి పోలీసులకు లేదా ఇతర విచారణాధికారులకు డిపార్టుమెంట్ పరంగా ఎలాంటి శిక్షలు విధించారో సమాచారం వెల్లడి కాలేదు.

### బతికి బయట పడ్డారంటే గొప్ప!

మన దేశంలో ప్రొఫెసర్ సాయిబాబాను సుమారు పదేళ్లు జైల్లో నిర్బంధించారు. ఆయన అండ సెల్‌లో అనేక బాధలు అనుభవించారు. ఆయన సుమారు 80 శాతానికి పైగా వికలాంగుడు. తన నిత్య కాలకృత్యాలు తీర్చుకోవటానికి కూడా కనీసం ఇద్దరు లేదా ముగ్గురి సహాయం కావాలి. తన వీల్ చైర్ కూడా పట్టని అతి ఇరుకైన అండ సెల్‌లో ఆయన్ని నిర్బంధించారు. బయట ప్రపంచంతో సంబంధం లేకుండా ఒంటరిగా సెల్‌లో నరకయాతన అనుభవించాడు. ఆయనకు కొవిడ్ సమయంలో కూడా బెయిల్ ఇవ్వలేదు. నిత్యం వాడే మందులు సైతం ఇవ్వలేదు. కొడుకు జైలుపాలు అయితే తల్లడిల్లిన ఆయన తల్లి మనాదితో చనిపోయింది. అయితే కన్న తల్లిని చివరిసారి చూపేందుకు కూడా పోలీసులు ఆయనను అనుమతించలేదు. ఈ అక్రమ అరెస్ట్ వల్ల తన ఇంగ్లిష్ ప్రొఫెసర్ ఉద్యోగం ఊడింది. కుటుంబం ఆర్థికంగా చితికి పోయింది. తాను అనుభవించిన జైలు బాధలు, కష్టాలు ఇటీవల మీడియాకు స్వయంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రొఫెసర్ సాయిబాబా చెప్పారు. పదేళ్ల తర్వాత సుప్రీంకోర్టు తీర్పుతో ఆయన నిర్దోషిగా బయట పడ్డారు. అలాగే విప్లవ రచయిత వరవరరావుపై అనేక కేసులు పోలీసులు పెట్టారు. బెయిల్ వస్తే తిరిగి మరోకేసులో ఆయనను ఇరికించి, నిర్బంధించడం షరా మాములుగా మారింది.

### కోల్పోయిన జీవితం తిరిగొస్తుందా?

ఇలా అక్రమంగా ఇరికించిన ఎంతోమంది విచారణను ఎదుర్కొంటూ జైళ్లలోనే మరణించారు. విచారణ పూర్తికావడానికి చాలా సమయం పడుతుంది. అంతకాలం వారు జైలులో మగ్గాల్సిందే. సంవత్సరాల శిక్ష తర్వాత కోర్టులు నిర్దోషులుగా ప్రకటిస్తే.. వారు అనుభవించిన భౌతిక యాతనకు, మనోవేదనకు, కుటుంబం పొందిన మాన, అవమానాలకు, కోల్పోయిన విలువైన స్వేచ్ఛకు జవాబుదారీతనం ఎవరు వహిస్తారు? కొన్నిసార్లు నేరం చేస్తే పడవలసిన శిక్షాకాలం కంటే ఎక్కువ కాలం జైలు నిర్బంధాన్ని ఎదుర్కో వలసి వస్తుంది. అసలు ఏ కేసుల్లో పోలీసులు ఎందుకు అరెస్టు చేశారో...ఏ కేసులు తమపై పోలీసులు బనాయించారో తెలియని అనేక మంది నిరక్షరాస్యులు, పేద గరిజనులు, దళితులు పడే అగచాట్లు చెప్పలేము. ఎన్నో ఏళ్ల తరువాత నిర్దోషులుగా కోర్టులు తుది తీర్పు వెలువడే నాటికి వారు కోల్పోయిన జీవితం తిరిగిరాదు. ఇప్పటికీ ఎంతోమందిపై విచారణకు రాని లక్షలాది కేసులు వివిధ కోర్టుల్లో పెండింగులో ఉన్నాయి. ఎప్పటికీ ఆ కేసులు పరిష్కారం అవుతాయో ఎవరూ చెప్పలేరు. పోలీసులు, దర్యాప్తు సంస్థలు శాస్త్రీయ పద్ధతుల్లో విచారణ జరపడం లేదు. చట్ట వ్యతిరేకంగా నిందితులను కొట్టి, హింసించి, చార్జిషీట్లపై సంతకాలు తీసుకుని అభియోగాలు మోపు తున్నారు. ఇలా అక్రమంగా ఇరికించిన కేసుల్లో ఒక కోర్టు బెయిల్ ఇస్తే మరో కేసులో బెయిల్‌ను నిరాకరించి నిందితుడిని సుదీర్ఘంగా బంధిస్తున్నారు. ఇలాంటి సంస్కృతికి స్వస్తి చెప్పాలి.

### ఈడీ కేసులన్నీ నిరాధారాలేనా?

గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వ లోపాలను విమర్శించినందుకు, అనేక మంది కవులను, కళాకారులను, సంపాదకులను, జర్నలిస్టులను ఈడీ, సీబీఐ, ఐటీ మొదలైన కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడి చేసి, సోదాలు జరిపి అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 2014-2024 మధ్యకాలంలో మనీ లాండరింగ్ చట్టం క్రింద మొత్తం 5,297 కేసులు పెట్టింది. అయితే అందులో సాక్షాధారాలతో రుజువైనవి కేవలం 40 మాత్రమే. అంటే ఈడీ సక్సెస్ రేటు కనీసం 1 శాతం కూడా లేదు. ఈ డేటాను కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్‌కు సమర్పించింది. ఇదే విషయంపై ఈడీ పనితీరుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు కూడా చేసింది. అందుకే రాజకీయ ప్రేరణలతో అక్రమ కేసులు పెట్టే పోలీసు అధికారులకు శిక్షలు విధించాలి. పౌర హక్కులు, మానవ హక్కులకు న్యాయస్థానమే రక్షణ కల్పించాలి. విచారణ జరగకుండా కేసులు వాయిదా పడేటట్లు జాప్యం చేసేందుకు పరస్పరం సహకరించుకొనే పోలీసులకు, న్యాయవాదులకు కూడా కోర్టులు శిక్షలు వేయాలి. నిర్దోషులుగా విడుదల అయిన వారికి అమెరికా ఫెడరల్ కోర్టు నష్టపరిహారం ఇప్పించినట్లు మన ఉన్నత న్యాయస్థానాలు కూడా బాధితులకు పెద్ద మొత్తంలో నష్ట పరిహారం ఇప్పించాలి.

# కార్యకర్తా... నువ్వు జాగ్రత్త!



తెలంగాణ రాష్ట్రం కోసం, ఉద్యమ సమయంలో అప్పటి టీఆర్ఎస్ పార్టీ పిలుపుతో ఎంతో మంది కార్యకర్తలు, విద్యార్థులు తమ ప్రాణాలకు తెగించి పోరాటంలో ముందున్నారు. కొందరైతే ప్రాణాలు కూడా లెక్కచేయలేదు. అయితే, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఆ కార్యకర్తలకు గానీ, ఆ విద్యార్థులకు గానీ ఎలాంటి ప్రయోజనం చేకూరలేదనే వాదనలు ఉన్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు కావాలని తమ నోటి దూరుసుతో వివాదాలను సృష్టిస్తూ కార్యకర్తలను బలి పశువులు చేస్తుంటారు. తమ లీడర్ సర్వస్వం అనుకొని ఆ కార్యకర్తలు సైతం తమ లీడర్‌పై ఈగ కూడా వాలనీయకుండా నాయకుడిని కాపాడే క్రమంలో గాయాలపాలవ్వడంతో పాటు కేసులు కూడా నమోదైన ఘటనలను చూశాం. ఆ తర్వాత కార్యకర్తల పరిస్థితి ఏమవుతుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. కార్యకర్తలు తమ కుటుంబాన్ని కూడా లెక్క చేయకుండా తను నమ్ముకున్న నాయకుడి కోసం ప్రాణాలు తెగించి పోరాడుతున్నారు. కానీ తెరవెనుక రాజకీయ నాయ కులు అందరూ ఒకటే అని కార్యకర్తలకు ఎప్పుడు అర్థమవుతుందో..?

తాజాగా రాష్ట్రంలో పరిస్థితి..

తాజాగా తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపుడి గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో రాష్ట్రంలో గందరగోళ పరిస్థితిని సృష్టించారు. అసలు ఎమ్మెల్యేల పార్టీ మార్పుని 2014 నుంచి ప్రోత్సహించిందే టీఆర్ఎస్ పార్టీ. బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్షమే ఉండకూడదని ఆలోచనతో 2014 నుంచి 2023 వరకు దాదాపుగా 38 మంది ఇతర పార్టీలలో గెలిచిన ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్పించుకున్నారు. అప్పుడు అంతగా రాద్ధాంతం చేయని బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడెందుకు ఇంత రాద్ధాంతం చేస్తుందో కార్యకర్తలు గమనించాలి. ఆ సమయంలో ఇతర పార్టీల్లో నుంచి వచ్చిన నాయకులే ముందుండి మంత్రి పదవులను, రాష్ట్రంలో అనేక కీలకమైన పదవులను పంచుకుని ముఖ్య పాత్ర పోషించారు. మొదటి నుంచి పార్టీ జెండా మోసిన నాయకులకు మాత్రం పక్కన పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పుడు వారే శత్రువులయ్యారు. అందుకే రాజకీయాల్లో ఎప్పుడు ఎవరు శత్రువులు అవుతారో ఎప్పుడు ఎవరు మిత్రులవుతారో తెలియని పరిస్థితి ఉంటుంది.

అండగా ఉంటామని అంటున్నారే కానీ

నువ్వు నమ్ముకున్న నాయకుడి కోసం ముందుండే కార్యకర్తా... జాగ్రత్త. దాడులలో నీకు ఏమైనా అయితే పార్టీ పెట్టదు, ఇటు ప్రభుత్వం పెట్టదు. ఏదైనా అయ్యి ఆసుప్రతిలో చేరితే ఖర్చు మొత్తం నీ కుటుంబమే భరించాల్సి ఉంటుంది. ఏదైనా సంఘటన జరిగితే.. మీడియా ముందుకు వచ్చి మీ నాయకులు మేము ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నామని, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రకటనలు ఇస్తారే తప్ప ఏ పార్టీనైనా, ఏ రాజకీయ నాయకుడైన ఇంతవరకు కార్యకర్త కుటుంబానికి అండగా నిలబడ్డ దాఖలాలయితే లేవు. తమ స్వార్థాల కోసం నీ జీవితాన్ని నీ కుటుంబం జీవితాన్ని రోడ్డుపైకి లాగే పరిస్థితులు నువ్వు ఎందుకు తీసుకురావాలి? వాళ్ల కోసం నువ్వు ముందుండి ఎందుకు పోరాడాలి? నీకు వారు ఏం చేశారనే విషయాన్ని ఇప్పటికైనా గ్రహించి రాజకీయ నాయకుల ముసుగులో ఇరుక్కున్న ప్రతీ పార్టీకి చెందిన కార్యకర్తను బయటకు రావాలని రాజకీయ నాయకులు తమ స్వార్థాల కోసమే మిమ్మల్ని వాడుకుంటున్నారని గమనించాలని కోరుకుంటున్న.

చట్టాలు కఠినతరం చేయాలి..

ప్రజాప్రతినిధి ఎవరైనా ఏ పార్టీవారైనా, అసభ్య పదజాలంతో కానీ.. ప్రజలను రెచ్చగొట్టే ప్రకటనలు గాని చేస్తే ముందుగా పోలీసులు వారిపై రౌడీషీట్ కేసునో, పీడీ యాక్ట్ కేసునో నమోదు చేసి వారిని శిక్షించే విధంగా చట్టాలు రూపొందాలి. వారు ఏసీ రూములలో ఉంటూ ఏసీ కార్లలో తిరుగుతూ సామాన్య ప్రజలను కార్యకర్తలను రెచ్చగొట్టే ఈ రాజకీయ నాయకులను కఠినంగా శిక్షించాలని భారతదేశ పౌరుడిగా కోరుకుంటున్నాను.

## కౌశిక్ రెడ్డి ఎపిసోడ్.. సీఎం రేవంత్ వార్నింగ్



హైదరాబాద్: తెలంగాణలో అరికెపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి దాడుల ఎపిసోడ్‌పై రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాళ్లు ఎవరి జోలికి వెళ్లారు.. అదే సమయంలో ఎవరైనా మా వాళ్ల జోలికి వస్తే ఊరుకోరు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాగా, గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ..'కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటాను. మహేష్ కుమార్ గౌడ్ సౌమ్యుడు.. ఏం కాదు అనుకోకండి. మహేష్ గౌడ్ వెనుక నేను ఉంటాను. మా వాళ్లు ఎవరి జోలికి పోరు.. ఎవరైనా వస్తే ఊరుకోరు. రా చూసుకుందామని కౌశిక్ రెడ్డి ఎందుకు సవాల్ చేశాడు. వెళ్లి వీపు పగలకొడితే.. కొట్టారు అంటారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు రాజీనామా అంశాన్ని సీఎం రేవంత్ మళ్లీ తెరపైకి తెచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో వ్యవసాయం దండుగ కాదు.. పండుగ అని నిరూపించాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే రైతులకు రుణమాఫీ చేశాం. ఆరు గ్యారంటీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. రూ.2లక్షలు మాఫీ చేస్తామని చెప్పి.. చేసి చూపించాం. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచాం. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రూ.2లక్షలు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తామన్నారు. రైతు రుణమాఫీపై ఆనాడు హామీ ఇచ్చాం.. అమలు చేసి చూపించాం. రాజీనామా సవాల్ చేసిన వాళ్లు ఎక్కడికి పోయారు. రాజీనామా చేయకుండా ఎక్కడ దాకున్నారు. రుణమాఫీ అయిన రైతుల వివరాలు హరీష్‌రావుకు పంపిస్తాం. మొన్నటి గెలుపు సెమీ ఫైనల్ మాత్రమే. 2029లో ఫైనల్స్ ఉన్నాయి. మోదీని ఓడించి రాహుల్ గాంధీని ప్రధానిని చేసినప్పుడే ఫైనల్స్ గెలిచినట్టు' అంటూ కామెంట్స్ చేశారు. 'మీ కంటే పాలన మాకే బాగా తెలుసు': కేటీఆర్‌కు మంత్రి పొన్నం కౌంటర్

## 6 వందే భారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని.. ఈ రాష్ట్రాలకు ప్రయోజనం



**న్యూఢిల్లీ,:** ఈ రోజు ప్రధాని మోడీ 6 వందే భారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వందే భారత్ రైళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా.. టాటానగర్ స్టేషన్‌లో కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, అన్నపూర్ణాదేవి, సంజయ్ సేథ్‌లతో పాటు జార?ండ్ గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ రైళ్లతో కనెక్టివిటీ, సురక్షితమైన ప్రయాణం, ప్రయాణికుల సౌకర్యాలు పెరుగుతాయని రైల్వే మంత్రిత్వ శాఖ చెబుతోంది. ఈ కొత్త వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టిన తర్వాత వాటి సంఖ్య 54 నుండి 60కి పెరిగింది. ఈ విధంగా వందే భారత్ రైళ్లు రోజుకు 120 ట్రిప్పుల ద్వారా 24 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 280 కంటే ఎక్కువ జిల్లాలను కవర్ చేస్తున్నాయి. కొత్తగా ప్రారంభించిన రైళ్లు.. టాటానగర్–పాట్నా, బ్రహ్మపూర్–టాటానగర్, రూర్కెలా–హౌరా, డియోఘర్–వారణాసి, భాగల్పూర్–హౌరా మరియు గయా–హౌరా మార్గాల్లో నడుస్తాయి. దీంతో.. బీహార్, జార?ండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రయాణికుల ప్రయాణాన్ని సులభతరం చేస్తాయి. కాగా.. మొదటి వందే భారత్ రైలు 2019 ఫిబ్రవరి 15న ప్రారంభమైంది. ఈ రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో నడిచే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకారం.. 2024 సెప్టెంబర్ 14 వరకు 54 రైళ్లతో (అప్–డౌన్‌లతో సహా 108 ట్రిప్పులు) మొత్తం 36,000 ప్రయాణాలను పూర్తి చేసింది. 3.17 కోట్ల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానానికి చేర్చాయి. మరోవైపు.. వందే భారత్ రైలు సెట్ ఇప్పుడు వందే భారత్ 2.0గా రూపాంతరం చెందింది. ఈ రైలు వేగం, కవచం, యాంటీ–వైరస్ సిస్టమ్, వైఫై వంటి అధునాతన ఫీచర్‌లను కలిగి ఉంది. మరోవైపు.. ప్రధాన మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. వందే భారత్ పోర్ట్‌ఫోలియో నిరంతరం విస్తరిస్తోంది. మెరుగైన కనెక్టివిటీ కోసం కొత్త రైళ్లను అందులో చేర్చారు. మేక్ ఇన్ ఇండియా చొరవ కింద దేశీయంగా రూపొందించిన ఈ రైలు లక్షలాది మంది ప్రయాణికులకు లగ్జరీ, అత్యాధునిక సౌకర్యాలను అందిస్తుంది.

## కాంగ్రెస్‌లో పని చేసిన ఏ ఒక్కరినీ వదిలేయం



హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) చీఫ్‌గా రేవంత్ రెడ్డి స్థానంలో బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. లాంఛన ప్రాయ కార్యక్రమంలో, పదవీ విరమణ చేసిన టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పార్టీ జెండాను మహేష్ కుమార్ గౌడ్‌కు అందజేసి, పార్టీని నూతనోత్సాహంతో ముందుకు నడిపించాలని కోరారు. మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గన్ పార్క్ నుంచి గాంధీభవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముందు మహేశ్ ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. లక్షలాది మంది కార్యకర్తలు అవమానాలు భరించి..జెండాను అధికారంలోకి తెచ్చారని, కాంగ్రెస్ నీ గెలిపించింది కార్యకర్తలు.. కార్యకర్తలు తల ఎత్తుకుని పని చేసేలా పని చేస్తున్నామన్నారు. ఒకేసారి 18 వేల కోట్లు రుణమాఫీకి ఇచ్చిన పార్టీ దేశంలో ఎక్కడా లేదని, గాంధీ భవన్ నుండి వచ్చే ఆదేశాలు ప్రభుత్వం పాటిస్తుందన్నారు. ఈ ప్రభుత్వం ప్రజలది..ప్రజలకే సంపద పంచే పనిలో ఉన్నామని, కాంగ్రెస్ లో పని చేసిన ఏ ఒక్కరినీ వదిలేయమని ఆయన వెల్లడించారు. ఈ ప్రభుత్వం మనది అని ప్రజలకు చెప్పండన్నారు. కాంగ్రెస్ ఇంచార్జ్ దీపా దాస్ మున్షీ మాట్లాడుతూ.. 'కార్యకర్తలు అంతా.. పునరంకితం అవ్వాలి. రాహుల్ గాంధీ స్వప్నం.. కుల గణన. ఓ వైపు సర్కార్..ఇంకో వైపు పార్టీ సమన్వయంతో పని చేయాలి.' అని అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 'సామాజిక న్యాయం కి కట్టుబడి పార్టీ ఉందని అధిష్టానం నిరూపించింది. పార్టీలో సుదీర్ఘంగా పని చేస్తున్న వ్యక్తికి పిసిసి ఇవ్వడం సంతోషం. ఇతర పార్టీల్లో ఒకే సామాజిక వర్గం కి అధ్యక్ష పదవి ఉంటుంది. కానీ కాంగ్రెస్ లోనే ఎవరికైనా పార్టీ బాధ్యతలు ఇస్తుంది అని. మహేష్ గౌడ్ నేతృత్వంలో పార్టీ బలోపేతం అవుతుంది. కాంగ్రెస్ కార్యకర్తల త్యాగం తోనే అధికారం వచ్చింది. కార్యకర్తల చెమట కష్టం అధికారంలోకి రావడం. మోడీ గ్రాఫ్ తగ్గిపోయింది.. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతున్నారు. సెప్టెంబర్ 17 నాడు విముక్తి కి తెలంగాణా ఏర్పాటు లో బీజేపీ పాత్ర లేనే లేదు. కేవలం కాంగ్రెస్ పాత్ర మాత్రమే ఉంది. బీజేపీ కి సెప్టెంబర్ 17 కి ఏం సంబంధం' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వం మన భారతీయులది..

ఖైరతాబాద్ గణేషుడిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ఇక్కడికి వస్తున్న ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే పెద్ద విగ్రహం పెట్టిన చరిత్రలో మన ఖైరతాబాద్ గణేష్‌ది అని ఆయన అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం మన భారతీయులదని, ఈ సంస్కృతి నీ రాబోయే తరాల వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు హరీష్ రావు. ఆనాడు బాలా గంగాధర్ తిలక్ భారతీయులను ఒక్క తాటిమీదికి తేవడానికి వినాయక చవితి దేశ వ్యాప్తంగా నిర్వహించేలా చేశారని, అప్పటి నుండి ఇప్పటి వరకు అందరూ కలిసి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గత 9 ఏళ్లు కేసీఆర్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించామని, అదే విధంగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. దసరా అయినా, దీపావళి అయినా, బతుకమ్మైనా, బోనాలైనా, శ్రీరామనవమి అయినా, వినాయక చవితి అయినా అందరం కలిసి గొప్పగా జరుపుకునే సంస్కృతి భారతీయులకు ఉంది. ఈ సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మనందరం వినాయక చవితి అనగానే ఒక జోష్ ప్రోగ్రామ్ అనుకుంటాం. కానీ ఎమోషన్ కూడా ఈ పండుగలో ఉంది. ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో బాలగంగాధర్ తిలక్ దేశ ప్రజలందరినీ ఒకేతాటిపైకి తీసుకొచ్చేందుకు వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలు స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు నడిపించాయి. ఆ సంస్కృతిని మనందరం కొనసాగిస్తున్నాం. రాబోయే రోజుల్లో కూడా ఈ సంస్కృతిని కొనసాగిద్దామని హరీష్ రావు పిలుపునిచ్చారు.

# కశ్మీర్. బిజెపికి రెఫరెండమే!



హిమాలయాలతో నిత్యం అతిశీతల వాతావరణం ఆవరించిన జమ్మూకశ్మీర్‌లో చలిగాలులు కన్నా ఎన్నికల వడగాలులే తీవ్రంగా వీస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఘట్టం మరో ఐదు రోజుల్లో ప్రారంభం కానుండడంతో జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ ప్రచారాన్ని వేడెక్కిస్తున్నాయి. హామీల జల్లులు కురిపిస్తున్నాయి. కాంగ్రెస్, మిత్రపక్షం నేషనల్ కాన్ఫరెన్స్ ప్రధానంగా ఆర్టికల్ 370 ను రద్దు చేసి ఇదివరకులా ప్రత్యేక స్వయంప్రతిపత్తితో రాష్ట్రహోదా కల్పిస్తామని తమ అజెండాలో ప్రధాన అంశంగా ప్రకటించాయి. కాషాయం పార్టీ బిజెపి ఆర్టికల్ 370 రద్దు ముగిసిపోయిన చరిత్ర అని, ఎట్టిపరిస్థితుల్లో పునరుద్ధరించేది లేదని స్పష్టం చేస్తోంది. ఆర్టికల్ 370 వల్లనే కశ్మీర్ యువకులు హింస వైపు మళ్లారని కూడా హెచ్చరిస్తోంది. ఈ రెండు పార్టీలు ఈసారి మహిళలకు ప్రయోజనం కలిగించే ఉచిత హామీలను ప్రకటించాయి. అలాగే యువతను ఆకట్టుకోడానికి పథకాలు ప్రకటించాయి. లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని యువత బిజెపి వైపు ఉంటేనే రక్షణ కలుగుతుందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఇక కేంద్ర మంత్రి అమిత్ షా కశ్మీర్ యువతతో కేంద్రం చర్చలు జరపడానికి సిద్ధంగా ఉందని ప్రకటించారు. కానీ ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా కశ్మీర్ యువత ఆందోళనలు సాగించినప్పుడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వారిపై ఉక్కుపాదం మోపి అణగదొక్కిందన్న సంగతి కాషాయ నాథులు మరిచిపోరాదు. ఇంకా చాలా మంది యువకులు ఆ కేసుల్లో నిందితులై జైళ్లలో ఇంకా మగ్గుతున్నారు. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్ కాషాయం కండువా కప్పుకుంటుందా? లేక కాంగ్రెస్ స్నేహ 'హస్తం' అందుకుంటుందా? అన్నది ఎన్నికల ఫలితాలు చెబుతాయి. ఆర్టికల్ 370 రద్దు తరువాత వచ్చిన ఈ మొదటి ఎన్నికల ఫలితాలు బిజెపి ప్రభుత్వానికి రెఫరెండం కానున్నాయి. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు సంయుక్తంగా పోటీలో ఉన్నాయి. మరోవైపు బిజెపి, పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీలు గట్టిపోటీ ఇస్తున్నాయి. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ క్రమంగా 51, 36 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాయి. నేషనల్ కాన్ఫరెన్స్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం వల్ల విజయావకాశాలు మెరుగ్గా ఉండవచ్చని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 19.3 శాతం, నేషనల్ కాంగ్రెస్ 22.2 శాతం ఓట్లు సాధించుకున్నాయి. కశ్మీర్ లోయలో నేషనల్ కాన్ఫరెన్స్ బాగానే తన పనితీరు చూపిస్తుందన్న నమ్మకంతో కాంగ్రెస్ ఉంది. మరోవైపు జమ్మూలో మోడీ ప్రభుత్వం బలం పెంచుకుంది. జమ్మూలో మెజారిటీ సంఖ్యలో హిందువులు 37 నుంచి 43 సీట్ల వరకు ఉన్నారు. హిందూ ముఖ్యమంత్రి కావాలన్న నినాదంతో బిజెపి ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ దీనికి అనుగుణంగానే జమ్మూ రీజియన్‌లో 43 స్థానాలపై దృష్టి పెట్టి ప్రచారం సాగిస్తోంది. జమ్మూలో బిజెపి ఓట్ల బ్యాంకును కొల్లగొట్టాలన్నదే కాంగ్రెస్ వ్యూహం. సిపిఎం, జె అండ్‌కె పీపుల్స్ కాన్ఫరెన్స్ అవామీ ఇతిహాద్ తదితర పార్టీలు కూడా రంగంలో ఉన్నాయి. కాంగ్రెస్‌ను విడిచిపెట్టిన మాజీ సిఎం గులామ్ నబీ అజాద్ స్వంతంగా డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ అజాద్ పార్టీ పెట్టినప్పటికీ అనారోగ్య కారణాల వల్ల ప్రచారం చేయడం లేదు. ఇదిలా ఉండగా తీహార్ జైలు నుంచి ఇటీవలనే విడుదలైన బారాముల్లా ఎంపి ఇంజినీర్ రషీద్ అవామీ ఇతిహాద్ పార్టీ తరఫున ప్రచారం ప్రారంభించడంపై పిడిపి, సిపిఎం పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. బిజెపికి డెమ్మీ అయిన ఇంజినీర్ రషీద్ వల్ల ఓట్లు చీలిపోతాయి తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండబోదని పిడిపి నేత, మాజీ సిఎం ముఫ్తీ మెహబూబా విమర్శించారు. అవామీ ఇతిహాద్ పార్టీ అభ్యర్థులనేవారు లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైనప్పటికీ ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారని వారికి బిజెపి వెనుక నుంచి మద్దతు ఇస్తోందని ఆరోపించారు. ఈ ఆరోపణలను ఇంజినీర్ ఎంపీ రషీద్ కొట్టి పారేస్తున్నారు. ప్రధాని మోడీ 'నయా కశ్మీర్' బూటకపు నినాదానికి వ్యతిరేకంగా పోరాడతానని శపథంచేశారు. మరి ఓటర్లపై ఎంతవరకు ప్రభావం చూపిస్తుందో చెప్పలేం. మరోవైపు రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా గత ఐదేళ్లలో జమ్మూకశ్మీర్ ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశామని, ఇదే విషయాన్ని రాష్ట్రంలోని 75% మంది ప్రజలు వెల్లడిస్తారని నమ్మబలుకుతున్నారు. బిజెపి విజయం సాధిస్తే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా తప్పనిసరిగా ఇవ్వాల్సిందే. ఓడిపోతే లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రమే జమ్ముకశ్మీర్‌లో తన పాలన పరోక్షంగా సాగించే పరిస్థితి ఉంటుంది. లెఫ్టినెంట్ గవర్నర్‌కు విశేషమైన అధికారాలను కల్పిస్తూ కేంద్రం ఇటీవలనే చట్టంలో సవరణలు తీసుకొచ్చింది. కశ్మీర్ కిరీటాన్ని సాధించాలన్న పట్టుదలతో బిజెపి ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది.

# ఎవరు జర్నలిస్టులు..ఎవరు కారు?



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎప్పుడో 2008లో పరిష్కారం కావాల్సిన ఒక చిన్న సమస్యకు పదహారేళ్ల తరువాత గత ఆదివారం శుభం కార్డు పడింది. ఈ పదహారేళ్ళలో ఉమ్మడి రాష్ట్రంలో, విభజిత రెండు తెలుగు రాష్ట్రాలలో అయిదుగురు ముఖ్యమంత్రులకు దక్కని ఒక మంచి అవకాశం ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి దక్కింది. ఆ అయిదుగురిలో నలుగురు ముఖ్యమంత్రులు ఈ సమస్యను ఒకవేళ పరిష్కరించాలని నిజాయితీగా అనుకున్నా సాధ్యమ య్యే పరిస్థితులు అప్పట్లో లేవు. సమస్య న్యాయస్థానాల విచారణలో ఉన్నందున వారు వివశులు. అయిదో ముఖ్యమంత్రికి అవకాశం దొరికినా రెండేళ్లపాటు పనికిరాని సందేహాలతో లేదా ఈ సమస్య పరిష్కారం వల్ల లబ్ధి పొందే వారిప ట్ల ఉన్న చులకన భావం వల్లనో, వ్యతిరేకభావం వల్లనో, చెప్పుడు మాటలు వి న్నందువల్లనో మంచి అవకాశం కోల్పోయారు. ఇప్పటికే అందరికీ అర్థం అయి ఉండాలి విషయం ఏమిటో. ఇది తెలుగు రాష్ట్రాల జర్నలిస్టుల గృహవసతికి సంబంధించిన సమస్య. రెండు తెలుగు రాష్ట్రాలలో కోట్లాదిమంది ప్రజానీకం ఉంటే కొన్ని వేలమందిది పెద్ద చర్చించాల్సిన సమస్యా అనే వాళ్ళు ఉండవచ్చు. వాళ్ళ అభిప్రాయాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. జర్నలిస్టులతో సహా సమాజంలోని కొన్ని వర్గాలను ప్రభుత్వాలు ఇంత ప్రత్యేకంగా ఎందుకు చూడాలి అనే అభ్యంతరం ఎప్పుడూ ఉంది. దాని మీద చర్చించవచ్చు. ఇక్కడ మాట్లాడుకుంటున్నది కొన్ని వర్గాల గురించి, కొన్ని రాజకీయ పక్షాలు, నాయకుల వైఖరి గురించి.సరే, వార్తా సేకరణ ద్వారా ప్రైవేట్ యాజమాన్యాల నిర్వహణలో ఉన్న పత్రికల కోసం, మీడియా సంస్థల కోసం పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వాలు ఏ సౌ కర్యమైనా ఎందుకు కల్పించాలి అన్న వాదన మీద చర్చ జరుగుతూనే ఉంటుం ది. జరగనిద్దాం. సమాజంలోని అన్నిరంగాల మాదిరిగానే మీడియాలో కూడా కాంట్రాక్ట్ పద్ధతి ప్రవేశించిన తరువాత ఈ రంగంలో పనిచేసే వారికి ఉద్యోగ భద్రత కానీ, సరయిన వేతన వ్యవస్థ కానీ లేకుండాపోయాయి. వర్కింగ్ జర్నలిస్టులు, ఇతర వార్తా పత్రికల ఉద్యోగులు, కార్మికుల కోసం ఉద్దేశించిన వర్కింగ్ జర్నలిస్టుల చట్టానికి మంగళం పాడి కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ పేరిట తెచ్చిన కొత్త చట్టాలు ఇంకా అమలులోకి రావడానికి చాలా ముందే ఈ దేశంలో మీడియా యాజమాన్యాలన్నీ తమ సిబ్బందికి చట్టబద్ధమయిన చెల్లింపులు, సౌకర్యాలు అందకుండా చేశాయి. అంతకుముందు కూడా యాజమాన్యాలు వర్కింగ్ జర్నలిస్టుల చట్టం అమలు కానీ, అరుదుగా కేంద్రం నియమించిన వేజ్ బోర్డుల సిఫార్సుల అమలుకానీ సక్రమంగా చేసింది ఎన్నడూ లేదు. అటు కేంద్రప్రభుత్వం కానీ ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని మీడియా యాజమాన్యాల మీద చర్యలు తీసుకునే పని చేయలేదు. ఎక్కడో ఒకటి రెండు మినహాయింపులు ఉండవచ్చు. మెజారిటీ జర్నలిస్టులు, మీడియా సిబ్బంది అరకొర వేతనాలతో, ఉద్యోగ భద్రత లేక దు ర్భరమయిన పని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే జర్నలిస్టులకు ప్రభుత్వాలు చేసే సాయాన్ని చూడాల్సి ఉంటుంది. ఇతర వృత్తులకంటే భిన్నమైంది కాబట్టి ప్రభుత్వాలు ఇదొక సోషల్ ఆబ్లిగేషన్‌గా జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు వైద్య సౌకర్యం, పింఛన్ సౌకర్యం, ప్రయాణ రాయితీలు తదితర సహాయాలు చేస్తుంటాయి. సమాచార సేకరణ కోసం విలేఖరులకు ప్రభుత్వం (రాష్ట్రాలలో సమాచార, పౌర సంబంధాల శాఖల ద్వారా, కేంద్రంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా) ఇచ్చే అక్రెడిటేషన్ (గుర్తింపు ) మాత్రం ప్రభుత్వాలు బాధ్యతగా ఇవ్వాలి, జర్నలిస్టులూ దా న్ని బాధ్యతగా స్వీకరించాలి.కోర్టులలో నలిగి నలిగి చివరికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వి రమణ తీర్పుతో హైదరాబాద్‌లో 11 వందలమంది జర్నలిస్టులకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం కేటాయించిన 70 ఎకరాల భూమిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఆదివారం జర్నలిస్టులకు చెందిన జవహర్ లాల్ నెహ్రూ సహకార గృహ నిర్మాణ సంఘానికి అప్పగించారు. జస్టిస్ రమణకు, డాక్టర్ రాజశేఖర్ రెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ జర్నలిస్ట్ కుటుంబాలన్నీ కృతజ్ఞతలు తెలుపుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం గురించి చర్చించుకోవాలి. జర్నలిజంలో (ఇప్పుడు మీడియా అంటున్నాం) నెలకొన్న విపరీత ధోరణులను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వాటిమీద చర్చ జరగాలని కోరారు. నిజమయిన జర్నలిస్టులను తాము గౌరవిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున అందవలసిన సౌకర్యాలు, రాయితీలు అందించడానికి తమ ప్రభుత్వం వెనకాడబోదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో ప్రస్తావించిన విషయాలలో ఒకటి మీడియా –రాజకీయాలు. వా ర్తా పత్రికలు మాత్రమే నడిచిన కాలంలో కూడా కొందరు యజమానులు, కొద్దిమంది జర్నలిస్టులకు రాజకీయాభిప్రాయాలు ఉండేవి. అయితే అవి వారు రాసే వార్తలను ఎన్నడూ ప్రభావితం చేసేవి కాదు. సత్యాన్వేషణలో పత్రికలు ఎన్నడూ తమ రాజకీయ అభిప్రాయాలు, తమ భావజాలం ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడేవారు. రాజకీయ పార్టీలు పత్రికలు పెట్టడం, 24 గంటల వార్తా ఛానళ్ళు ప్రారంభించడం మొదలయిన తరువాత పరిస్థితి మారింది. ఈ క్రమంలోనే జర్నలిస్టుల స్వేచ్ఛ యాజమానుల స్వేచ్ఛగా కూడా మారిన విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యమంత్రి ప్రస్తావించింది ఇదే విషయం. రాజకీయ నడిపే మీడి యా సంస్థలు లేదా ఒకే రాజకీయ పార్టీ అధికారంలో ఉండాలన్న యావలో పడి అధికారంలో ఉన్న పార్టీల ప్రతిష్ఠను దిగజార్చే విధంగా అసత్యాలు రాసే, అభూత కల్పనలు ప్రదర్శించే మీడియా సంస్థలు ఇప్పుడు ఎక్కువయిపోయాయి. తమకు రాజకీయాలు ఉన్నాయని, ఫలానా రాజకీయ నాయకుడి సిద్ధాంతాలు తమ మీడియాకు ఆదర్శం అని చెప్పుకునే మీడియా సంస్థలు కొంచెం నయం. వాళ్ళు ఏం రాస్తారో, ఏం చూపిస్తారో పాఠకులకు, వీక్షకులకు తెలు సు కాబట్టి ప్రమాదం తక్కువ. కమ్యూనిస్ట్ పార్టీలకు మీడియా సంస్థలు ఉన్నా యి. అవి వాటి రాజకీయ సిద్ధాంతాల ప్రచారానికి, భావవ్యాప్తికి కట్టుబడి ఉం టాయి. వాటివల్ల కూడా ప్రమాదం లేదు. ఈ విషయం ముఖ్యమంత్రి కూడా తన ప్రసంగంలో ప్రస్తావించారు. స్వతంత్రులమని, నిష్పక్షపాతంగా ఉంటామని బయటికి చెప్పుకుని ఒక రాజకీయ పక్షాన్ని అధికారంలోకి తేవడానికో, దించేయడానికో పచ్చి అబద్ధాలు రాసే, చూపే, చెప్పే పత్రికలూ, ఛానళ్ళవల్లనే సమాజానికి ప్రమాదం. వాటితో ప్రజలు, ప్రభుత్వాలు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తావించిన ఇంకో ధోరణి సామాజిక మాధ్యమాల పేరిట చెలరేగిపోతున్న యూట్యూబ్ ఛానళ్ళు. ఎక్కడయినా మినహాయింపులు ఉంటాయి. ఎక్కడో కొన్ని ఇటువంటి ఛానళ్ళు జాతీయస్థాయిలో కానీ, ప్రాంతీ య స్థాయిలోకానీ బాధ్యత గల జర్నలిస్టులు, పౌరులు, మేధావులు నిర్వహించేవి తప్ప మిగతావన్నీ రాజకీయ ప్రేరేపితమయినవి, వ్యక్తుల, సంస్థల ప్రతిష్ఠలను దిగజార్చే విధంగానే వ్యవహరిస్తాయి. వీటికి ఏ బాధ్యతా, జవాబుదారీతనమూ ఉండదు. ఇవి దేశమంతటా వేలు, లక్షల సంఖ్యలో పుట్టుకొచ్చాయి. ఇవన్నీ మీడియా కిందకు వస్తాయా, ప్రభుత్వాలు కల్పించే సౌకర్యాలకు వీరం తా అర్హులు అవుతారా?వర్కింగ్ జర్నలిస్టుల చట్టంలో నిర్దేశించిన విధంగా ఎవరయితే జర్నలిజం ప్ర ధాన కలిగి ఉంటారో అటువంటి వారే ప్రభుత్వం నుండి సంక్రమించే అక్రెడిటేషన్ తదితర సౌకర్యాలకు అర్హులు కావాలి. ఆ అర్హత గలవారు ఎవరో మీరే తేల్చండని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ బాధ్యతను జర్నలిస్టుల మీద, వాటి సంఘ బాధ్యుల మీద, మీడియా అకాడమీ మీద పెట్టారు. తమను సమర్థించే వారి సంఖ్యను పెంచుకోవాలనే ఆలోచనతో కాకుండా వృత్తి గౌరవాన్ని ఇనుమడింప చేసే విధంగా వారంతా వ్యవహరించాలని అన్యాపదేశంగానే అయినా ము ఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇక్కడ కొన్ని సూచనలు చేయాలి. వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వాల నుండి లభించే సౌకర్యాలను అక్రెడిటేషన్‌తో ముడిపెట్టి చూస్తున్న కారణంగానే పరిస్థితి అదుపుతప్పి వేల సంఖ్యలో వాటికోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. అవకతవకలకు, అక్రమాలకు కూడా అవకాశం కలుగుతున్నది. ఉదాహరణకు వయోధిక పాత్రికేయులు ఉన్నారు. వారికి కావలసింది వృద్ధాప్యంలో వైద్య సౌకర్యం, గౌరవప్రదంగా పెన్షన్, గృహవసతి, అరుదుగా చేసే ప్రయాణానికి రాయితీ. అక్రెడిటేషన్‌తో సంబంధం లేకుండా 60 ఏళ్లు దాటి పదవీ విరమణ చేసిన వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం సహాయం చేయవచ్చు. ఇటువంటి కొన్ని పథకాలు ఇతర రాష్ట్రాలలో ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఆ పథకాలను కూడా పరిగణనలోనికి తీసుకుంటే బాగుంటుంది. ఇట్లా వర్కింగ్ జర్నలిస్టులలోని ఇతర వర్గాలకు కూడా ఇదే విధంగా ప్రభుత్వ సహాయం అందించే అవకాశం ఉంది. అక్రెడిటేషన్ అనేది సమాచార సేకరణ నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు, మంత్రులు, ముఖ్యమంత్రులు కొలువు తీరే సెక్రెటేరియట్ వంటి చోట్లకు శాసనసభ సమావేశాలకు అడ్డంకులు లేకుండా విలేఖరులు వెళ్ళడానికి ఉద్దేశించినదన్న విషయం అందరూ మరిచిపోయారు కాబట్టి గుర్తు చేయాల్సి వస్తున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో (ఎందుకంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కానీ ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కానీ వేరే పార్టీలు అధికారంలో ఉండగా జర్నలిస్టులకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదు) ఈ సౌకర్యం కల్పించడానికి అక్రెడిటేషన్‌ను అర్హతగా చూడలేదు ఎప్పుడూ. తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు మళ్ళీ ఒకసారి సీనియర్ సంపాదకులు, జర్నలిస్టులతో ఒక కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా పరిస్థితిని సమీక్షించి నివేదికలు తెప్పించుకుని నిర్ణయాలు తీసుకుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రవీంద్ర భారతి ప్రసంగం ద్వారా ఆశించిన సత్ఫలితాలు సమకూరుతాయి.

# బెయిల్ హక్కు.. జెయిల్ కాదు



దేశంలో ప్రజాస్వామిక చట్టబద్ధమైన న్యాయవ్యవస్థ ఉన్నప్పటికీ ప్రజలకు న్యాయం అందుతున్న తీరు చాలా వివాదాస్పదంగా తయారైందని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. దేశంలో దాదాపు 5 కోట్ల పెండింగ్ కేసులు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పవచ్చు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యుపిఎ) వంటి ప్రత్యేక చట్టాల ప్రకారం జరిగే నేరాలకు కూడా 'బెయిల్ అనేది ఒక రూల్. జైలు ఒక మినహాయింపు' అనే చట్టపరమైన సూత్రం వర్తిస్తుందని సుప్రీం కోర్టు అనేక సందర్భాల్లో పదే పదే గుర్తు చేస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు మద్యం విధానం కుంభకోణానికి సంబంధించిన సిబిఐ కేసులో బెయిల్ మంజూరు చేసేటప్పుడు బెయిల్ అంటే జైలు కాదని మరోసారి ప్రస్తావించింది. 22 నెలలుగా ఊరికే ఉన్న సిబిఐకి, ఇడి కేసులో బెయిల్ వచ్చిన వెంటనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించింది. బెయిల్‌ను అడ్డుకోవడమే దీని ఉద్దేశంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. బిఆర్ఎస్ నేత, ఎంఎల్‌సి అయిన కవితకు బెయిల్ ఇచ్చేటప్పుడు కూడా దర్యాప్తు సంస్థ తీరును సుప్రీంకోర్టు ఆక్షేపించింది. ఇలా ఎన్నో కేసుల్లో దర్యాప్తు సంస్థలు బెయిల్‌ను అడ్డుకోవడం, సుప్రీం కోర్టు మందలించడం జరుగుతోంది. అర్హమైన కేసుల్లో బెయిల్ నిరాకరించడం ప్రారంభిస్తే, చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యుపిఎ)కింద నిందితుడైన జలాలుద్దీన్ ఖాన్ అనే వ్యక్తికి బెయిల్ మంజూరుపై సుప్రీం కోర్టు గత ఆగస్టులో గట్టిగా విచారించింది. బెయిల్ అనేది నియమమని, ప్రత్యేక చట్టాలకు కూడా జైలు మినహాయింపు వర్తిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత ఉన్న కేసుల్లో కోర్టులు బెయిల్ నిరాకరించడం ప్రారంభిస్తే అది ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెయిల్ హక్కును హైకోర్టులే కాలరాస్తున్న చేదు వాస్తవం పట్ల సుప్రీం కోర్టు గతంలో కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. 2022లో ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాది పార్టీ అగ్రనేత అజాంఖాన్ తన బెయిల్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించకుండా తీవ్రజాప్యం చేస్తున్నారన్న ఫిర్యాదుపై సుప్రీం కోర్టు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించింది. ప్రభుత్వాలు రాజకీయ కక్షతో కేసులను ఏ విధంగా పెంచి పోషిస్తున్నాయో అందులో వెల్లడైంది. 'నిందితుడు రెండేళ్లుగా జైల్లో కొనసాగుతున్నాడు. ఒకటి కాదు, రెండు కాదు, 89 కేసులా! ఒక కేసులో బెయిలుపై విడుదల కాగానే, మరో కేసులో లోపలికి పంపిస్తున్నారు' అని సుప్రీం కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. నిందితులను బయటకు రానీయకుండా జైలులోనే నిర్బంధించి ఉంచడానికి ఆయా ప్రభుత్వాలు, వాటి పోలీస్ యంత్రాంగాలు ఎన్ని పన్నాగాలు పన్నినా బెయిలు మంజూరు విషయంలో మాత్రం అనవసర ఆలస్యం చేయడం కానీ, లేనిపోని షరతులు విధించడం కానీ తగదని హైకోర్టులకు సుప్రీం కోర్టు హెచ్చరించింది. బెయిల్‌ను తిరస్కరిస్తూ పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీలు దాఖలు చేసిన జలాలుద్దీన్ ఖాన్‌కు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరుచేసింది. బీహార్‌లో ప్రధాని మోడీ పర్యటనకు అంతరాయం కలిగించే వ్యూహంలో ఖాన్ ప్రమేయం ఉందని వివిధ సెక్షన్ల (యుఎపిఎ, ఐపిసి) కింద అతనిపై కేసు నమోదైంది. 2002లో గుజరాత్ అల్లర్లకు సంబంధించిన కేసుల్లో దొంగపత్రాలు దాఖలు చేసి ఫోర్జరీకి పాల్పడ్డారన్న అభియోగంపై ప్రముఖ హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌కు సుప్రీం కోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయడం ఒక మంచి పరిణామం. పాలకులను ఎదిరించి మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడే వ్యక్తులకు, సంస్థలకు ఈ పరిణామం ప్రోత్సాహకారి అవుతుంది. తగిన కారణాలు లేకుండా బెయిల్ మంజూరును వీలైనంత ఆలస్యం చేయడం ఎప్పటికీ మంచి పనికాదు. ఒక మహిళను ఆమె బెయిల్ అభ్యర్థనపై అనవసర కాలయాపన చేస్తూ జైలులో నిరవధికంగా నిర్బంధించడం తగదని త్రిసభ్య ధర్మాసనం తీస్తా సెతల్వాడ్‌కు బెయిల్ మంజూరు చేసింది. యోగ్యమైన కేసుల్లో కింది కోర్టులు బెయిల్ తిరస్కరిస్తున్నందున ఆ భారం సుప్రీం కోర్టు మీద పడుతోంది. ఆలోగా జైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. వ్యక్తి స్వేచ్ఛ నిరవధిక బందీ అయిపోతోంది. 2012 నాటి ఛీటింగ్ కేసులో అరెస్టయిన ఒక మహిళపై ఆరోపణలను నిర్ధారించక పోవడంతో ఆమె తొమ్మిదేళ్లు జైలులో మగ్గిన ఉదంతం ఢిల్లీలో చోటు చేసుకుంది. బెయిల్ కోరడమనేది వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమని, అది రాజ్యాంగం 21వ అధికరణ హామీ ఇస్తున్న జీవనస్వేచ్ఛలో అంతర్భాగమని ఢిల్లీ హైకోర్టు కూడా ఒక కేసులో ప్రస్తావించింది. ఉరివంటి తీవ్ర శిక్షల కేసుల్లో తప్ప సాధారణ కేసుల్లో బెయిల్ దరఖాస్తులపై సానుకూల నిర్ణయం తీసుకోడానికే ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. నాన్‌బెయిల్‌బుల్ కేసుల్లో కూడా ఉచితానుచితాలను లోతుగా పరిశీలించి బెయిల్ మంజూరు చేసే అధికారం ఉన్నత న్యాయస్థానాలకు ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వకుండా పోరాటాలు చేస్తాం..



**అమరావతి,:** ప్రస్తుతం రాష్ట్రమంతా ఒక సమస్యపై దృష్టి పెట్టిందని.. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వం విధానానని స్పష్టం చేయాలని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. జాతీయంగా ఉంచుతారా, ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపుతారో చెప్పాలన్నారు. ఉక్కు మంత్రి వచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ చూశారు.. ఏం చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ తెలుగు వారి ఆత్మ గౌరవం, తెలుగు ప్రజలకు సంబంధించిందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మీద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడుకోవడానికి మేము సిద్ధమని ఆయన చెప్పారు. ప్రజా ప్రతినిధుల రాజీనామాల వల్ల ఉపయోగం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మేం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకం అని కేంద్రానికి చెప్పడం వల్ల స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగలేదన్నారు. ఇప్పటి వరకు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ మా వల్ల ఆగిందని బొత్స పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో కేంద్రంలోని ఎన్డీఏకు బలం ఎక్కువ ఉందని.. ఎన్డీఏలో భాగస్వామిగా వున్న చంద్రబాబు ఈ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా ప్రైవేటీకరణకు ఎందుకు అడుగులు పడుతున్నాయని ఆయన ప్రశ్నించారు. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కాదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వకుండా మేము పోరాటాలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## షేక్ హసీనాపై కేసుల వరద.. 155కి చేరిన కేసులు



ఢాకా: భారత్‌లో తలదాచుకుంటున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను తమ దేశం రప్పించేందుకు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇదే సమయంలో ఆమెపై అనేక కేసులు కూడా నమోదవుతూనే ఉన్నాయి. తాజాగా ఓ హత్య అభియోగాలపై మరో కేసు నమోదయ్యింది. దీంతో షేక్ హసీనాపై నమోదైన కేసుల సంఖ్య 155కి చేరింది. ఇటీవల బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో 22 ఏళ్ల విద్యార్థి హత్యకు సంబంధించి హసీనాతోపాటు మరో 58 మందిపై హత్య కేసు నమోదైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇలా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నప్పటి నుంచి హసీనాపై ఇప్పటివరకు 155 కేసులు నమోదయ్యాయి. ఇందులో హత్య కేసులే 136 ఉన్నాయి. మారణహోమం, ఇతర నేరాలకు సంబంధించి ఏడు, మూడు అపహరణ, ఎనిమిది హత్యాయత్నంతోపాటు బీఎన్‌పీ పార్టీ ఊరేగింపుపై దాడికి సంబంధించిన కేసులున్నాయి. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల క్రమంలో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో వెయ్యి మందికి పైగా మరణించినట్లు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం వెల్లడించింది. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనా, మరో తొమ్మిది మందిపై ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలో భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

## ప్రతికూల వాతావరణం.. 126 కి.మీ ప్రధాని మోదీ రోడ్డు ప్రయాణం



ఢిల్లీ : ఢిల్లీ నుంచి రాంచీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు ప్రధాని నరేంద్ర మోదీ. అయితే.. భారీ వర్షాల నేపథ్యంలో ప్రతికూల వాతావరణం ఏర్పడింది. దాంతో.. విమాన ప్రయాణం సరికాదని అధికారులు చెప్పారు. దాంతో.. ప్రధాని నరేంద్ర మోదీ తన టూర్‌ను వాయిదా వేసుకోలేదు. దాదాపు 126 కిలోమీటర్ల దూరం రోడ్డు మార్గంలో ప్రయాణించారు. జెంషెడ్‌పూర్ చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని.. కీలక ప్రసంగం చేశారు. తాను ప్రజల వద్దకు చేరుకోవడాన్ని భారీ వర్షమే కాదు.. ఏదీ ఆపలేదని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చివరిలో ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో..అక్కడి గోపాల్ మైదాన్‌లో బీజేపీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. భారీ వర్షంతో పాటు ఏ అవరోధాలు మీ వద్దకు రాకుండా అడ్డుకోలేవు అని అన్నారు. మీ ఆప్యాయత నా హృదయాన్ని తాకిందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విపక్షాలు కుట్రలు చేసినా.. ప్రజలు మాత్రం కూటమి ప్రభుత్వానికే పట్టం కట్టారని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఝార్ఖండ్ ప్రభుత్వంపైనా ప్రధాని విమర్శలు చేశారు. ఝార్ఖండ్‌లో జేఎంఎం ప్రభుత్వం వనరులను దోచుకుంటోందని అన్నారు. గతంలో తాము అధికారంలో ఉండగా.. జిల్లా ఖనిజ నిధి ద్వారా హక్కులకు భరోసా ఇచ్చామన్నారు. అధికారం దాహంతో ఉన్న జేఎంఎం, ఆర్జేడీ, కాంగ్రెస్ ఝార్ఖండ్ రాష్ట్రానికి శత్రువుల్లా మారాయంటూ మండిపడ్డారు. ఝార్ఖండ్‌లో ప్రస్తుతం చొరబాట్లు ఎక్కువగా ఉన్ఆనయన్నారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను రాష్ట్ర జనాభాలోకి మారుస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. జార?ండ్‌లో కాంగ్రెస్-జేఎంఎం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని మోదీ ఆరోపించారు. గనులు, ఖనిజాలు, సైనిక భూములను దోపిడీ చేసిన జేఎంఎం పాలనకు చరమగీతం పాడాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. జేఎంఎం ప్రభుత్వం రాష్ట్రంలో బీజేపీ నేతలను టార్గెట్‌గా చేసుకుని.. తప్పుడు కేసుల్లో ఇరికిస్తోందని అన్నారు. జేఎంఎంకు ప్రజలు ఈసారి బుద్ధి చెప్పాలని.. బీజేపీని ఆదరించాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారు.

# ఇంజనీర్ల జోక్యం తగ్గింది..నేతల జోక్యం పెరిగింది!




మనిషి నాగరికత సివిల్ ఇంజనీరింగ్‌తో మొదలైంది. ఆ రోజుల్లో ఇంజనీరు అంటే సివిల్ ఇంజనీరు అనే భావించేవారు. ఒక ఇల్లు నిర్మించాలన్నా ఒక రోడ్డు వేయాలన్నా, కాలువ తవ్వాలన్నా సివిల్ ఇంజనీరును సంప్రదించేవారు. ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడంతో ఒక ప్రణాళిక వేసి డిజైన్ చేసి అంచనాలు వేయడంలో సిద్ధహస్తుడు సివిల్ ఇంజనీరు. తర్వాత్తర్వాత పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టడానికి మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కూడా భాగస్వాములయ్యారు. ప్రభుత్వ పనులలో రాజకీయ నాయకులు, పాలనాదికారులు మితిమీరిన జోక్యంతో పనులు తొందరగా చెయ్యాలని ఆదేశాలిచ్చి, ప్రతి పని విభాగానికి మధ్యలో కనీస సమయం ఇవ్వకుండా ఒత్తిడి చేస్తూ పనుల నాణ్యతను చెడగొడుతున్నారు. పనుల్లో ఇంజనీర్ల జోక్యంలో తగ్గి పనుల నిర్మాణంలో నాణ్యత తగ్గిపోతోంది. ఒకనాటి నిర్మాణాలు, 1923లో నిర్మించిన నిజామ్ సాగర్ ప్రాజెక్ట్ ఇప్పటికీ చెక్కు చెదరకుండా పటిష్టంగా ఉన్నాయి. ఆ రోజుల్లో నాణ్యతకు పెద్ద పీట వేసేవారు. అదే విధంగా విజయవాడ వద్ద కృష్ణానదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజ్ బ్రిటిష్ వారి హయాంలో 1855లో పూర్తయింది. 1952లో వచ్చిన వరదలకు ఈ పాత బ్యారేజీ కొట్టుకొని పోవడంతో మరో ఆనకట్టను నాలుగేళ్లలో నిర్మించారు. ఈనాటికీ ఇది ఎన్నో వరద తాకిళ్లకి నిలబడి వుంది. ఒక కాంక్రీటు స్లాబ్ వేస్తే , పునాది దగ్గర నుండి పనుల్లో నిమగ్నమై, పర్యవేక్షణ చేస్తూ స్టీల్, కాంక్రీట్ డిజైన్ ప్రకారం ఉన్నాయా లేదా అని ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు భయంతో వ్యవహరించేవారు. ఖచ్చితంగా 21 రోజులు కాంక్రీటుకు క్యూరింగ్ చేసేవారు. ఆ కట్టడాలు అప్పటి పరిజ్ఞానంతో నిర్మించినా ఎటువంటి లోపాలు లేకుండా ఇప్పటికీ నిలబడి ఉండి ప్రజాప్రయోజనాలు నెరవేరుతున్నాయి.

### ఒత్తిడి వల్లే నాణ్యత ఔట్

ప్రస్తుతం ప్రభుత్వ, ప్రభుత్వేతర నిర్మాణాల్లో చాలా మార్పు వచ్చింది. పాలకులు తమ పదవీ కాలంలోనే భారీస్థాయి ప్రజాపనులు పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు. కానీ వాటి నిర్మాణానికి తగిన సమయం ఇవ్వకుండా త్వరగా పనులు కావాలని గుత్తేదార్లపై ఒత్తిడి పెంచడం తో నాణ్యత తగ్గుతోందని మొన్నటి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాల్లో మనం గమనించవచ్చును. నిర్మాణాల్లో నైపుణ్యత లోపించి గ్రామాల్లో అక్కడక్కడ ప్రభుత్వ బిల్డింగ్ స్లాబ్ క్రింది భాగంలో స్టీల్ కనిపిస్తుంది. చత్తు వేసేటప్పుడు స్టీల్ షటర్ మద్యభాగంలో కొంత గ్యాప్ ఉండేటట్లు ఏదైనా ఒక చిన్న ఎత్తు పెట్టినా అక్కడ మనకు షటర్ విప్పిన తరువాత స్టీల్ కనపడదు. ఈ మాత్రం జాగ్రత్తలు తీసుకుంటే ప్రభుత్వ నిర్మాణాలు చాలా కాలం ఉంటాయి. అదేవిధంగా రోడ్డు నిర్మాణాలలో కూడా వర్షం నీరు పడితే నీరు రెండు వైపులా వెళ్లి, నీరు రోడ్డు మీద నిల్వ ఉండకపోతే చాలాకాలం పాటు రోడ్లు కూడా మన్నికతో ఉంటాయి.

### నేరుగా ఇంజనీర్లయి, పని అర్థం కాక..

మన దేశంలో వృత్తి విద్యా కోర్సులలో ముఖ్యం గా మెడిసిన్ కోర్సు పూర్తి అయిన తరువాత కంపల్సరీగా హౌస్ సర్జన్ చేసినట్లుగా ఇంజనీరింగ్ కోర్సులలో నేరుగా పనులలో పాల్గొనే పద్ధతి లేదు. దాంతో ఇంజనీర్లకు ఎటువంటి ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకుండా పోయింది. వీరు నేరుగా ప్రైవేట్ లేదా ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రవేశించి, అక్కడ జరిగే నిర్మాణాలు అర్థం కాక సతమతమవుతున్న విషయం వాస్తవం. ఒకసారి ప్రభుత్వ ఇంజనీరుగా ప్రవేశిస్తే అనుభవం లేకున్నా అధికారం చలాయించడం ద్వారా మంచికంటే చెడు చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సందర్భంగా, మన యువ ఇంజనీర్లు ఖచ్చితంగా ప్రపంచ ప్రసిద్ధ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఒక పాఠంగా చదవాలి.

### నిజాయితీ అసమర్థతగా మారి...

మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన విధి నిర్వహ ణలో భాగంగా, ఒక గ్రామానికి వెళ్లినప్పుడు పని పూర్తి అయిన తరువాత అక్కడే ఉండాల్సి వచ్చింది. ఆ రాత్రి తాను పని చేసుకోవడానికి తన వెంట తెచ్చుకున్న కొవ్వొత్తిని వెలిగించి పనిని పూర్తి చేసుకున్నాడు. ఆ తరువాత కొవ్వొత్తిని ఆర్పి వేసి మరొక కొవ్వొత్తిని వెలిగించి తన పనిని మళ్లీ మొదలుపెట్టుకున్నాడు. అది గమనించిన గ్రామ పెద్ద ఆ కొవ్వొత్తిని ఎందుకు ఆర్పివేసి మరొక కొవ్వొత్తిని వెలిగించారు అని అడుగగా దానికి ఆయన ఇలా చెప్పారు. మొదట నేను ప్రభుత్వ పనిని చేశాను, ఆ తరువాత నా వ్యక్తిగతమైన పని చేసుకున్నాను అని జవాబు ఇచ్చారు. మనం చేస్తున్న పనిలో ఎంత నిజాయితీ తోడైతే ఆ పని అంత బాగుంటుందని మోక్షగుండం తెలియచెప్పారు. ప్రస్తుతం నిజాయితీగా పనిచేసేవారిని ఈ లోకం అసమర్థుడుగా చిత్రీకరిస్తోంది.

### ఆయన జీవితం ఓ ఆదర్శ పాఠం

ఆ రోజుల్లో మోక్షగుండం విశ్వేశ్వ రయ్య జాతి మెచ్చే కట్టడాలను కట్టి అందరి మెప్పు పొందారు. 12-04-1962న వారు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. మర ణించి 62 ఏళ్లయినా మనం ఆయనను స్మరించుకుంటున్నాం. ఆయనతో ఎందరో ఇంజనీర్లు పనిచేసి ఉండవచ్చును కానీ కేవలం మోక్షగుండం విశ్వేశ్వరయ్యనే గుర్తు పెట్టుకుంటున్నాం. మనందరం మంచినే ప్రోత్సహి స్తున్నాం కానీ ఆచరణే కష్టమవుతుంది. కాబట్టి అందరు రాణించలేకపోతున్నారు. స్వీయ నియంత్రణతో సాధారణ జీవనాన్ని గడుపుతూ విశ్రాంత జీవితాన్ని కూడా ప్రజాపనులకు కోసం ఉపయోగించిన కర్మజీవి ఆయన. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజును ప్రతియేట 'ఇంజనీర్స్ డే'గా జరుపుకుంటున్నాము. గొప్ప వ్యక్తిత్వం గల సివిల్ ఇంజనీర్, సహనశీలి, క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన ఆయన జాతికి ఉపయోగపడే ఎన్నో ప్రజా పనుల నిర్మాణాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం నుండి భారతరత్న బిరుదును 1955లోనే పొందిన మొదటి సివిల్ ఇంజనీరు. ఆయన జీవిత విశేషాలను, విజయాలను నెమరువేసుకుంటూ ఆయనను స్ఫూర్తిగా తీసు కొని ఆయన అడుగుజాడలలో నడవడానికి మన ఇంజనీర్లు ప్రయత్నాలు చేస్తారని ఆశిద్దాం.

# బహుజన బాంధవుడు ఏచూరి!




జనవరి 17 2016 న.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి వేముల రోహిత్ యూనివర్సిటీ క్యాంపస్‌లోనే ఆత్మహత్యకు ఒడిగట్టాడు. ఉన్నత విద్యాలయాల్లో తిష్టవేసిన అమానుష కులవివక్ష కారణంగా రోహిత్ ప్రాణాలొదిలాడని, ఆ దళితబిడ్డ చావుకు కారకులయిన మనువాదులను శిక్షించాలంటూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చెలరేగాయి. చెట్టంత కొడుకుని కోల్పోయి, పుట్టెడు దుఃఖంతో.. రోహిత్ తల్లి వేముల రాధిక గుంటూరు నుంది హుటాహుటిన హైదరాబాద్‌కు చేరుకున్నది "నా బిడ్డ చావుకి కారకులైన వారెవరో తేల్చండి..! నాలాగా మరోతల్లికి గర్భశోకం రాకుండా చూడండి...!" అంటూ ప్రభుత్వ పెద్దలను ఆమె వేడుకున్నది. బిడ్డను కోల్పోయిన ఆ తల్లి గోడును నాడు వినేవారే కరువయ్యారు. లోపలికొచ్చి ఏడవడానికి వీల్లేదంటూ.. నిర్దాక్షిణ్యంగా క్యాంపస్ గేట్లను మూసివేశారు. ఆ పరిస్థితుల్లో ఢిల్లీ నుంచి వచ్చిన ఒక జాతీయ స్థాయి నాయకుడు.. వేముల రాధికను ఓదార్చి, దగాపడిన దళిత బిడ్డకు న్యాయం చేయాలంటూ ఉద్యమకారులతో కలిసి నినదిస్తూ.. ధర్నా శిబిరంలో బైఠాయించారు. శూద్రవర్ణంలో పుట్టిన నాయకులు సైతం పదవుల ఆశలో.. మనువాదుల తొత్తులుగా మారి, దళితుల పక్షాన గొంతు విప్పడానికి జంకుతున్న వేళ.. ఒక అగ్రవర్ణ కుటుంబ నేపథ్యం గల నాయకుడు.. దళిత శిబిరంలో కనబడడం నాడు సంచలనాలకు నెలవయింది. ఆ బహుజన బాంధవుడే.. మొన్న ఢిల్లీలో కన్నుమూసిన కామ్రేడ్ సీతారాం ఏచూరి! కమ్యూనిస్టులు నెరిపే కార్మిక వర్గ పోరాటాలతో పాటు.. ఈ దేశ బడుగుల సామాజిక న్యాయ పోరాటాలకు సైతం అడుగడుగునా అండగా నిలిచి.. లాల్ నీల్ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన విశిష్ట నేత సీతారాం ఏచూరి!

### కుల వ్యవస్థ పీడితులకు అండగా..

భారతదేశ సామాజిక వాస్తవాలను ఆకళింపు చేసుకున్న ఏచూరి.. వర్గ దోపిడి పీడితులతోపాటు, కుల వ్యవస్థ పీడితులకు సైతం కమ్యూనిస్టులు అండగా నిలవాలన్న సత్యాన్ని గుర్తిం చారు. బడుగుల హక్కుల కోసం జరిగిన ప్రతి పోరాటంలోనూ ఆయన భాగస్వామిగా నిలిచారు. 2003లో.. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో.. ఎస్సీ ఎస్టీ కమిషన్ ఏర్పాటు కోసం జరుగుతున్న పోరాటంలో స్వయంగా పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పలు ధర్నాలలో సైతం పాలుపంచుకున్నారు. 2013లో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ సాధన కోసం జరిగిన పోరాటానికి మార్గ నిర్దేశనం చేసిందీ కూడా ఆయనే. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్వ ర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ ముందు జరిగిన ధర్నాలను ఆయనే స్వయంగా ప్రారంభించారు. వ్యవసాయ కూలీల ఉపాధి రక్షణ కోసం నేడు అండగా నిలుస్తున్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని.. నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వ పెద్దల మెడలు వంచి సాధించిన ఘనతలో ఆయనకు సైతం వాటా ఉన్నది. బీసీవర్గాల కులగణన డిమాండుకు సైతం తమ పార్టీ తరపున మద్దతు ప్రకటించాడు.

### స్వయంగా వెళ్లి పరామర్శించి..

దేశంలో ఏ మూలన బడుగు వర్గాలపై దౌర్జ న్యాలు జరిగినా.. స్వయంగా వెళ్లి, బాధితులను పరామర్శించి, పీడితులకు న్యాయం దక్కాలని జరిగిన పోరాటాలన్నింటిలో స్వయంగా పాల్గొన్న ప్రజా ఉద్యమకారుడు ఏచూరి. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని హత్రాస్‌లో.. 2020 సెప్టెంబర్ 14న దళిత బిడ్డ మనీషా వాల్మీకి సామూహిక లైంగికదోపిడీకి గురైన వార్త దేశాన్ని అట్టుడికించింది. దుండగులు తన ఠాకూర్ కులానికి చెందిన వారు కాబట్టి.. రేప్ జరగనేలేదంటూ బుకాయించిండు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి. ఆ దళిత బిడ్డ శవాన్ని సైతం బంధువులకు అప్పగించకుండా పోలీసుల చేత అడవుల్లో దహనం చేయించిండు. భయవిహ్వలురై, గుడిసె నుండి కాలు బయట పెట్టడానికి సైతం వణుకుతున్న ఆ నిరుపేద దళిత కుటుంబాన్ని పరామర్శించడానికి ఎవరూ రాకుండా పోలీసు బలాన్ని ఉపయోగించి కట్టడి చేశాడు. ఆ పరిస్థితులలో.. ఆ మారుమూల ఊరికి చేరుకుని, ఆ పూరి గుడిసె తలుపుతట్టి, బాధితులకు ధైర్యం చెప్పి.. ప్రభుత్వ పెద్దల దమన నీతిని ప్రపంచానికి చాటి చెప్పిండు ఏచూరి. ఎమర్జెన్సీ కాలంలో.. విద్యార్థి సంఘ నాయకుడిగా.. నాటి ప్రధాని ఇందిరను జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ క్యాంపస్‌కి పిలిపించి, అసమ్మతి పత్రాన్ని చదివి వినిపించి, ఆమె చేత చాన్సలర్ పదవికి రాజీనామా చేయించిన.. ఆ రాజీలేని పోరాట తత్వమే చివరి వరకూ ఆయన వెన్నంటి ఉన్నది.

### ఇండియా కూటమి భావనకు రూపశిల్పి

దళిత సంక్షేమానికి అంకితమైన ఐఏఎస్ ఆఫీసర్ ఎస్.ఆర్ శంకరన్ సార్‌ని ఒకసారి పాత్రికేయు లు ఓ ప్రశ్న అడిగారు.. "బ్రాహ్మణ కుటుంబం నుండి వచ్చిన మీరు దళితుల ఆప్తుడిగా ఎలా మారారు?" అని. "నేను చదివిన మార్క్సిజమే నాకు ఆ మానవీయ దృక్పథాన్ని అందించింది" అంటూ సమాధానం ఇచ్చాడాయన. ఆ ముచ్చట సీతారాం ఏచూరికి సైతం బిల్కుల్ సరిపోతుంది. ఆయన కాంక్షించిన సామ్యవాద స్వప్నంలో సామాజిక న్యాయం సైతం ఒక భాగమని గుర్తించి, ఆచరణలో చూపించాడు. "మేమందరం కట్టుబడిన 'ఐడియా ఆఫ్ ఇండియా' భావనకి రూపశిల్పి ఏచూరినే" అని మొన్న రాహుల్ గాంధీ నివాళి అర్పించాడు. వీర తెలంగాణా గడ్డపై సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో బడుగుజనమే ముందుపీఠిన నిలిచారు. స్వతంత్ర్య భారత తొలి దళిత ప్రతిఘటనగా నిలిచిన "కీలవేణ్మని పోరాటం".. ఎర్రజెండా నీడలోనే సాగింది. తమిళనాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో 1960 దశకంలో సాగిన ఆ చారిత్రక పోరాటంలో.. తమ న్యాయమైన హక్కుల కోసం భూస్వాములతో పోరాడిన 44 మంది దళిత బిడ్డలు ప్రాణార్పణ కావించారు. ఎర్ర జెండాకు, బహుజన బిడ్డలకూ అవినాభావ సంబంధమే నాడూ నేడూ కొనసాగుతున్నది. అ మహోన్నత సాంప్రదాయానికి వారసుడిగా నిలిచిన కామ్రేడ్ సీతారాం ఏచూరిని బహుజన బిడ్డలు ఎల్లప్పుడూ యాదికుంచుకుంటారు.

# సంపన్న భారత్‌లో.. పెరుగుతున్న పేదరికం



దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలంటే, అన్ని వర్గాల ప్రజల ఆదాయాలను, జీవన ప్రమాణాలను పెంచాలి. ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు తగ్గే విధానాలను అవలంబించాలి. అవినీతి నిర్మూలన నిజాయితీగా జరగాలి. దృఢ సంకల్పంతో సమ్మిళిత అభివృద్ధికి పాటుపడితేనే.. దేశ ఆర్థిక వ్యవస్థ పరిణామానికి అర్థం, పరమార్థం ఉంటుంది. రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా ఉన్న 1985-89 మధ్యకాలంలో దేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపిస్తున్నట్లు తరచుగా చెప్పేవారు. దీనిపై అప్పట్లో ఓ ప్రముఖ దినపత్రిక ఓ వ్యంగ్య కార్టూన్ ప్రచురించింది. ప్రధాని రాజీవ్‌గాంధీ కొంతమందిని వెంటబెట్టుకొని ఓ ప్రదేశానికి వెళతారు. అక్కడో వృద్ధుడు మినహా అంతా ఖాళీగా, నిర్మానుష్యంగా ఉంటుంది. రాజీవ్‌గాంధీ ఆశ్చర్యంగా 'ఇక్కడెవరూ లేరేమిటి? ఎక్కడికి వెళ్లారు?' అని అడుగుతారు. అప్పుడావృద్ధుడు.. 'మీరు చాలా ఆలస్యం చేశారు.. అందరూ 22వ శతాబ్దంలోకి వెళ్లిపోయారు' అని సమాధానం ఇస్తాడు. అభివృద్ధిపథంలో భారత్ వేగంగా అడుగులు వేస్తూ ఉండొచ్చు.. కానీ, ప్రపంచంలోని చాలా దేశాలు మనకంటే వడివడిగా దూసుకుపోవడం అన్నది ఓ వాస్తవం. అప్పుడు రాజీవ్‌గాంధీ విషయంలోనైనా, ఇపుడు ప్రధాని నరేంద్రమోదీ కాలంలోనైనా జరుగుతున్నది ఇదే. రాజకీయ నాయకులు సహజంగానే ఆకర్షణీయమైన నినాదాలు ఇస్తుంటారు. ప్రజలలో స్ఫూర్తి రగిలించడానికి అవి అవసరం. కానీ, వాస్తవాలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నప్పుడు ప్రజలను ఏమార్చడం సాధ్యం కాదు. భారత్ త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధాని పదేపదే నమ్మకంగా చెబుతున్నారు. నరేంద్రమోదీ ప్రధాని అయిన 2014 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ 10వ స్థానంలో ఉంది. దశాబ్దకాలంలో 3.7 ట్రిలియన్ల డాలర్లతో 5వ స్థానానికి చేరుకొన్నమాట నిజమే. అయితే, ఆర్థిక గణాంకాలు దేశ వాస్తవ ముఖచిత్రాన్ని ప్రతిబింబిస్తాయా అన్నదే ప్రశ్న. ఇటీవల 'హురున్ ఇండియా రిచ్ లిస్ట్-2024' ప్రకటించిన తాజా నివేదిక ప్రకారం ప్రస్తుతం దేశంలో 534 మంది బిలియనీర్లు ఉన్నారు. ఒక్క ఏడాది వ్యవధిలోనే భారతదేశంలో 75 మంది బిలియనీర్లు పెరిగారు. దేశంలో రూ.1000 కోట్లు పైబడి సంపద ఉన్న వారి సంఖ్య 1,539. ఇందులో 5,000 కోట్ల సంపద గలిగినవారు 534. కాగా, నల్లధనాన్ని పరిగణనలోకి తీసుకొంటే, అనధికార లెక్కల ప్రకారం దేశంలో రూ.1000 కోట్లు సంపద గలిగినవారి సంఖ్య 5,000 దాటుతుంది. ఇందులో రియల్టర్లు, పారిశ్రామికవేత్తలు, సినీనటులు, స్టార్టప్ ప్రమోటర్లు.. ఇలా 20 రంగాలకు చెందిన వారున్నట్లు 'హురున్ ఇండియా' నివేదిక తెలిపింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొన్నప్పుడు దేశం ఆర్థికంగా బలోపేతం అయినట్లు కనబడుతుంది. దేశంలో బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నకొద్దీ.. దేశ ప్రజల తలసరి ఆదాయం అదే దామాషాలో పెరుగుతుంది. గత దశాబ్దకాలంలో భారత్ తలసరి ఆదాయం 95శాతం పెరిగినట్లు ఐఎంఎఫ్ నివేదిక తెలిపింది. 2014లో 5,187 డాలర్లుగా ఉన్న భారత్ తలసరి ఆదాయం 2024 మార్చి చివరి నాటికి 10,123 డాలర్లకు పెరిగింది. ఈ గణాంకాల ప్రకారం అదానీ, అంబానీ తదితర దేశ బిలియనీర్ల సగటు తలసరి ఆదాయం 10,123 డాలర్లుగా లెక్కిస్తే ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో, దేశంలో 143 కోట్ల మందిలో 30శాతంగా ఉన్న పేదల సగటు ఆదాయం అంతే ఉందని చెప్పినపుడు కూడా నవ్వు కాదు, బాధ కలుగుతుంది.

2030 నాటికి 7 ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తే మంచిదే. కానీ, ఒకవైపు సంపద పెరుగుతున్నా దేశంలో పేదరికం పెరగడం చూసినపుడు మనం అనుసరిస్తున్న విధానాలలో ఎంత లోపం ఉన్నదో అర్థమవుతున్నది. 2022 గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 191 దేశాల జాబితాలో భారత్ స్థానం 127. దేశంలో ప్రజల మధ్య పెరిగిపోతున్న ఆర్థిక అంతరాలను, పేదరికాన్ని తగ్గించనంతవరకు.. దేశం ఆర్థిక ప్రబలశక్తిగా ఎదిగినా ప్రయోజనమేమీ ఉండదు. దీనిని దృష్టిలో పెట్టుకొనే రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు.. భారతదేశం మూడవ ఆర్థికశక్తిగా రూపాంతరం చెందినా పేద దేశంగానే ఉంటుందని తేటతెల్లం చేశారు. అలాగే బ్రిక్స్, జీ-20 దేశాలన్నింటిలోను భారత్ పేద దేశంగా ఉందని ఆర్థికరంగ నిపుణులు పేర్కొంటున్నారు. 143 కోట్ల జనాభా గల భారత్‌లో వస్తు, ఆహార వినిమయం అధికం కనుక సహజంగానే ఆర్థిక వ్యవస్థ పెద్దదిగా ఉంటుంది. ఇక, దేశంలో ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు తగ్గాలంటే.. పేద, మధ్య తరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడిన వ్యవసాయం, ఉత్పత్తిరంగాలు, అసంఘటిత రంగాలలో ఆదాయాలు పెరగాలి. ఆదాయాలు పెరిగితేనే పేదరికం తగ్గుతుంది. మరి ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయా? ప్రస్తుతం దేశంలో ఏటా సగటున 330 మిలియన్ల టన్నుల ఆహారధాన్యాలు పండుతున్నాయి. ఇందులో వరి, గోధుమ 80శాతం ఆక్రమిస్తున్నాయి. ఈ రెండు పంటలు పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదు. అంటే, 80శాతం రైతాంగం ఆదాయం పెరగకపోగా.. నష్టాలతోనే సాగు చేస్తున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. అభివృద్ధి చెందిన అమెరికా, చైనాలతోపాటు ఫ్రాన్స్, బ్రెజిల్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలలో సేవల రంగంతో పాటు ఉత్పత్తి రంగం సమాంతరంగా అభివృద్ధి చెందుతుండగా, భారత్‌లో ఉత్పత్తి రంగం వాటా 2023 నాటికి జీడీపీలో 17శాతంకు పడిపోయింది. కానీ, సేవల రంగం మాత్రం 55శాతంకు విస్తరించింది. అయితే, కోవిడ్ కాలంలో మూడేళ్లపాటు సేవల రంగం కుదేలయింది. ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేసి సేవలరంగాన్ని నమ్ముకొంటే.. జరిగే అనర్థాలేమిటో తెలిసొచ్చినా.. ఉత్పత్తి రంగాన్ని పునరుజ్జీవింపజేసే చర్యలు చెప్పుకోదగ్గవిగా లేవు. ముఖ్యంగా దేశంలో దాదాపు 20 కోట్ల మంది ఆధారపడిన సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల్ని బతికించుకొంటే తప్ప.. దానిపై ఆధారపడిన ప్రజల ఆదాయాలు మెరుగుపడవు. ఇక, దేశంలో 40శాతంగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగకల్పన ద్వారానే వారి ఆదాయాల్ని మెరుగుపర్చడం సాధ్యపడుతుంది. నూతనంగా ఉద్యోగాలను సృష్టించే రంగాలకు ఊతం ఇవ్వడంతోపాటు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. ఉద్యోగులకు ఇచ్చే జీతభత్యాలు భారం అవుతుందనే ఉద్దేశంతో ఖాళీలు భర్తీ చేయకపోతే, ప్రజలకు అందే సేవలు నాసిరకంగా ఉంటాయి. ఇప్పటికే విద్య, వైద్యం వంటి కీలకరంగాలలో తగినంత మంది సిబ్బందిలేక ప్రజలు ఖరీదైన ప్రైవేటు రంగ సేవలు వినియోగించుకోవాల్సి వస్తోంది. అదేవిధంగా, ఉపాధిరంగంలో అవకాశాలు పొందడానికి యువతకు అవసరమైన నైపుణ్యాలు కల్పించడం ఎంతో ముఖ్యం. తగిన నైపుణ్యాలు లేనందువల్ల తక్కువ వేతనంతో పనిచేయించుకొంటున్న పరిస్థితి దేశంలోని అన్ని రంగాలలో కనబడుతుంది. నైపుణ్యలేమి వల్ల యువత తీవ్రంగా నష్టపోతున్నారు. అరకొర ఆదాయం అందే ఉద్యోగాలతో సరిపెట్టుకొంటున్నారు. నైపుణ్యాలను అందించే శిక్షణ కార్యక్రమాలు దేశమంతటా అందుబాటులోకి వస్తే.. యువతకు మేలు జరిగి, వారి ఆదాయాలు మెరుగవుతాయి. 2030 నాటికి భారత్ 7 ట్రిలియన్ల వ్యవస్థగా మారుతున్నదని ఘనమైన అంచనా వేస్తున్నారుగానీ, ఈ ఆరేళ్లలో జనాభా పెరుగుదల ఎంత ఉంటుంది? పెరుగుతున్న జనాభాకు ఉపాధి రంగాలలో ఎన్ని ఉద్యోగాలు అవసరం అవుతాయి? అందుకు అనుగుణంగా ఎటువంటి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి? అనే అంశాలపై దృష్టి పెట్టాలి. ఇటీవల భారత్‌లో పర్యటించిన ఐఎంఎఫ్ డిప్యూటీ డైరక్టర్ గీతా గోపినాథ్ తెలిపిన అంచనా ప్రకారం 2030 నాటికి భారత్‌లో కొత్తగా 14.8 కోట్ల ఉద్యోగాలను కల్పించాలి. ప్రజల ఆదాయాలు మెరుగుపడితేనే ఆర్థిక అంతరాలు తగ్గుతాయి. అభివృద్ధి చెందిన దేశాలు అనుసరించే నమూనా అదే. అభివృద్ధి చెందిన దేశాలలో అసంఘటిత రంగంలో కూడా ఉద్యోగులకు మెరుగైన జీతభత్యాలను పటిష్టవంతమైన కార్మికచట్టాల ద్వారా అమలు చేస్తున్నారు. ఇక, దేశంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతి.. అభివృద్ధి ఫలాలను ప్రజలకు దూరం చేస్తోంది. గత ఐదేళ్లలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు లక్షన్నర కోట్ల ప్రజా సంపదను నాటి పాలకులు కొల్లగొట్టారన్న వాస్తవాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. సహజ వనరులు దుర్వినియోగం అయితే దేశ సంపద పెరగదు. ప్రధాని నరేంద్రమోదీ గత పదేళ్లలో చాలావరకు అవినీతిని అరికట్టగలిగారు. అయితే దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలంటే, అన్ని వర్గాల ప్రజల ఆదాయాలను, జీవన ప్రమాణాలను పెంచాలి. ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు తగ్గే విధానాలను అవలంబించాలి. అవినీతి నిర్మూలన నిజాయితీగా జరగాలి. దృఢ సంకల్పంతో సమ్మిళిత అభివృద్ధికి పాటుపడితేనే.. పెరిగే దేశ ఆర్థిక వ్యవస్థ పరిణామానికి అర్థం, పరమార్థం ఉంటుంది. లేకుంటే దేశంలో సంపదా పెరుగుతుందీ, పేదరికమూ పెరుగుతుంది.

# ఓజోన్ ఆకాశ రక్ష




ఈ విశ్వం అనంతమైనదని మనకు తెలుసు. కోటానుకోట్ల గ్రహాలు అందులో తేలుతూ ఉంటాయనీ తెలుసు. కానీ ఇప్పటివరకూ వాటిలో ఎక్కడా బుద్ధిజీవులు ఉన్నట్టు శాస్త్రవేత్తలు నిరూపించలేకపోయారు. ఇంత ప్రత్యేకత పుడమికే ఎందుకు ఉంది? అన్న ప్రశ్నకు 'రేర్ ఎర్త్ హైపోథిసిస్' అనే సిద్ధాంతం జవాబు చెబుతుంది. జీవం ఏర్పడటానికీ, తెలివితేటలు సంతరించుకోవడానికీ, మనుగడ కొనసాగించడానికీ చాలా సంక్లిష్టమైన వాతావరణం కావాలి. ఏదో ఒక్క పరిస్థితి అనుకూలించినంత మాత్రాన ఇది జరగదు. సూర్యుడి నుంచి భూమి ఉండే దూరం, ఆ భూమి వాలుగా తిరగడం, గురుత్వాకర్షణ శక్తి, ఇక్కడి నేల తీరు, నీటి లభ్యత, వాయువుల శాతం అన్నీ కలిసి అరుదైన జీవులు బతికేందుకు కావాల్సిన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. ఈ పరిస్థితులలో ఓ ముఖ్యమైన వ్యవస్థ- ఓజోన్ పొర. ఈ రక్ష ఛత్రం లేకపోతే సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు మనను తాకుతాయి. నిలువునా దహించేస్తాయి. భూమి నిలువెల్లా మండిపోతుంది. సున్నితమైన మనుషుల చర్మాల మీద ఆ ప్రభావం మరింత ప్రతికూలం. ఒక్కమాటలో చెప్పాలంటే వెల్డింగ్ మంట కింద




నేరుగా నిలబడినట్టే! తల్లి గర్భంలోని మాయపొరలా మనల్ని సంరక్షిస్తున్న ఆ ఓజోన్ పొరకు మన చేజేతులారా చిల్లులు పెట్టేస్తున్నాం. ఇది కచ్చితంగా మానవాళి స్వయంకృతాపరాధమే! ఓజోన్ అనే మాట మనకు కొత్త కాదు. ఓ నలభై ఏళ్ల నుంచి రకరకాల కథనాలు వింటూనే ఉన్నాం. ఓజోన్ పొర చిల్లుపడిందనీ, దానికి మానవ తప్పిదాలే కారణాలనీ చదువుతున్నాం. కొన్ని పరిశ్రమలు, కొద్ది దేశాలు కారణంగానే ఇలా జరిగిందన్న బలమైన అభిప్రాయం ఏర్పడింది. కానీ, ఇంట్లో మన మానాన మనం టీవీ చూస్తూ, పని సాగిస్తూ, వంట చేస్తూ, పడుకుంటూ బుద్ధిగా, భద్రంగా ఉండే మన చర్యలు నేరుగా ఆ ఓజోన్ పొరకు చిల్లు పెడుతున్నాయంటే నమ్మలేం, ఒప్పుకోం! కానీ ఇది నిజం. సమష్టిగానూ, ప్రత్యక్షంగానూ మనం చేసే చాలా పనులు ఓజోన్ పొరకు




విఘాతం కలిగిస్తున్నాయి. ఈ విషయం గురించి మరింత ప్రచారం చేసేందుకే ఏటా సెప్టెంబరు 16న 'ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు.

## సంతృప్తికరమైన గతం!

1970లలో కొంతమంది శాస్త్రవేత్తల పరిశోధనతో ఈ ప్రయాణం మొదలైంది. అప్పటికే నిత్యజీవితంలో భాగమైపోయిన 'సీఎఫ్‌సీ' అనే వాయువులు నేరుగా వాతావరణంలోకి కలిసిపోయి, ఓజోన్ పొర వరకూ వెళు_న్నాయనీ అక్కడి ఓజోన్ అణువులను విచ్ఛిన్నం చేస్తున్నాయని వారు కనుగొన్నారు. ఈ విషయాన్ని పరిశోధించిన కొందరికి నోబెల్ బహుమతి దక్కింది. ఈ విషయాన్ని అటు ప్రభుత్వాలు ఇటు పర్యావరణవేత్తలు తీవ్రంగా పరిగణించడంతో ఓజోన్ పొరకు విఘాతం కలిగించే రసాయనాలను నియంత్రించాలనే ఆచరణ మొదలైంది. 1987లో కెనడాలోని మాంట్రియల్ నగరంలో జరిగిన 'ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం' సమావేశంలో కార్యాచరణకు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే, చాలామందికి ఐక్యరాజ్యసమితి పరిధుల మీదా, ప్రభావం మీదా తీవ్రమైన అపనమ్మకాలు ఉంటాయి. ఈ మాంట్రియల్ ప్రొటోకాల్‌ను అందుకు జవాబుగా భావిస్తుంటారు. కానీ, ఈ విషయంలో అందుకు భిన్నంగా జరగడం విశేషం. ఐరాస సభ్యదేశాలన్నీ ఒక్కతాటి మీదకు రావడమే కాకుండా నాటి ఒప్పందాన్ని చాలా నిబద్ధతతో అమలు చేశాయి. 1980లలో కనిపించిన ఓజోన్ పొర చిల్లు చాలావరకు పూడుకుపోవడమే ఇందుకు నిదర్శనం. 1987 సెప్టెంబర్ 16 నాడు ఈ మాంట్రియల్ ఒప్పందానికి నాంది పలికారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుతున్నారు.

## వెంటాడే శత్రువు సీఎఫ్‌సీ

రిఫ్రిజిరేటర్లను కనిపెట్టిన కొత్తలో వాటిలో పదార్థాలను చల్లబరిచేందుకు అమోనియా, మీథేన్, సల్ఫర్ డయాక్సైడ్ లాంటి వాయువులను ఉపయోగించేవారు. వీటివల్ల అగ్ని ప్రమాదాలు జరగడం, ఫ్రిజ్‌లో పెట్టిన పదార్థాలు వాసన రావడం లాంటి సమస్యలు ఉండేవి. ఇందుకు విరుగుడుగా క్లోరిన్, ఫ్లోరిన్, కార్బన్ అణువులను కలిపిన సీఎఫ్‌సీలను రూపొందించారు. వీటి తయారీ తేలిక, ప్రమాదాలు తక్కువ. కాబట్టి 1930ల నుంచి విచ్చలవిడిగా వీటి వాడకం మొదలైంది. ఈ సీఎఫ్‌సీకి హైడ్రోజన్ కలిపితే వచ్చే హెచ్‌సీఎఫ్‌సీలు కూడా వినియోగంలోకి వచ్చాయి. ఓ రకంగా వీటి ఆవిష్కరణ సంచలనమే. ఎయిర్ కండిషనర్ లాంటి పరికరాల పనితీరును అవి మార్చేశాయి. సీఎఫ్‌సీ అంటే కేవలం ఒకే పదార్థం కాదు. ఇందులో చాలా రకాలుంటాయి. వీటి అణువుల కలయికలో మార్పులు, చేర్పులు చేస్తూ క్లోరోడైఫ్లోరోమీథేన్, క్లోరోఫ్లోరోమీథేన్, బ్రోమోక్లోరోడైఫ్లోరోమీథేన్ ఇలా రకరకాల రసాయనాలను సృష్టించారు. వీటి వాడకం కేవలం ఫ్రిజ్‌లు, ఏసీలకు మాత్రమే పరిమితం కాలేదు. మంటలను ఆర్పేందుకు, ప్యాకింగ్ చేసేందుకు, యంత్రాలను శుభ్రం చేసేందుకు ఇలా చాలా సందర్భాలలో వినియోగించడం మొదలుపెట్టారు. ఫోమ్ తరహా నిర్మాణం ఏర్పడేందుకు (బ్లోయింగ్ ఏజెంట్), బాటిల్ లోపల ఉన్న ద్రవం వాయువు రూపంలో బయటికి వచ్చేందుకు (ఏరోసోల్) సీఎఫ్‌సీలను విచ్చలవిడిగా వాడేశారు. దీనర్థం మన పరుపుల్లో వాడే ఫోమ్, డియోడరెంట్లకి వాడే స్ప్రే, కుర్చీలకు వాడే ప్లాస్టిక్ అన్నిటిలోనూ సీఎఫ్‌సీ ఉండేదన్నమాట. ఇంత అమాయకంగా కనిపిస్తూ, విశ్వవ్యాప్తం అయిపోయిన సీఎఫ్‌సీలు ఓజోన్‌కు చిల్లుపెడతాయనే ఆవిష్కరణ ప్రపంచానికి ఓ షాక్!

## అనూహ్యమైన నష్టం!

1980ల నాటికి సీఎఫ్‌సీలతో తయారయ్యే పదార్థాలు కొన్ని లక్షల టన్నులకు చేరుకున్నాయి. ఇవి ఓజోన్ పొరను విచ్ఛిన్నం చేస్తాయనే వాదన ఆశ్చర్యంగా ఉండవచ్చు కానీ జరిగింది అదే. సీఎఫ్‌సీ అణువులు భూమి ఉపరితలాన్ని చేరుకోగానే, సూర్యరశ్మి వల్ల అందులోని క్లోరిన్ అణువు విడిపోతుంది. ఇక ఓజోన్ అనేది మూడు ఆక్సిజన్ అణువుల కలయిక (ఓ3). సీఎఫ్‌సీ నుంచి విడిపోయిన క్లోరిన్ అణువు, ఓ3 లోని ఒక ఆక్సిజన్ కణంతో కలుస్తుంది. దాంతో ఓ3 కాస్తా 02 గా మారిపోయి వాతావరణంలో కలిసిపోతుంది. ఇది ఒకసారి జరిగితే పెద్ద సమస్య కాకపోవచ్చు. మళ్లీ మళ్లీ క్లోరిన్ అణువు విడిపోవడం, అక్కడ ఉన్న ఓజోన్ అణువులను విచ్ఛిన్నం చేయడం ఇలా దాదాపు లక్షసార్లు జరుగుతుందట. అంటే! ఒకే ఒక్క సీఎఫ్‌సీ అణువు వల్ల లక్ష ఓజోన్ అణువులు నాశనం అయిపోతాయి. సీఎఫ్‌సీల కోసం వాడే మరో రసాయనమైన బ్రోమిన్ మరింత ప్రమాదకరమని చెబుతారు. ఇక్కడ మనం గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే ఓజోన్ పొర అని పేరు ఉన్నంత మాత్రాన అది వ్యాపించి ఉన్నంతమేరా దట్టంగా ఓజోన్ అణువులు ఉంటాయని కాదు. అవి ఆ పొరలో తేలుతూ ఉంటాయంతే! ఓ 15 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఆ పొరలోని ఓజోన్ అణువులను కనుక దగ్గరికి నొక్కితే కేవలం మూడు మిల్లీమీటర్ల మందాన మాత్రమే ఆ పొర ఉంటుంది. దీన్నిబట్టి అవి ఎంత అపురూపమో అర్థమవుతుంది.




## నిరంతరం యుద్ధం!

1970ల నాటికి కానీ సీఎఫ్‌సీల వల్ల జరిగే హాని గురించి లోకానికి తెలియలేదు. అప్పటికే ఆ సాంకేతికతతో వాడే కొన్ని లక్షల ఫ్రిజ్‌లు, ఏసీలు లోకాన్ని ముంచెత్తాయి. పైగా సీఎఫ్‌సీలతో రూపొందించిన పాత వస్తువులను రీసైకిల్ చేసినప్పుడు కూడా కొంత నష్టం జరుగుతుంది. అందుకే ఈ రసాయనాలను పూర్తిగా నిషేధించిన తర్వాత కూడా వాటి ప్రభావం మరో 50 ఏళ్ల వరకూ ఉంటుందని అంచనా. పైగా ఈ సీఎఫ్‌సీ సాంకేతికత మీద ఆధారపడే డ్యూపాంట్ లాంటి కొన్ని సంస్థలు మొదట్లో తమ ఉత్పత్తులు హానికరమనే విషయాన్ని ఒప్పుకోలేదు. కానీ, ఓజోన్ పొర ఎన్నడూ లేనంత దారుణంగా పలచబడిందనే శాస్త్రవేత్తల హెచ్చరికతో ఐరాసలోని సభ్యదేశాలు మాంట్రియల్ ఒప్పందానికి సిద్ధపడక తప్పలేదు. ఆ తర్వాత క్యోటో ప్రోటోకాల్, కిగాలి అమెండ్‌మెంట్ లాంటి మరిన్ని ఒప్పందాలతో సీఎఫ్‌సీ, హెచ్‌సీఎఫ్‌సీ, (hydrochlorofluorocarbons)ల మీద ఉక్కుపాదం మోపాయి. ఇదంతా ఒక్కరోజులో జరిగింది కాదు. అలా సాధ్యమూ కాదు. కొన్ని దశాబ్దాల మేర పరుచుకున్న ప్రయాణమిది. ఇప్పటికీ అనధికారికంగా చైనాలో వీటి వినియోగం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. వైద్యం లాంటి అత్యవసర పరిస్థితుల్లోనూ వీటి వినియోగం ఉంది. కానీ, మునుపటితో పోలిస్తే వాటి ఉనికి దాదాపు 99 శాతం తగ్గిపోయినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

## ఓజోన్ పల్చబడితే..

సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల నుంచి రక్షించే ఓజోన్ పొర కనుక పల్చబడితే భూమ్మీద ఉన్న సకల జీవరాశుల మీదా కచ్చితమైన, స్పష్టమైన ప్రభావం ఉంటుంది. మనుషులులో ఇది చర్మవ్యాధులు, క్యాన్సర్, శుక్లాలు, కంటిచూపు కోల్పోవడం, రోగనిరోధక శక్తి తగ్గిపోవడం లాంటి సమస్యలకు దారితీస్తుంది. ఎలాంటి రక్షణా లేని జంతువుల శరీరాల మీద దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. నీటిలో తేలియాడే చిన్న నాచులాంటి పదార్థాలను 'ఫైటోప్లాంక్టన్' అంటారు. చిన్న చేపలు వీటిని తినే బతుకుతాయి.



వాటిని తిని పెద్ద చేపలు ఇలా సముద్ర జీవుల ఆహార వలయానికి ఈ ఫైటోప్లాంక్టన్స్ చాలా కీలకం. అతినీలలోహిత కిరణాలు వీటిని నాశనం చేస్తాయి. ఫలితంగా సముద్రంలో జీవరాశి తగ్గిపోతుంది. చెట్ల మీద అతినీలలోహిత కిరణాల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆకుల పరిమాణం తగ్గిపోవడం, అవి సూర్యరశ్మి నుంచి ఆహారం తయారుచేసుకోలేకపోవడం కనిపిస్తుంది. పూలు, పండ్ల ఉత్పత్తి తగ్గిపోతుంది. త్వరగా చీడపీడలకు గురవుతాయి. ఓజోన్ పొర పల్చబడటం వల్ల కలిగే నష్టాల జాబితా చాలా పెద్దదే. ఒక్కమాటలో చెప్పాలంటే మాత్రం అది ప్రాణాంతకం!

## అయినా మనిషి మారలేదు!

సీఎఫ్‌సీలను నిషేధించేసినంత మాత్రాన, ఓజోన్ పొర క్షేమంగా ఉన్నట్టు కాదు. తెలిసో, తెలియకో, పట్టించుకోకనో మనం చేసే పనులు, వాడే ఉత్పత్తులు నేరుగా ఓజోన్ పొరకు ఎక్కుపెడుతున్నాయి. ఉదాహరణకు క్లోరిన్ వాడకం! నీళ్లలో బ్యాక్టీరియాను చంపడం దగ్గర నుంచీ, కాగితం తయారీ వరకూ చాలా చోట్ల క్లోరిన్ ఉపయోగిస్తారు. నిస్సందేహంగా ఇది పర్యావరణానికి ప్రమాదకరమే. ఇక బ్రోమిన్ పరిస్థితి కూడా ఇంతే! రంగులు, పురుగుమందులు, మందులు లాంటి ఉత్పత్తులలో బ్రోమిన్ వాడకం విచ్చలవిడిగా కనిపిస్తుంది. ఇప్పటి ఏసీలలో, ఫ్రిజ్‌లలో సీఎఫ్‌సీలు లేవని సంబరపడిపోవడానికి వీల్లేదు. వాటిని విచ్చలవిడిగా వాడటం వల్ల చాలా కరెంటే ఖర్చవుతుంది. మరి ఆ విద్యుత్తును ఎలా ఉత్పత్తి చేస్తున్నాం? ఇప్పటికీ లోకంలో 80 శాతం విద్యుత్తు బొగ్గు, గ్యాస్ లాంటి పరిమిత వనరుల నుంచే తయారుచేస్తున్నారు. వీటిని విద్యుత్తు కిందకి మార్చే ప్రక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువులు అంతులేనంతగా వెలువడుతున్నాయి. ఓజోన్ పొరకు చిల్లు పెడుతున్నాయి. డియోడరెంట్ల నుంచి పురుగుమందుల వరకూ'ఏరోసోల్' అనే సాంకేతికత మీదే ఆధారపడుతున్నాం. ఇలా బటన్ నొక్కగానే, అలా ద్రవం బయటకు చిమ్మాలని మన అంచనా. కానీ, ఈ ప్రక్రియ కోసం చాలా హానికారక రసాయనాలను వాడతారని గమనించం. అంతేకాదు. బాటిల్ నుంచి బయటకు వచ్చిన సూక్ష్మమైన 'ఏరోసోల్స్' గాలిలో తేలియాడుతూ ఉంటాయి. సూర్యకాంతిని అడ్డుకోవడం నుంచి దుమ్మును చేర్చుకోవడం వరకూ ఇవి సవాలక్ష సమస్యలకు దారి తీస్తున్నాయి. రోజురోజుకూ మాంసాహారం పట్ల ఆసక్తి పెరిగిపోతున్నది. అప్పుడప్పుడు తినే అలవాటును మించి మాంసాహారాన్ని భుజిస్తున్నారు. కార్బన్ డై ఆక్సైడ్ కంటే ప్రమాదకరమైన నైట్రస్ ఆక్సైడ్, మీథేన్ పెరిగిపోవడానికి ఇది ముఖ్య కారణం. ఓ అంచనా ప్రకారం మనం ఉత్పత్తి చేస్తున్న మొత్తం నైట్రస్ ఆక్సైడ్‌లో 65 శాతం పశువుల పెంపకం నుంచే వెలువడుతున్నది.

## చిన్నచిన్న చర్యలతో చెక్!

ఇంధన వనరుల్ని అది కరెంటు కావచ్చు, పెట్రోల్ కావచ్చు! ఎంత తక్కువగా వాడితే అంత మంచిది. చాలామంది బ్యాటరీ వాహనాలు వాడుతున్నాం కదా అని సంబరపడుతుంటారు. కానీ దాన్నికూడా విద్యుత్తుతో చార్జ్ చేయాల్సిందే కదా! ప్రభుత్వాలు సహజమైన లేదా తక్కువ రసాయనాలతో పనిచేసే ఉత్పత్తులను ప్రోత్సహించాలి. ఉదాహరణకు అయస్కాంత క్షేత్ర ఆధారంగా రూపొందించే రిఫ్రిజిరేటర్లలలో ఎలాంటి రసాయనం వాడాల్సిన పనీ లేదు. వాటికి విద్యుత్ కూడా చాలా తక్కువ ఖర్చవుతుంది. మన ఇళ్లలో వాసనలు పోయేందుకు, మరకలు వీడేందుకు ఘాటైన కెమికల్స్ వాడే అలవాటు పెరిగిపోయింది. వీటిలో క్లోరిన్ లాంటి పదార్థాలు చాలా ఎక్కువగా, ప్రమాదకర స్థాయిలో ఉండే అవకాశం ఉంది. వాడిపారేసే (సింగిల్ యూసేజ్) ఉత్పత్తుల వాడకం తగ్గించడం వల్ల వృథా తగ్గడమే కాకుండా, ప్లాస్టిక్ లాంటి పదార్థాల స్థాయి తగ్గుతుంది. భూమికి భారం, కష్టం ఉండవు. రంగులైనా, సుగంధ ద్రవ్యాలైనా, ఆహార పదార్థాలైనా మన నిత్య జీవితంలో వాడే ప్రతి ఉత్పత్తీ వీలైనంత సహజంగా ఉండేట్లు చూసుకుంటే చాలు. మాంట్రియల్ ఒప్పందం పుణ్యమా అని ఐరాసలోని సభ్యదేశాలన్నీ తీసుకున్న చొరవ వల్ల 1990ల నాటికి ఓజోన్ పొర మళ్లీ పుంజుకోవడాన్ని గమనించారు. కానీ ఇంతకుముందు అనుకున్నట్టు ఓసారి వాతావరణంలోకి చేరిన సీఎఫ్‌సీల ప్రభావం కొన్ని దశాబ్దాల వరకూ ఉంటుంది. అందుకే ఓజోన్ పొర ఆరోగ్యకరమైన స్థాయికి చేరుకోవడానికి మరో 50 ఏళ్లు పడుతుందని అంచనా! అది సాధ్యమా కాదా అన్నది మన చేతుల్లోనే ఉంది.

## ధ్రువ ప్రాంతాల్లోనే ఎందుకు?

ఓజోన్ పొర అంటార్కిటిక్ దగ్గర మాత్రమే పల్చబడటం చూసి మొదట్లో ఇది సహజ పరిణామం అని వాదించేవారు. అక్కడ ఉండే ఉష్ణోగ్రతల వల్ల ఓజోన్ పొర కొంత పల్చబడే మాట వాస్తవమే. కానీ అక్కడ స్తబ్ధుగా, అతి శీతలంగా ఉండే వాతావరణంలో క్లోరిన్, బ్రోమిన్‌ల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని తేలింది. అంతేకాదు అక్కడి చీకటి వాతావరణంలో సీఎఫ్‌సీ అణువులు నెలల తరబడి పేరుకుని ఉంటాయి. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఎప్పుడైతే ఒక్కసారిగా సూర్యరశ్మి వాటిని తాకుతుందో ఓ విస్ఫోటనం లాంటి చర్యకు దారితీస్తుంది. ఫలితంగా ఓజోన్ చిల్లు అక్కడే కనిపిస్తున్నది.

## భారత్ భేష్!

ఓజోన్ పొరను విచ్ఛిన్నం చేసే పదార్థాలను ఓజోన్ డిప్లిటింగ్ సబ్‌స్టెన్సెస్ (ఓడీఎస్)గా పిలుస్తారు. వీటి విషయంలో మన దేశం చాలా కఠినంగానే వ్యవహరిస్తున్నది. ఇందుకోసం అటవీ పర్యావరణ శాఖలో 'ఓజోన్ సెల్' పేరిట ఓ ప్రత్యేక విభాగాన్నే ఏర్పాటుచేసింది. కఠినమైన నిబంధనలూ చేర్చింది. 2010 నుంచి సీఎఫ్‌సీలు, 2020 నుంచి హెచ్‌సీఎఫ్‌సీల ఉత్పత్తిని నిలిపివేయాలని హెచ్చరించింది.

## గ్రీన్ హౌజ్ గ్యాసెస్

భూతాపం పెరగడానికి గ్రీన్ హౌజ్ వాయువులు ఓ ముఖ్య కారణమని మనకు తెలుసు. వీటితో భూతాపం పెరగడం వల్ల రుతువులు అస్తవ్యస్తం అయిపోవడం, ఊపిరితిత్తుల సమస్యలు, సముద్ర మట్టం పెరగడం లాంటి సమస్యలతోపాటు ఓజోన్ పొర కూడా దెబ్బతింటుంది. మనం చెప్పుకొంటున్న సీఎఫ్‌సీలతోపాటుగా కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ లాంటి వాయువులు కూడా ఈ గ్రీన్ హౌజ్ వాయువులలో భాగమే. కాబట్టి ఓజోన్‌పొరతో పాటుగా భూమి కూడా సురక్షితంగా ఉండేందుకు ఈ వాయువుల్ని విడుదల చేసే పనులు కూడా మానుకోవాలని సూచిస్తున్నారు. ఉదాహరణకు ఇంధనాలను మండించడం వల్ల కర్బన వాయువు విడుదల అవుతుంది, ఎరువుల విచ్చలవిడి వాడకం వల్ల నైట్రస్ వాయువు ఉత్పత్తి అవుతుంది. కాబట్టి వీటి మీద కూడా వీలైనన్ని పరిమితులు విధించాలన్న వాదన బలపడుతున్నది.

## అనూహ్యమైన కారణాలు

సీఎఫ్‌సీలు, గ్రీన్ హౌజ్ వాయువులు లాంటి పరిస్థితులు మానవ తప్పిదాల వల్ల ఓజోన్ పల్చబడుతుందని తెలిసిందే. దీంతోపాటు కొన్ని అనూహ్యమైన కారణాలు కూడా ఈ పరిస్థితికి కారణం అవుతాయి

1. రాకెట్లను ప్రయోగించినప్పుడు, వాటినుంచి భారీ మొత్తంలో విడుదల అయ్యే ప్రమాదకర వాయువులు నేరుగా ఓజోన్ పొరను విచ్ఛిన్నం చేస్తున్నాయని తేలింది. ప్రతి చిన్న సంస్థా, దేశమూ అపరిమితంగా చేస్తున్నఈ రాకెట్ ప్రయోగాల వల్ల 2050 నాటికి ఓజోన్ పొరకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు. 2. అగ్నిపర్వతాల నుంచి వెలువడే హైడ్రోజన్ క్లోరైడ్ లాంటి రసాయనాలు ఓజోన్ పొరకు హాని చేస్తున్నాయని దశాబ్దాల క్రితమే గ్రహించారు. 3. సముద్రపు అలల వల్ల అందులో సహజంగా ఉండే క్లోరిన్ వాతావరణంలోకి కలుస్తుంది. అది నిదానంగా ఓజోన్ వరకూ చేరే ప్రమాదం ఉంటుంది. ఇవే కాకుండా సూర్యుడి నుంచి వచ్చే వేడిని ప్రభావితం చేసే సన్ స్పాట్స్, స్ట్రాటోస్ఫియర్ (ఓజోన్ పొర ఉండే భాగం)లో పీడనం కూడా ఓజోన్ పొర మీద ప్రతికూల ప్రభావం చూపిస్తాయి.

